www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

వైమానిక కుంభమేళా..!

రక్షణ రంగం పటిష్ఠతతోనే శాంతి

శాంతి, స్థిరత్వమే భారత ప్రతిపాదన

ఏరో ఇండియా-2025

ప్రారంభంలో రాజ్‌నాథ్‌సింగ్ 2



బెంగళూరులో ప్రారంభమైన ఏరో ఇండియా ప్రదర్శనలో సూర్యకిరణ్ విమానాల విన్యాసం

మంగళవారం | 11-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 314 | వరంగల్


శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 6.56 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పుష్యమి రా. 6.34 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.9.04-9.49, రా.10.19-11.08; అమృతఘడియలు: మ.12.01-1.39; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.11

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేర ప్రజాప్రతినిధులపై

శాశ్వత నిషేధం!

3 వారాల్లో మీ అభిప్రాయం చెప్పండి.. కేంద్రం, ఈసీకి సుప్రీం ఆదేశం



రాజకీయాలు నేరమయం కావడం తీవ్ర అంశమని ధర్మాసనం వ్యాఖ్య

క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలిన వారు పార్లమెంటుకు ఎలా వస్తారని విస్మయం

42 శాతం మంది సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులుండడం సిగ్గుచేటు

శిక్ష పడ్డ ప్రజాప్రతినిధులపై కేవలం ఆరేళ్ల పాటే అనర్హత వేటు వేస్తారా?

వారిపై శాశ్వత వేటు వేయాలి.. చట్టాలు చేసేవారు పవిత్రంగా ఉండాలి

దోషిగా తేలిన వ్యక్తి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండడం సరైనదేనా?

ప్రజాప్రాతినిధ్య చట్టంలో సెక్షన్ 8కి రాజ్యాంగబద్ధత ఉందా: అమికస్ క్యూరీ

మీరు ఆమోదించకుంటే చెల్లని బిల్లులైపోతాయా?

తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం ప్రశ్న

> శిక్షపడిన వారిని పార్టీ పదవుల్లో ఉండరాదని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తో పార్టీని నడిపిస్తారు. అందువల్ల అన్ని రకాల పరిస్థితులను ఊహించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మేం తీసుకునే నిర్ణయం లోపభూయిష్టంగా ఉండరాదు. దాని వల్ల తీర్పు ఎలాంటి ప్రభావం చూపకపోగా, వ్యవస్థపై ప్రజలు మరింతగా విశ్వాసం కోల్పోతారు.
>
> - సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడి శిక్ష పడ్డ రాజకీయ నేతలు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా నిషేధం విధించడంపై మూడు వారాల్లోగా అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. రాజకీయాలు నేరమయం కావడం తీవ్రమైన అంశమని ఆందోళన వెలిబుచ్చింది. చట్టసభల ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయాలని, శిక్ష పడ్డవారిపై శాశ్వత వేటు వేయాలని కోరుతూ.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8, 9 సెక్షన్ల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ 2016లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సోమవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. ఏదైనా క్రిమినల్ కేసులో దోషిగా తేలినవారు అసలు చట్టసభలకు ఎలా తిరిగి వస్తారని విచారణ సందర్భంగా ప్రశ్నించింది. ఒక ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి పాల్పడినట్టు తేలినా, ప్రభుత్వానికి అవిధేయుడుగా ఉన్నట్టు తేలినా ఆ వ్యక్తిని సర్వీసులో కొనసాగడానికి అనర్హుడిగా భావిస్తారని.. కానీ, అదే వ్యక్తి మంత్రిగా కొనసాగొచ్చని ఆశ్చర్యం వెలిబుచ్చింది. నేరచరిత్ర ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలను శాశ్వతంగా చట్టసభల్లో ప్రవేశించకుండా వేటువేయాలనే

మిగతా 2వ పేజీలో...

తగినంత అంటే ఇంకెంత?

స్పీకర్ దృష్టిలో సహేతుక సమయం అంటే ఏంటి?

విషయం ఆయన దగ్గరకు వెళ్లి పది నెలలు అవుతోంది

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో సుప్రీం వ్యాఖ్య

తదుపరి విచారణ 18కి వాయిదా 12



గనులు, ఖనిజాభివృద్ధిపై సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇసుకపై నిఘా హైడ్రాకు

హైదరాబాద్ పరిసరాల్లో అక్రమ రవాణా నియంత్రణ బాధ్యత అప్పగింత

సీఎం రేవంత్ కీలక నిర్ణయం.. ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం మోపాలి

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక.. పేదలకు తక్కువ ధరకే అందించాలి

ఇసుక రవాణాపై పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు.. నేనే తనిఖీలు చేస్తా

గనుల సమీక్షలో వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్రంలో సేకరిస్తున్న ఇసుకలో 80 శాతం హైదరాబాద్‌లో వినియోగం అవుతున్న నేపథ్యంలో రాజధాని నగరం పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే కీలక బాధ్యతను ఐపీఎస్ రంగనాథ్ నేతృత్వంలోని హైడ్రాకు అప్పగించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకొనే బాధ్యతను హైడ్రా చేపట్టిన సంగతి తెలిసిందే. గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి తన నివాసంలో అధికారులతో సమీక్షించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లకు ఉచిత ఇసుకను అందించడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

మిగతా 13వ పేజీలో...

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు షురూ 13

మీ-సేవ కేంద్రాల వద్ద బారులు

కుటుంబ సభ్యులందరి ఆధార్, ఇంటి విద్యుత్తు బిల్లు తప్పనిసరి

ప్రతి దరఖాస్తుకు రూ.50 ఫీజు

2 ఎకరాల రైతుకు చేరిన 'భరోసా'!

34.69 లక్షల మంది ఖాతాల్లో రూ.2218.49 కోట్లు జమ

3000 కోట్లు రాబట్టొచ్చు



జీఎస్టీ స్కాంపై ఉన్నతస్థాయి కమిటీ అంచనా

పన్ను ఎగవేత, పెనాల్టీలు, ఐటీసీ క్లెయిమ్‌లు

డీలర్ల నుంచి 3 రకాలుగా డబ్బు రాబట్టే చాన్స్

ఇప్పటికే 76 కంపెనీలు, డీలర్లకు నోటీసులు

ఏకంగా రూ.21 కోట్లు చెల్లించిన ఓ కంపెనీ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కుంభకోణంలో అక్రమార్కుల నుంచి రూ.3,000 కోట్ల వరకు వసూలు చేయాలని ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీ ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఓ కంపెనీ నుంచి రూ.21 కోట్లను వసూలు చేసినట్లు సమాచారం. రకరకాలుగా జరిగిన అక్రమాలన్నింటినీ కమిటీ తవ్వి తీసి, అవకతవకలకు పాల్పడిన కంపెనీలు, డీలర్లకు నోటీసులు జారీ చేసిందని అత్యంత విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎలాంటి వస్తువులు విక్రయించక పోయినా విక్రయించినట్లు కొంత మంది డీలర్లు దొంగ 'ట్యాక్స్ ఇన్వాయిస్'లను సృష్టించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను కొల్లగొట్టినట్లు ఏడాది కిందట రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనరేట్ గుర్తించింది. మరో కేసులో ఎలక్ట్రిక్ బైక్‌లను తయారు చేయకపోయినా

మిగతా 13వ పేజీలో...

బీర్ల ధరలు

15% పెంపు

ధరల నిర్ణయ కమిటీ సిఫారసులను ఆమోదించిన ప్రభుత్వం

నేటి నుంచే అమల్లోకి కొత్త ధరలు



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో చల్లటి బీర్లు ప్రియం కానున్నాయి. బీర్ల ధరలు 15 శాతం పెరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)పై 15 శాతం పెంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. చివరిసారిగా మూడేళ్ల క్రితం ధరలు పెరిగాయి. అయితే రెండేళ్లకోసారి ధరలను పెంచాలని ఎక్సైజ్ చట్టం చెబుతోంది. గత ఏడాది

మిగతా 14వ పేజీలో...

బీర్ల ధరలు (రూపాయల్లో)..

బీరు	ప్రస్తుత ధర	కొత్త ధర
కేఎఫ్ లైట్	150	172.5
కేఎఫ్ ప్రీమియం	160	184
హేవార్డ్స్	160	184
టూబర్గ్ లైట్	185	212.75
కేఎఫ్ అల్ట్రా	210	241.5
బడ్వైజర్ లైట్	210	241.5
కేఎఫ్ అల్ట్రా మ్యాక్స్	220	253
బడ్వైజర్ మ్యాగ్నం	220	253
టూబర్గ్ స్ట్రాంగ్	240	276

రంగరాజన్‌కు సీఎం ఫోన్



అండగా ఉంటామని భరోసా

చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

సనాతన ధర్మంపై దాడి: కిషన్‌రెడ్డి

రంగరాజన్‌ను పరామర్శించిన సురేఖ

దాడులను సహించం: శ్రీధర్‌బాబు

శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు: కేటీఆర్

దాడికి కారణాలను పోలీసులు నిగ్గుతేల్చాలి: పవన్ కల్యాణ్ 10



సింగపూర్‌లోని ఐటీఈ క్యాంపస్

15 రంగాలు.. ఏటా

30 వేల ఉద్యోగాలు

స్కిల్స్ యూనివర్సిటీ భారీ ప్రణాళిక

సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలు

త్వరలో రాష్ట్రానికి సింగపూర్ బృందం

భాగస్వామ్యానికి పారిశ్రామికవేత్తల ఆసక్తి

చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగావకాశమన్న మంత్రి శ్రీధర్‌బాబు

స్కిల్స్ యూనివర్సిటీకి నిధులివ్వాలనే ప్రతిపాదనలేమీ లేవు: కేంద్రం

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుడు అక్టోబరులో నాలుగు విభాగాల్లో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించిన ఈ విశ్వవిద్యాలయం.. తాత్కాలిక క్యాంపస్‌లోనే మరిన్ని కొత్త

మిగతా 14వ పేజీలో...

పసిడి @ 88,500

10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజే రూ.2,430 పైకి..



11



కోస్గిలో జరిగిన రైతు దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

14

కొడంగల్‌లో రాజీనామా చేసి గెలిస్తే

రాజకీయ సన్యాసం చేస్తా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

కేసీఆర్ తీసిపెట్టిన రైతుబంధు డబ్బులే తప్ప కాంగ్రెస్ ఒక్క రూపాయి ఇవ్వలే

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.. రైతు దీక్షలో కేటీఆర్

చివరిరోజు నామినేషన్ల జోరు

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100, ఉపాధ్యాయ స్థానానికి 17

నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి 23 మంది నామినేషన్లు

నేడు పరిశీలన.. 13 వరకు ఉపసంహరణకు గడువు.. 27న పోలింగ్

మోదీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం

రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ 3

రిజర్వేషన్లు పాత పద్ధతిలోనే!



స్థానిక సంస్థల ఎన్నికల్లో అదే విధానం

50 శాతానికి మించకుండా ఉండేందుకే..

ఆరు కేటగిరీల్లో బీసీల రిజర్వేషన్ల అమలు

పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీల వారీగా ప్రభుత్వానికి ప్రత్యేక కమిషన్ నివేదిక

త్వరలో క్యాబినెట్ భేటీ.. ఆపై రిజర్వేషన్ల ఖరారు

20 రోజుల్లో మునిసిపాలిటీ, కార్పొరేషన్ల నివేదిక

తొలుత సర్పంచ్ ఎన్నికల నిర్వహణ

త్వరలో సీఎంకు వివరాలివ్వనున్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఈసారి కూడా పాత విధానంలోనే రిజర్వేషన్లు అమలు కానున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి మొత్తం 50 శాతం మించరాదంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు మేరకు ఇవి అమలు కానున్నట్లు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటైన ప్రత్యేక కమిషన్.. ఈ అంశంపై లోతైన అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. రాష్ట్రంలోని 12,848 గ్రామపంచాయతీలు, 570 మండలాలు, 570 జడ్పీటీసీలు, 5,817 ఎంపీటీసీ స్థానాల వారీగా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రత్యేక కమిషన్ పలు సిఫారసులు చేసింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు సోమవారం సాయంత్రం బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారి ఇ.శ్రీధర్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి నివేదికను అందజేశారు. మొత్తం ఆరు కేటగిరీల్లో రిపోర్టును ప్రత్యేక కమిషన్ తయారు చేసింది. అయితే బీసీలకు ఎంత మేర రిజర్వేషన్లను కేటాయించాలన్నది కమిషన్ సూచించినప్పటికీ.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పును మాత్రం అమలు చేయాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుతం స్థానిక సంస్థలకు సంబంధించిన నివేదికను అందించిన కమిషన్.. మరో 20 రోజుల్లో

మిగతా 12వ పేజీలో...

పంచాయతీ పోరు.. పరీక్షల తర్వాతే?

ముందుగా పెట్టాలంటే పరుగులు తీయాల్సిందే

3 విడతల్లో నిర్వహించాలని ఎన్నికల సంఘం యోచన

బ్యాలెట్ బాక్సుల సేకరణ, బూత్‌ల గుర్తింపు పూర్తి 12

రాబోయే నాలుగేళ్లలో
63లక్షల ఎయిడ్స్ మరణాలు!

- అనాథలవ్వనున్న 34 లక్షల చిన్నారులు
- ఐరాస ఎయిడ్స్ విభాగం ఆందోళన
- ట్రంప్ సాయం నిలిపివేయడమే కారణం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఎయిడ్స్ మహమ్మారి 2029కల్లా విశ్వరూపం చూపే ప్రమాదముందని ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఎయిడ్స్ విభాగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా ఇస్తున్న అంతర్జాతీయ సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణమని ఐరాస ఆరోపిస్తోంది. మూడు దశాబ్దాలకు పైగా ఐరాస 160కి పైగా దేశాల్లో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను చేపడుతోంది. ఐరాసకు అమెరికా ఏటా పేదరిక నిర్మూలన, వ్యాధుల నిర్మూలన, మానవతాసాయానికి రూ.3,83,160 కోట్లను విరాళంగా అందజేస్తోంది. ఈ విరాళాలను యూఎస్ఎయిడ్ ఫండ్ నుంచి పంపిణీ చేస్తారు. ఈ ఎయిడ్‌లో పనిచేసే 13 వేల మంది సిబ్బందిని తొలగించడమే కాకుండా.. గ్రాంట్లపై 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తూ ట్రంప్ ఉత్తర్వులిచ్చారు. దాంతో.. యూఎస్ఎయిడ్స్‌కు అందే విరాళాలు కూడా నిలిచిపోయాయి. ఎయిడ్స్ కేసులు ఎక్కువగా ఉన్న ఇథియోపియా, ఉగాండా, మొజాంబిక్ వంటి దేశాలకు అమెరికా నుంచి ఏటా రూ.3,498 కోట్ల సాయం అందుతుందని, ఈ సాయం ఆగిపోతే.. ఎయిడ్స్ కేసులు ఏ స్థాయిలో పెరుగుతాయో ఊహించలేమని ఐరాస ఎయిడ్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విన్నీ బయాన్యిమా ఆందోళన వ్యక్తం చేశారు. "2029 కల్లా 63 లక్షల ఎయిడ్స్ మరణాలు సంభవిస్తాయి. కొత్తగా 87 లక్షల మంది ఎయిడ్స్ బారిన పడే ప్రమాదముందని అంచనా. అంతేకాదు.. ఎయిడ్స్ బాధితుల పిల్లలు సుమారు 34 లక్షల మంది అనాథలుగా మారుతారు" అని ఆమె ఆమె వాపోయారు. కాగా, యూఎస్ఎయిడ్‌కు నిధులను నిలిపివేయడానికి కారణాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్, టెస్లా అధినేత ఈలాన్ మస్క్ ఇప్పటికే పలు వేదికలపై వివరించారు. యూఎస్ఎయిడ్‌లో పనిచేస్తున్న వారు ఉగ్రవాదులు/తీవ్రవాదులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అందుకే.. ఆ సంస్థలో పనిచేస్తున్న వారిని తొలగించామన్నారు.

గాజాకు తిరిగి వచ్చే హక్కు పాలస్తీనియన్లకు ఉండదు



- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్, ఫిబ్రవరి 10: యుద్ధభూమిగా మారిన గాజాను అమెరికా స్వాధీనంలోకి తెచ్చుకుంటుందని గతంలో చెప్పిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో ఆసక్తికర ప్రకటన చేశారు. గాజా అమెరికా ఆధీనంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాంతంలోకి తిరిగి వచ్చే హక్కును పాలస్తీనావాసులకు ఇవ్వబోమని చెప్పారు. ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్తులో తాము నివాసముండే స్థలం గాజాయేనని పాలస్తీనావాసులు భావిస్తుండగా, వారిలో ఆ భావన తొలగేలా కృషిచేయాలని ట్రంప్ తన మిత్రదేశాలైన జోర్డాన్, ఈజిప్టుపై ఒత్తిడి తెస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "పాలస్తీనియన్లకు ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి కొంచం దూరంలో సురక్షితమైన ఆవాసాలను నిర్మిస్తాం. ఈలోగా ఈ ప్రాంతాన్ని నేను తీసుకుంటాను. భవిష్యత్తులో దీన్నొక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా చూడండి. ఇది చాలా అందమైన ప్రదేశం. పెద్దగా సొమ్ము కూడా అవసరం లేదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, పాలస్తీనాను సౌదీ అరేబియాలో ఏర్పాటు చేసుకోవాలంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అందుకు తగినంత భూమి సౌదీలో ఉందన్నారు. 'సౌదీ ప్రజలు సౌదీ అరేబియాలో పాలస్తీనాను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడ చాలా భూమి ఉంది. అక్టోబరు 7 ఘటనల తర్వాత ఇక్కడ పాలస్తీనా ఏర్పాటును మేం అనుమతించం' అని తేల్చిచెప్పారు. నెతన్యాహూ వ్యాఖ్యలను సౌదీ తీవ్రంగా ఖండించింది.

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదులో తమిళనాడు, హిమాచల్, కేరళ టాప్

- కాలేజీ సాంద్రతతో రెండో స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: 2021-22లో ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు విషయంలో తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ ఉత్తమ ప్రదర్శన కనబర్చాయని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్)లో ఈ రాష్ట్రాలను 'అచీవర్స్' క్యాటగిరీలో పేర్కొంది. 'రాష్ట్రాలు, రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల ద్వారా నాణ్యమైన ఉన్నత విద్య విస్తరణ' పేరుతో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ భేరి సోమవారం ఈ నివేదిక విడుదల చేశారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. తమిళనాడు, గోవా, కర్ణాటకల్లోని యూనివర్సిటీల్లో విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తి తక్కువగా ఉండగా.. ఝార్ఖండ్, బీహార్ వర్సిటీల్లో అధికంగా ఉంది. మరోవైపు జీఎస్‌డీపీలో బిహార్ ఉన్నత విద్యపై 1.56 శాతం వ్యయం చేస్తుండగా.. ఆ తర్వాతి స్థానాల్లో మణిపూర్, మేఘాలయ ఉన్నాయి. కాలేజీల సాంద్రత (ప్రతి లక్ష మంది అర్హులైన 18-23 ఏళ్ల మధ్య వయసు వారికి ఉన్న కళాశాలల సంఖ్య) విషయంలో 66 కర్ణాటకలో టాప్‌లో ఉంది. ఇది జాతీయ సగటు (2022లో 30) కంటే రెట్టింపు పైనే కావడం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ ఉన్నాయి. ఇక తక్కువ కాలేజీల సాంద్రత జాబితాలో మణిపూర్, బిహార్, ఝార్ఖండ్ ఉన్నాయి.

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో.. మహిళా కమాండోల శౌర్యం..!

- కాల్పుల్లో పాల్గొన్న 200 మంది మహిళలు

చర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వారంతా మహిళలు..! మాజీ నక్సలైట్లు..! మావోయిస్టుల సానుభూతిపరులుగా, మిలీషియా సభ్యులుగా పనిచేసినవారు..! జనజీవన స్రవంతిలో కలిశాక.. పోలీసులుగా జిల్లా సాయుధ గార్డులు(డీఆర్‌జీ)గా సేవలందిస్తున్నారు. అలా కఠోర శిక్షణ పొందిన మహిళలు కమాండోలుగా ఆదివారం నాటి బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్క్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా.. వీరిలో 11 మంది మహిళా నక్సల్స్ ఉన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన నక్సల్స్ సమావేశమైనట్లు ఉప్పందుకున్న 800 మంది డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు, బస్తర్ ఫైటర్స్ మావోయిస్టుల స్థావరానికి చేరుకోగా.. వీరిలో 200 మంది మహిళా కమాండోలు ఉన్నారు. వీరంతా క్రూరమృగాలు తిరిగే జాతీయ పార్క్‌లో.. కొండలు, గుట్టలు దాటుతూ.. చిట్టడవుల్లో నాలుగు రోజులపాటు 70 కిలోమీటర్లు నడిచారు. మందుపాతరలున్నాయా? అని గమనిస్తూ.. జాగ్రత్తగా వెళ్లారు. ఆదివారం ఉదయం 6.30 సమయంలో.. కిలోమీటర్ దూరంలో నక్సల్స్ క్యాంపు ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న వేళ మహిళా కమాండోలు తోటి జవాన్లను కవర్ చేస్తూ.. కాల్పులతో ముందుకు సాగారు. ఎన్‌కౌంటర్‌లో మహిళా కమాండోలు కీలక పాత్ర పోషించారని ఓ జవాన్ మీడియాకు వివరించారు.

ఐదుగురు నక్సల్స్ మృతదేహాల గుర్తింపు

నేషనల్ పార్క్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన 31 మంది మావోయిస్టుల్లో ఐదుగురిని పోలీసులు గుర్తించారు. సోమవారం బీజాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐజీ సుందర్‌రాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. మృతుల్లో 11మంది మహిళలున్నారని, ఇంకా 25 మందిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. మృతుల్లో పశ్చిమ బస్తర్ డివిజన్ డీవీసీఎం హంగాఖర్మ(రూ.8లక్షల రివార్డు), ఐదేసి లక్షల రివార్డులున్న పీపీసీఎం ప్లటూన్ కమాండర్ మంగు హేమ్లా, నేషనల్ పార్క్ ఏరియా ఏసీఎం సుభాష్ ఓయం, గంగులూర్ ఏసీఎం నన్ను, నేషనల్ పార్క్ ఏరియా సభ్యుడు రమేశ్(రూ.2లక్షల రివార్డు) ఉన్నట్లు వెల్లడించారు.

జేఈఈ మెయిన్ తొలి విడత తుది 'కీ' విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్ష తుది 'కీ'ని అధికారులు సోమవారం విడుదల చేశారు. ప్రాథమిక 'కీ'పై పలు అభ్యంతరాలు రాగా, వాటిలో 12 అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు. కొన్ని ప్రశ్నలకు మార్కులు కలిపి, మరికొన్ని ప్రశ్నలకు సంబంధించి కీలో మార్పులు చేసి తుది 'కీ' విడుదల చేశారు. జేఈఈ మెయిన్ ఫలితాలను ఎన్‌టీఏ ఈనెల 12వ తేదీన విడుదల చేసే అవకాశం ఉంది.

నేర ప్రజాప్రతినిధులపై
శాశ్వత నిషేధం!



అన్ని పార్టీలూ!

అత్యాచారం, హత్య వంటి తీవ్ర నేరాల్లో దోషులుగా తేలిన 46-48 శాతం మంది 2-3 ఏళ్ల శిక్ష అనంతరం ఎంపీ/ఎమ్మెల్యేగా ఎన్నికై తిరిగి చట్టసభలకు వస్తున్నారని.. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8, 9 సెక్షన్లకు సవాల్‌గా పరిణమించిందని పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ పేర్కొన్నారు. అన్ని పార్టీలూ నేరచరితులను పార్లమెంటుకు పంపుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. అసలు క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు చట్టసభలకు ఎలా తిరిగి వస్తున్నారని.. నేరాలకు శిక్షపడ్డ వారిని చట్టసభల్లో ప్రవేశించేందుకు ఎలా అనుమతిస్తున్నారని.. వారే చట్టాలను రూపొందించడం ఎలా జరుగుతోందని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం హత్యానేరానికి శిక్ష పడ్డ వ్యక్తి కూడా ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడు కావచ్చని, ఆ పార్టీకి ఈసీ గుర్తు కేటాయిస్తుందని అమికస్ క్యూరీ హన్సారియా తెలిపారు. శిక్ష పడ్డవారు పార్టీ పదవుల్లో ఉండరాదంటూ ఈసీ మార్గదర్శకాలను జారీ చేయవచ్చన్నారు. దీనిపై జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ.. శిక్షపడిన వారు పార్టీ పదవుల్లో ఉండొద్దని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తోనో పార్టీని నిర్వహిస్తారని వ్యాఖ్యానించారు.


(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనపై కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరింది. కేంద్రం తరఫున అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాది సానియా మాథుర్‌ను ఆదేశించింది. ఈ విషయంలో తన అభిప్రాయాన్ని కోర్టుకు వచ్చి వెల్లడించాలని సుప్రీం అటార్నీ జనరల్ ఎస్.వెంకటరమణిని కోరుతూ.. తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది. అఫిడవిట్ దాఖలుకు తమకు మరింత సమయం కావాలని ఎన్నికల కమిషన్(ఈసీ) తరఫు న్యాయవాది సిద్ధాంత కుమార్ కోరగా.. జస్టిస్ దీపాంకర్ దత్తా తీవ్రంగా స్పందించారు. "రాజకీయాలు నేరమయం కావడం ఎంతో తీవ్రమైన అంశం. ఇప్పటికే ఈసీ దీనిపై దృష్టి కేంద్రీకరించి మెరుగైన పరిష్కారం కనుక్కుని ఉంటే బాగుండేది" అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో మూడువారాల్లో ఈ అంశంపై తమ వైఖరి తెలిపేందుకు ఈసీ సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే.. ప్రజా ప్రతినిధులపై కేసులను వేగవంతంగా పరిష్కరించే విషయాన్ని హైకోర్టులే పర్యవేక్షించాలని 2023లో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం నిర్ణయించినందువల్ల.. ఆ అంశాన్ని తమ ద్విసభ్య బెంచ్ రీ-ఓపెన్ చేయడం సరైంది కాదని, దీన్ని విస్తృత ధర్మాసనానికి అప్పజెప్పాల్సిందిగా సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నాకు నివేదించాలని న్యాయమూర్తులు నిర్ణయించారు. అయితే, హైకోర్టులు నివేదికలు తెప్పించుకోవడం, వాయిదాలు వేయడం తప్ప ఏమీ చేయడం లేదని, దీని వల్ల ప్రజా ప్రతినిధుల పై కేసుల్లో నిరంతర ఆలస్యం జరుగుతోందని వారు అభిప్రాయపడ్డారు.

ఆర్టికల్ 14 ఉల్లంఘనే!

ప్రజాప్రతినిధులపై కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. హైకోర్టులు ఆయా కేసులను పర్యవేక్షిస్తున్నప్పటికీ .. దేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన దాదాపు ఐదు వేల క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా కోర్టుకు తెలిపారు. "నేరాలకు శిక్షపడ్డ ప్రజా ప్రతినిధులపై ఆరేళ్లపాటు మాత్రమే అనర్హత వేటు వేయాలన్న ప్రజాప్రాతినిధ్యచట్టంలోని సెక్షన్ 8కి రాజ్యాంగబద్ధత ఉందా? శిక్ష పడ్డ ఒక వ్యక్తి రాజకీయ పార్టీ పెట్టి, దానికి పదాధికారిగా కొనసాగడం సరైనదేనా?" అనే ప్రశ్నలను ఈ పిల్ లేవనెత్తిందని ఆయన పేర్కొన్నారు. పది రాష్ట్రాల్లో 12 ప్రత్యేక కోర్టులను నెలకొల్పాలని సుప్రీంకోర్టు 2017లో ఆదేశించిందని, నోడల్ ప్రాసిక్యూషన్ అధికారులను నియమించాలని, కేసుల విచారణ వాయిదా వేయకూడదని, ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెండింగ్ క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించేలా పర్యవేక్షిస్తుండాలని 2023 వరకూ అనేక ఆదేశాలు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. "అయినప్పటికీ 42% సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులు కొనసాగడం సిగ్గు చేటు. పలు కేసులు 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. "చట్టాలు చేసేవారు ఆయా చట్టాల కింద పదవులు నిర్వహిస్తున్న వ్యక్తుల కంటే చాలా పవిత్రంగా, మచ్చలేకుండా ఉండాలి. ఒకసారి వారు నైతిక ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే, వారు ఆ పదవిని నిర్వహించడానికి శాశ్వతంగా అనర్హులు కావాలి. అనర్హత కాలాన్ని పరిమితం చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో పేర్కొన్న సమానత్వ నిబంధనను ఉల్లంఘించడమే" అని హన్సారియా వాదించారు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా.. "కేసులను పరిష్కరించడంలో జరుగుతున్న ఆలస్యానికి నిర్దిష్ట కారణాలేమిటి?" అని ప్రశ్నించారు. ప్రత్యేక కోర్టులు ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను కాకుండా ఇతర కేసులు విచారిస్తున్నాయని, అవి కూడా తరచూ వాయిదాలు పడుతున్నాయని, నిందితులు హాజరు కావడం లేదని, కోర్టులు సాక్షులకు సమన్లు జారీ చేసినప్పటికీ సరైన సమయంలో, అవసరమైన సమన్లను జారీ చేయడం లేదని ధర్మాసనానికి అమికస్ క్యూరీ తెలిపారు. ఆయన వాదనను జస్టిస్ మన్మోహన్ అంగీకరించలేదు. ప్రత్యేక కోర్టులు ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ప్రాధాన్యం ఇవ్వడంలేదన్న విషయం సరైంది కాదని, దేశమంతా అలా జరుగుతున్నట్టు అమికస్ క్యూరీ చెబుతున్నారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కావాలంటే రౌజ్ ఎవెన్యూ కోర్టుల పనితీరును పరిశీలించాలని ఆయన చెప్పారు. ఆయా కోర్టుల్లో మధ్యాహ్నానికే విచారణలు ముగుస్తున్నాయని గుర్తుచేశారు. ప్రతి రాష్ట్రంలోనూ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయని, ఒక్కో రాష్ట్రం పరిస్థితి గురించి వివరించాలని ఆయన అమికస్ క్యూరీని కోరారు.

లోకం తీరు



మీరు ఆమోదించకుంటే చెల్లని బిల్లులైపోతాయా?

తమిళనాడు గవర్నర్‌ను నిలదీసిన సుప్రీం

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): "శాసనసభ రూపొందించిన బిల్లుల్ని మీరు ఆమోదించకపోతే అవి చెల్లనివైపోతాయని ఎలా చెబుతారు?.. మరి మీరు చెప్పినట్టు అవి చెల్లని బిల్లులే అయితే వాటిని రాష్ట్రపతికి ఎలా పంపిస్తున్నారు? మీ వాదనల్ని అంగీకరించలేకపోతున్నాం" అంటూ సుప్రీంకోర్టు తమిళనాడు గవర్నర్‌ను నిలదీసింది. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న పది కీలకమైన బిల్లుల్ని ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వీసీ పోస్టుల భర్తీ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోకుండా నియంత్రించాలని అభ్యర్థిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 4వ తేదీ నుంచి రోజువారీ విచారణ జరుపుతోంది. సోమవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. తాను ఆమోదించని పక్షంలో అసెంబ్లీ రూపొందించిన బిల్లులు చెల్లనివిగా మారిపోతాయన్న గవర్నర్ వాదనను తప్పుబట్టింది. శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు ఉందా అనే ప్రశ్నకు సమాధానం కనుగొనాల్సిన అవసరముందని వ్యాఖ్యానించింది. ఏ బిల్లునైనా అంగీకరించకూడదని అనుకుంటే వెంటనే గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపవచ్చని రాజ్యాంగ ధర్మాసనం చెబుతోందని స్పష్టం చేసింది. బిల్లుల ఆమోదం వ్యవహారంలోనూ, వీసీల నియామక వ్యవహారంలోనూ గవర్నర్ పారదర్శకంగా వ్యవహరించలేదనే అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగం ప్రకారం శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం మినహా మరో మార్గం లేదన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనకు గవర్నర్ తరఫు నుంచి సమాధానం లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది.

మా ఆదేశాలు ఎందుకు పాటించలేదు?

- తప్పుడు ఔషధ ప్రకటనల అంశంలో ఏపీ, ఢిల్లీ ప్రభుత్వాలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తప్పుదోవ పట్టించే ఔషధ ప్రకటనల విషయంలో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించినప్పటికీ, న్యాయస్థానం ఆదేశాలను ఎందుకు పాటించడంలేదని ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెలాఖరులోపు అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణ జరిగే మార్చి 7న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరుకావాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కొన్ని ఔషధ ప్రకటనలు ఉంటున్నాయంటూ పతంజలి సంస్థ, యోగా గురు రామ్‌దేవ్‌బాబాపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ 2022 ఆగస్టు 10న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో, ఈ తరహా ప్రకటనలపై తీసుకున్న చర్యల గురించి అఫిడవిట్లు దాఖలు చేయాలని గత ఏడాది మే 7న అన్ని రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలి: సోనియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: వీలైనంత త్వరగా దేశంలో జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. జనగణన జరగకపోవడం వల్ల దాదాపు 14 కోట్ల మంది ప్రజలు ఆహార భద్రతా చట్టం కింద ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆమె తెలిపారు. సోమవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఆమె ఈ మేరకు మాట్లాడారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో జనగణన నాలుగేళ్లకు పైగా ఆలస్యమవడం ఇదే తొలిసారి అని ఆమె చెప్పారు.

కాంగ్రెస్ తదుపరి లక్ష్యం
మమత!!

- బెంగాల్లో రాహుల్ పాదయాత్ర



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పరస్పర అవగాహన, సర్దుబాట్లతో 'ఇండీ' కూటమిని బలోపేతం చేయాల్సిన కాంగ్రెస్.. తొలుత తాను బలం పుంజుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఒంటరిపోరే మార్గమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ కృతనిశ్చయంతో ఉన్నారు. మిత్రపక్షాలతో ముఖాముఖి పోరుకు ఢీ అంటే ఢీ అంటున్నారు. ఢిల్లీలో ఓటింగ్ శాతం పెంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమికి కారణమైన కాంగ్రెస్.. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీని టార్గెట్ చేసింది. ఆ రాష్ట్రంలో బలపడేందుకు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఏకంగా పాదయాత్రకు సంకల్పించారు. ఇందుకోసం రాష్ట్ర శాఖ సర్వసన్నాహాలూ చేయాలని అధిష్ఠానం ఆదేశాలు కూడా జారీచేసింది. సోనియాగాంధీ పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు యూపీఏ సంకీర్ణ ప్రయోగానికి చొరవ చూపడమే గాక పదేళ్ల కేంద్రంలో విజయవంతంగా నడిపారు. 2004లో క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టి ఏఐసీసీ యువజన వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన రాహుల్ మాత్రం ఆది నుంచీ భిన్న పంథాలో వెళ్తున్నారు. పార్టీ ఒంటరిగానే పోరాడాలని.. అప్పుడే బలపడుతుందన్నది ఆయన వైఖరి. దీనివల్ల ఎన్నికల్లో ఓడిపోయినా.. భవిష్యత్‌లో లాభం కలుగుతుందని తన సన్నిహిత నేతలతో ఆయన తరచూ చెప్పేవారు. అయితే వరుస ఓటములు, ప్రధాని మోదీని ఓడించాలన్న ఆకాంక్ష కారణంగా సంకీర్ణ రాజకీయాలపై రాజీపడాల్సి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత.. ఇండీ కూటమి పార్టీలు బలపడి.. కాంగ్రెస్ మాత్రం బలహీనపడుతోందని రాహుల్ గ్రహించారు. అందుకే ఎంతో లోతుగా ఆలోచించి.. మొదట పార్టీని బలోపేతం చేసుకోవాలనుకుంటున్నారు. బెంగాల్లో వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈలోపు అక్కడ కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేయడానికి నేరుగా రాహులే నడుం బిగించారు.

వైమానిక కుంభమేళా!

రక్షణ రంగం పటిష్ఠతతోనే శాంతి సాధ్యం

- ఏరో ఇండియా ప్రారంభంలో రాజ్‌నాథ్
- మహా కుంభమేళాతో పోల్చిన రక్షణ మంత్రి



'ఏరో ఇండియా'లో సుఖోయ్ యుద్ధ విమానాల విన్యాసాలు



బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగం పటిష్ఠంగా ఉన్నప్పుడే శాంతి సాధ్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులోని యలహంక ఎయిర్ బేస్‌లో ఏరో ఇండియా-2025 వైమానిక ప్రదర్శనను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అస్థిరతలను పరిశీలిస్తే ఒక పటిష్ఠమైన దేశంగా భారత్ ఎప్పుడూ శాంతి, స్థిరత్వాన్ని ప్రతిపాదిస్తుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతోందని.. బెంగళూరులో సాంకేతిక, యుద్ధ విమానాల మహాకుంభమేళా ప్రారంభమైందని రక్షణ మంత్రి అభిప్రాయపడ్డారు. కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు పరిశోధనలు అవసరమని అన్నారు. ఎయిర్ షోలో 90కుపైగా దేశాలు భాగస్వామ్యం కావడం, 30 దేశాల నుంచి రక్షణ మంత్రులు, ప్రతినిధులు పాల్గొంటున్నందున.. అభివృద్ధి చెందుతున్న భారత్ రక్షణ, పరిశోధన రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రపంచానికి చాటే వేదిక ఇదని కొనియాడారు. ఇది కేవలం వైమానిక ప్రదర్శన కాదని.. సాంకేతిక, ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలను నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా చేసే వేదికని చెప్పారు. కార్యక్రమంలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు వైమానిక రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన వైమానిక ప్రదర్శనలో తేజస్, సూర్యకిరణ్ యుద్ధ విమానాల చక్కర్లు కొట్టాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు వేలాదిమంది తరలివచ్చారు.

సైన్యానికి అండగా రోబో దండు!

ఎయిర్ షోలో ఆర్మీ పెట్ ప్రాజెక్ట్‌లో భాగమైన నాలుగు కాళ్ల రోబోటిక్ డాగ్ (ట్రాకర్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రోబోటిక్ డాగ్/ట్రాకర్‌గా పిలిచే ఇవి చూడటానికి కుక్కలని పోలి ఉంటాయి. వాహనాలు, హెలికాప్టర్లు చేరుకోలేని ప్రాంతాలకు వెళ్లి ఇవి సైనికులకు అవసరమైన మందులు, ఆయుధాలు అందిస్తాయి. హైదరాబాద్‌కు చెందిన జెన్ టాక్నాలజీస్ కూడా మిషన్ ప్లానింగ్, నావిగేషన్ వంటి వాటికోసం నాలుగు కాళ్ల రోబో 'ప్రహస్త'ను అభివృద్ధి చేస్తోంది. అలాగే కాకినాడకు చెందిన స్టార్టప్ భైరవ్ రోబోటిక్స్ కూడా రోబోటిక్ డాగ్ 'శ్రవణ'ను భారత్‌లోనే తొలి సాయుధ క్వాడ్రూపెడ్‌ను రూపొందిస్తోంది.

ఆకాశంలో అద్భుతం..

ఎయిర్ షో సందర్భంగా భారత వైమానిక దళానికి చెందిన ఎయిర్ క్రాఫ్టులు ఆకాశంలో గర్జించాయి. ఎయిర్ క్రాఫ్టులు చేసిన అద్భుత విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తొలివిడత కార్యక్రమంలో భాగంగా తేజస్ బృందానికి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ నేతృత్వం వహించారు. హాల్ అభివృద్ధి చేసిన తేజస్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. అనంతరం మహిళా పైలట్లు రాఫెల్ యుద్ధ విమానాలను నడిపి మహిళా శక్తి చాటారు. ఐఏఎఫ్‌కు చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్ (ఎస్‌కేఏటీ) వివిధ రూపాలు ప్రదర్శించడం చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. తొమ్మిది హాక్ ఎంకే 132 విమానాలను దగ్గరగా తీసుకొచ్చి చేసిన విన్యాసం, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన తీరు అబ్బురపరిచింది.

అమెరికా, రష్యా.. ఫైటర్ జెట్లు తొలిసారి

అమెరికాకు చెందిన యుద్ధవిమానం లక్షీడ్ మార్టిన్ ఎఫ్35 లైటినింగ్ 2, రష్యాకు చెందిన సుఖోయ్-ఎస్‌యూ-57 కూడా ఎయిర్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రపంచంలోనే అత్యంత అధునాత ఐదవ తరం యుద్ధ విమానాలు అమెరికన్ ఎఫ్-35, రష్యన్ ఎస్‌యూ-57 భారత ఎయిర్‌షోలో పాల్గొనడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. ప్రపంచ రక్షణ సహకారంలో ఇదొక మైలురాయి అని పేర్కొన్నారు.

పరీక్ష విద్యార్థికి శిక్ష కారాదు

- 'పరీక్షా పే చర్చా'లో ప్రధాని మోదీ



'పరీక్షా పే చర్చా'లో విద్యార్థులతో ప్రధాని మోదీ ముచ్చట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: స్టేడియం నుంచి రణగొణధ్వనులు వినిపిస్తున్నా, మైదానంలోని బ్యాట్స్‌మన్ చూపంతా బాల్ మీదే ఉంటుందని, విద్యార్థులు కూడా అలాంటి కేంద్రీకరణతో పరీక్షలకు సిద్ధం కావాలని ప్రధాని మోదీ అన్నారు. 'పరీక్షా పే చర్చ' ఎనిమిదో ఎడిషన్‌లో భాగంగా సోమవారం విద్యార్థులతో ఆయన నేరుగా మాట్లాడారు. ఎంపిక చేసిన 35 మంది విద్యార్థులను ఢిల్లీలోని సుందర్ నర్సరీలో ఆయన కలుసుకుని ముచ్చటించారు. దేశవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేసిన ఈ చర్చలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఆ వివరాలు ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఈ చర్చ సందర్భంగా పరీక్షల పట్ల విద్యార్థుల్లో ఉండే భయాలను తొలగించడానికి మోదీ ప్రయత్నించారు. అదే సమయంలో విద్యార్థుల్లోని అభిరుచిని తెలుసుకుని వారిని ఆ వైపు గా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్య అనేది సమగ్ర అభివృద్ధికి సాధనం అనేది ఉపాధ్యాయులు గ్రహించాలని కోరారు. "పరీక్షలు వేరు.. జ్ఞానం వేరు. పరీక్షలతో మొదలై, వాటితోనే జీవితం అంతం అవుతుందని ఎవరూ భావించనక్కర్లేదు. చదువుల పద్దే విద్యార్థులను బంధించరాదు. వారు ఏ రంగంలో రాణించాలని అనుకుంటారో ఆ రంగంలో వారు ఎదిగించేందుకు తల్లిదండ్రులు సహకరించాలి. విద్యార్థులు తమ సమయాన్ని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. మోదీని విద్యార్థులు సరదాగా కొన్ని ప్రశ్నలు వేశారు.

పారిస్‌లో మోదీకి ఘన స్వాగతం

ఫ్రాన్స్, అమెరికా పర్యటనలో భాగంగా మోదీ సోమవారం రాత్రి పారిస్ విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. మోదీ గౌరవార్థం ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ విందు ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం నుంచి మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి యుద్ధ వాహనాల కొనుగోలు, ఉత్పత్తిలో భాగస్వామ్యంపై ఒప్పందం కుదరనుంది.

మహాకుంభమేళాకు రాష్ట్రపతి ముర్ము



ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 10: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమ ప్రాంతంలో పుణ్యస్నానమాచరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆమెకు ప్రయాగ్‌రాజ్‌లో యూపీ గవర్నర్ ఆనంది బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఘనంగా స్వాగతం పలికారు. పుణ్యస్నానం అనంతరం ముర్ము బడే హనుమాన్ మందిరాన్ని కూడా సందర్శించారు. మహాకుంభమేళాకు భక్తుల తాకిడి కొనసాగుతోంది. ప్రయాగ్‌రాజ్‌కు దారితీసే అన్ని మార్గాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. 20 నుంచి 24 గంటల పాటు ఉన్నచోటు నుంచి కదిలే పరిస్థితి లేకపోవడంతో భక్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. భారీ ట్రాఫిక్, విపరీతమైన రద్దీ దృష్ట్యా ఈ నెల 14వరకు ప్రయాగ్‌రాజ్ వచ్చే ఆలోచన విరమించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు 46 కోట్ల 19 లక్షల మంది భక్తులు ఇప్పటివరకు పుణ్యస్నానాలు ఆచరించారని అధికారులు తెలిపారు. మరోవైపు, మహాకుంభమేళా సందర్భంగా సన్యాసినిగా దర్శనమిచ్చిన నాటి బాలీవుడ్ నటి మమతా కులకర్ణి.. తనకు ఇటీవల లభించిన పదవిని వదులుకున్నారు. కిన్నెర అఖాడా మహా మండలేశ్వర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కేవలం సాధ్విగా మాత్రమే కొనసాగుతానని వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్‌కు లక్ష బస్తాల మిర్చి

» ఈ సీజన్‌లో ఇదే ప్రథమం
» గిట్టుబాటు ధర లేక రైతుల దిగాలు

ఖమ్మం మార్కెట్/వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విర్చి పోటెత్తింది. సోమవారం లక్ష మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ ఏడాది మిర్చి సీజన్(ఖరీఫ్) ప్రారంభమైన తరువాత పంట ఇంత భారీ మొత్తంలో మార్కెట్ రావడం ఇదే ప్రథమం. ఖమ్మం మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్‌జిల్లాల రైతులు పంటను తీసుకొచ్చారు. కాగా, మార్కెట్లో క్వింటాలు మిర్చికి రూ. 14,000 జెండాపాట నిర్ణయించగా వ్యాపారులు కనిష్ఠంగా రూ.6,000, గరిష్ఠంగా రూ.13,300 వరకు కొనుగోలు చేశారు. ఖమ్మం జిల్లాలో కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ధర పడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వరంగల్ జిల్లా ఎనుమాముల మార్కెట్‌కు 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. తేజారకం క్వింటాల్‌కు రూ.13,400 పలికింది.



మిర్చి బస్తాలతో నిండిపోయిన ఖమ్మం మార్కెట్

మిర్చితోటలో గుండెపోటుతో రైతు మృతి

» అప్పటికే మిర్చికి ధర పలకలేదని మనోవేదన



బానోత్ ధర్మా(ఫైల్)

గార్ల (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అప్పులు తెచ్చి సాగు చేసిన మిర్చి పంటకు సరైన ధర పలకలేదన్న మనోవేదనతో ఉన్న రైతు.. మిర్చి తోటలో గుండెపోటుకు గురై చనిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సోమవారం జరిగింది. సీతంపేటకు చెందిన బానోత్ ధర్మా(45) అప్పులు తెచ్చి ఐదెకరాల్లో మిర్చి పంటను సాగు చేశాడు. ఇటీవల మొదటి కాపుగా చేతికొచ్చిన 20 క్వింటాళ్ల పంటను సోమవారం ఖమ్మం మార్కెట్‌కు తరలించాడు. అక్కడ క్వింటా మిర్చి రూ.11 వేలు మాత్రమే పలకగా.. వచ్చిన మేరకు పంటను అమ్ముకుని మనోవేదనతోనే ఇంటికి వచ్చాడు. ధర అనుకున్నంత దక్కలేదని కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ తర్వాత తోటకు వెళ్లిన ధర్మా అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు.

నిజామాబాద్ మార్కెట్‌కు పోటెత్తిన పసుపు



నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు పసుపు పోటెత్తింది. సీజన్ ప్రారంభమైన తర్వాత సోమవారం మొదటిసారి అత్యధికంగా 23,744 బస్తాల పసుపు వచ్చింది. కొన్ని రోజులుగా పసుపు ధర క్వింటాలు రూ.10వేలకు తగ్గకుండా వస్తుండడంతో.. రైతులు పెద్ద మొత్తంలో పసుపును యార్డ్‌కు తరలిస్తున్నారు.

చివరిరోజు నామినేషన్ల జోరు

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100, ఉపాధ్యాయ స్థానానికి 17 మంది నామినేషన్లు

» నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి 23 మంది...
» కరీంనగర్‌లో పోటాపోటీగా అభ్యర్థుల ర్యాలీలు
» కాంగ్రెస్ అభ్యర్థి ర్యాలీలో పీసీసీ చీఫ్, మంత్రులు



కరీంనగర్‌లో ర్యాలీలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వీ నరేందర్ రెడ్డి, చిత్రంలో ఉత్తమ్, మహేశ్‌కుమార్ గౌడ్, జీవన్ రెడ్డి

కరీంనగర్/నల్లగొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఘట్టం సోమవారం ముగిసింది. రెండో శనివారం, ఆదివారం సెలవుదినాలు కావడంతో చివరిరోజు జోరుగా నామినేషన్లు దాఖలయ్యాయి. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానానికి 100 మంది, ఇవే జిల్లాల ఉపాధ్యాయ స్థానానికి 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ స్థానాలకు సోమవారం ఒక్కరోజే వరుసగా 51 మంది, 9 మంది నామినేషన్లు వేశారు. ఇక నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 18 మంది చివరిరోజు నామినేషన్లు వేసినవారే. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 3న ప్రారంభమైన సంగతి తెలిసిందే. మంగళవారం పరిశీలన జరుగుతుంది. ఈ నెల 13 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఈ నెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. కరీంనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వీ నరేందర్ రెడ్డితోపాటు పలువురు అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీగా వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. నరేందర్ రెడ్డి ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం, జూపల్లి, సీతక్క, కొండా సురేఖ, నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి 4జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు. ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్‌తో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు వివిధ సంఘాల ప్రతినిధులు, పట్టభద్రులు, అభిమానులతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్లు సమర్పించారు. ఉద్యమకారుడు, కేసీఆర్ అభిమాని పిడిశెట్టి రాజు సైకిల్‌పై కలెక్టరేట్‌కు వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితోపాటు మరికొంత మంది అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లు అందజేశారు. కాగా, నరేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రుల వాహనాలను కలెక్టరేట్‌లోకి అనుమతించడంపై రవీందర్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. దీంతో పోలీసులు మంత్రులను వాహనాల నుంచి దింపివేయడం, వారు నడుచుకుంటూ లోనికి వెళ్లడంతో వివాదం సద్దుమణిగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, కాంగ్రెస్ టికెట్ ఆశించి చివరివరకు ప్రయత్నించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన గంగాధర్, మహిళా కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ కూడా నిలిచారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీలో బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

'నల్లగొండ' బరిలో...

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి యూటీఎఫ్, ఇతర వామపక్ష సంఘాల మద్దతుతో బరిలోకి దిగగా, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి టీపీఆర్‌టీయూ మద్దతుతో పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా పులి సర్వోత్తమ్ రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ మద్దతుతో పింగళి శ్రీపాల్ రెడ్డి బరిలో నిలుస్తున్నారు. బీసీ నినాదంతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పోటీకి దిగారు. సోమవారం ఆయన నామినేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. కాగా ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 25,797 మంది ఓటర్లు నమోదయ్యారు.



నటుడు విజయ్‌తో ప్రశాంత్ కిశోర్ భేటీ

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీనటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌తో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ సోమవారం భేటీ అయ్యారు. ప్రశాంత్‌కిశోర్‌కు సన్నిహితుడు ఆదవ్ అర్జున్ ఈ భేటీ కోసం కీలకపాత్ర పోషించినట్లు సమాచారం. గతంలో తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌కు సన్నిహితంగా మెలిగిన ఆదవ్ అర్జున్.. ఆ తరువాత ఆయన పార్టీకి దూరమయ్యారు. ఆ తరువాత డీపీఐలో చేరి, ఇటీవలే టీవీకే సభ్యత్వం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్‌కిశోర్‌ను తమ పార్టీ అధినేతతో భేటీకి ఆహ్వానించారు. స్థానిక పనయూరులో ప్రశాంత్‌కిశోర్ విజయ్‌తో రెండు గంటలకు పైగా సమావేశమయ్యారు. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై ఇరువురూ చర్చించుకున్నట్టు తెలిసింది. నిజానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్‌కిశోర్ డీఎంకేకు వ్యూహకర్తగా పని చేసి, ఆ పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు అదే ప్రశాంత్‌కిశోర్ విజయ్‌తో భేటీ కావడం చర్చనీయాంశమైంది.

రాధాకిషన్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ప్రభుత్వానికి నోటీసులు

» రెండో ఫోన్‌ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండో ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ప్రధాన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే నిందితుడిగా ఉన్న రాధాకిషన్‌రావుపై కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారి చక్రధర్‌గౌడ్ మరో కేసు పెట్టారు. తన ఫోన్‌ను సైతం ట్యాపింగ్ చేశారంటూ ఆయన చేసిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ రెండో ఎఫ్ఐఆర్‌లో ఏ-1గా మాజీ మంత్రి హరీశ్‌రావు, ఏ-2గా రాధాకిషన్‌రావు ఉన్నారు. ఈ కేసులో తాను ఇప్పటికే 10నెలలపాటు జైలుశిక్ష అనుభవించానని, తనపై రెండో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అక్రమమని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీచేస్తూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. ఇదే కేసులో హరీశ్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది.

బీజేపీతో కుమ్మక్కై ఎమ్మెల్సీ బరి నుంచి బీఆర్ఎస్ ఔట్

మోదీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం.. రాష్ట్రంలో ఆ పార్టీ దుకాణం బంద్ అయింది

» ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలిచ్చాం: మహేశ్‌గౌడ్
» త్వరలోనే మరో లక్ష ఉద్యోగాలు ఇవ్వనున్నాం: ఉత్తమ్



విలేకరులతో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రి జూపల్లి

కరీంనగర్ అర్బన్/గజ్వేల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): "ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కదని ముందే గుర్తించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రధాని మోదీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూబీజేపీతో కుమ్మక్కై బీఆర్ఎస్ అభ్యర్థులను పోటీలో నిలపడం లేదు" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్‌కు అభ్యర్థులే లేరని, రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని ఎద్దేవా చేశారు. కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ తరఫున అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మహేశ్‌కుమార్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడతోపాటు కరీంనగర్‌లో మహేశ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఓట్లేసి గెలిపించిన గజ్వేల్ ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడని, బీఆర్ఎస్‌లో కేటీఆర్, కవిత, హరీశ్ మధ్య మూడు ముక్కలాట నడుస్తోందని చెప్పారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, కుల గణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రీ-సర్వే జరపమని అడిగే అర్హత లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో మొట్టమొదటి సారిగా కులగణన నిర్వహించిన ఘనత తమకే దక్కుతుందని, ఈ సర్వేతో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని తెలిపారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ మోసం చేశారని, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదికి సగటున 5 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. బండి సంజయ్ రాష్ట్రానికి, తన కరీంనగర్ నియోజకవర్గానికి రూపాయి కూడా తీసుకురాలేదని ధ్వజమెత్తారు. బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండి లాభం లేదని, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రజలకు సమాధానం చెప్పిన తరువాతనే ఓట్లు అడగాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం.. రెండు కళ్లుగా ప్రజాపాలన సాగిస్తున్నదన్నారు. సీఎం, మంత్రుల చొరవతో రికార్డుస్థాయిలో రాష్ట్రానికి రూ.1.40లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణతో 2 చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. క్రమశిక్షణ, కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి నరేందర్‌రెడ్డి అని, ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

ఏడాది కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులకు దాదాపు 56 వేల ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలోనే మరో లక్ష ఉద్యోగాలు ఇవ్వబోతున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలో నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ నరేందర్‌రెడ్డిని గెలిపించి జీవన్ రెడ్డి స్థానాన్ని భర్తీచేయాలని కోరారు. మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కష్ణారావు మాట్లాడుతూ మాట్లాడుతూ నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. తాను సైతం జీవన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు.



డబ్బులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఏఈ రమేశ్, అసిస్టెంట్ సారయ్య

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ

» ఇంటి నిర్మాణ అనుమతుల కోసం డబ్బులు డిమాండ్
» వరంగల్ జిల్లా సంగెం మండలంలో ఘటన

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ అనుమతుల కోసం లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్ ఏఈ రమేశ్, ఆయన, ప్రైవేట్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని కుంటపల్లికి ఓ వ్యక్తి ఇంటి నివాస నిర్మాణం అనుమతుల కోసం గతేడాది జూలై అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనుమతులు ఇచ్చేందుకు ఏఈ రమేశ్ ఆ వ్యక్తిని రూ.80 వేల లంచం డిమాండ్ చేశారు. డబ్బు ఇవ్వకపోవడంతో ఆ దరఖాస్తును రమేశ్ తిరస్కరించాడు. దాంతో బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా రమేశ్ బాధితుడిని పిలిపించి మళ్లీ దరఖాస్తు చేసుకోమని చెప్పాడు. దాంతో తన భార్య పేరిట ఇంటి నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వమని గతనెలలో మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు. ఈసారి కూడా రమేశ్ బాధితుడిని పలుమార్లు తిప్పించుకుని రూ.15 వేలు డిమాండ్ చేశారు. తన అసిస్టెంట్‌కు ఆ డబ్బు ఇవ్వమని చెప్పాడు. దాంతో బాధితుడు ఏసీబీని సంప్రదించాడు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని రమేశ్‌కు సంబంధించిన ప్రైవేట్ కార్యాలయంలో ఏఈ, అతడి అసిస్టెంట్ సారయ్య.. బాధితుడి నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఉండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ కొనసాగుతుందని, నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య చెప్పారు.

కన్నప్రేమను మరచి.. కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి..

» పిల్లలిద్దరినీ హతమార్చేందుకు ప్రయత్నించిన తల్లి
» ఆపై విషయం బయటపడటంతో ఆత్మహత్యాయత్నం
» మహబూబాబాద్ జిల్లా జోగ్యతండాలో ఘటన



వరుణ్‌తేజ్



నిత్యశ్రీ

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లి కన్న ప్రేమను మరిచి తన పిల్లలిద్దరినీ హతమార్చేందుకు ప్రయత్నించింది. కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాగించి.. విషయం తెలియడంతో భయపడి ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యతండాలో ఈ నెల మొదట్లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జోగ్యతండాకు చెందిన వాంకుడోతు ఉష భర్త గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఉష తన పిల్లలు వరుణ్‌తేజ్, నిత్యశ్రీతో కలిసి జోగ్యతండాలోనే ఉంటూ కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 5వ తేదీన పిల్లలిద్దరూ అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంటుండగా ఉష వారిని ఖమ్మంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. వారిద్దరూ కూల్‌డ్రింక్ తాగిన తర్వాత అస్వస్థతకు గురైనట్లు వైద్యులకు తెలిపింది. చిన్నారుల ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సూచనతో.. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి గడ్డిమందు తాగినట్టు అనుమానం ఉందని చెప్పడంతో.. బంధువులు ఉషను నిలదీశారు. పిల్లలకు తానే కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాగించానని చెప్పడంతో వారంతా అవాక్కయ్యారు. వెంటనే చిన్నారులను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉష నిలోఫర్ ఆస్పత్రి వద్ద ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఆమెను కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. కాగా చిన్నారుల్లో బాబు కోలుకొంటుండగా పాప పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.



కల్యాణోత్సవంలో మాంగల్యధారణ ఘట్టం

కల్యాణం.. కమనీయం

» ఘనంగా పాతగుట్ట లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థాన అనుబంధ ఆలయం పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి తిరుకల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం రాత్రి లక్ష్మీనరసింహుల కల్యాణం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య భక్తజనులకు కనువిందు చేసింది. స్వామివారికి యజ్ఞోపవీతధారణ, పాద ప్రక్షాళన, జీలకర్ర బెల్లం కార్యక్రమం అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు.. వేదమంత్రాలు.. మంగళవాయిద్యాల నడుమ వేద పండితులు.. లక్ష్మీదేవి మెడలో నరసింహుడుచే మాంగళ్యధారణ చేయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శ్రేయో మేధ

బ్రహ్మంగారి కాలజ్ఞానం కృత్రిమ మేధను ఊహించిందో లేదో గానీ ఈ అధునాతన సాంకేతికత మనలను కాలం అంచులకు తీసుకువెళ్లుతోంది. నాగరికత ప్రారంభమయింది మొదలు మానవాళి సాంకేతికతల మార్పులు చవిచూస్తూనే ఉన్నది. మానవ సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సాంకేతిక పరిజ్ఞానాలు ఎన్నో ఉన్నాయి. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ) విప్లవాత్మక సాంకేతికతలు అన్నిటిలోకి విప్లవాత్మకమైనది. మానవుని సమస్త అనుభవాలను మార్చివేస్తోంది. 'ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను' అని చెప్పటం ద్వారా మానవ అస్తిత్వ ప్రధాన లక్షణం ఆలోచనాశీలత అనే భావనను ఫ్రెంచ్ తాత్త్వికుడు డెకార్ట్ సుస్థిరం చేశాడు. మానవ సామర్థ్యాలు అన్నిటినీ సంతరించుకుంటున్న ఎఐ అంతిమంగా ఆలోచనాశీలి కూడా కాగలిగితే మానవ అస్తిత్వ ప్రత్యేకత ఏమిటి అనేది అనేక మందిని కలవరపెడుతోంది. 'జీవితంలో భయపడవలసింది ఏదీ లేదు, కాకపోతే అర్థం చేసుకోవలసి ఉంటుంది' అన్న మ్యారీ క్యూరీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఆ వ్యాకులతను జయించవచ్చు.

కృత్రిమ మేధ ప్రస్తుత ప్రస్థానం మూడు ప్రధాన సమస్యలకు దారితీస్తోంది: ఎఐపై నియంత్రణ ఉన్నవారు, దానిని ఉపయోగించుకుంటున్న వారి మధ్య పెరుగుతున్న అసమానతలు; ఎఐ అభివృద్ధి కొద్ది మంది వ్యక్తుల, సంస్థల పరిధిలో కేంద్రీకృతమై, ఆ పురోగతిలో ఇతరులు భాగస్వాములు అయ్యేందుకు సమ అవకాశాలు కొరవడడం; ఈ వినూత్న సాంకేతికతను ప్రజాహితానికి ఉపయోగించే ప్రయత్నాలు సంఘటితంగా జరగకపోవడం వల్ల మానవాళిని పీడిస్తున్న కీలక సమస్యలను పరిష్కరించడంలో చోటుచేసుకుంటున్న జాప్యం, నిర్లక్ష్యం.

ఈ సమస్యలను అధిగమించేందుకే పారిస్‌లో ఈ సోమ, మంగళ వారాలలో 'ఎఐ యాక్షన్ సమ్మిట్'ను ఫ్రాన్స్ నిర్వహిస్తోంది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చొరవతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సదస్సుకు మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహ అధ్యక్షుడుగా ఉండడం విశేషం. స్వతంత్ర, భద్రమైన, విశ్వసనీయమైన ఎఐని సమస్త దేశాల వారికి అందుబాటులో ఉంచడం, పర్యావరణ హితకరమైన కృత్రిమ మేధను అభివృద్ధిపరచడం. ఈ కొత్త సాంకేతికత వ్యవహారాల అంతర్జాతీయ నిర్వహణ ప్రభావశీలంగా, సమ్మిళితంగా ఉండేలా చేయడం అనేవి పారిస్ ఎఐ యాక్షన్ సదస్సు లక్ష్యాలుగా ఉన్నాయి.

కృత్రిమ మేధపై ఈ తరహా అంతర్జాతీయ సదస్సు ఇదే మొదటిది కాదు. 2023 నవంబర్‌లో బ్రిటన్‌లోని బ్లెట్చ్లే పార్క్‌లో మొదటి సదస్సు జరిగింది. ఎఐ సాంకేతికతలను మానవ కేంద్రితంగా అభివృద్ధి పరచాలని ఆ సదస్సు పిలుపునిచ్చింది. నేరపూరిత కార్యకలాపాలకు ఈ సాంకేతికత ఉపయోగపడకుండా నిరోధించడంపై జాగ్రత్త వహించాలని ఆ సదస్సు నొక్కి చెప్పింది. ఈ మేరకు బ్రిటన్ ఎఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్ నొకదాన్ని నెలకొల్పింది. రెండో శిఖరాగ్ర సదస్సు మే 2024లో సియోల్‌లో జరిగింది. ఈ సదస్సు స్ఫూర్తితో ఎఐ సాంకేతికతల రక్షణపై ప్రపంచ దేశాలు మరింతగా శ్రద్ధాసక్తులు చూపడం ప్రారంభమయింది. ఇప్పుడు పారిస్‌లో జరుగుతున్న సదస్సు కేవలం ఆ సాంకేతికత రక్షణ విషయాలకే పరిమితమవకుండా దాని సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే అజెండాతో జరుగుతుంది. ఎఐ అభివృద్ధి సమష్టి కృషితో జరగాలని ఈ అజెండా నిర్దేశిస్తోంది.

పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలు, ఎఐ రంగంలో తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న టెక్ దిగ్గజ కంపెనీలకు సవాల్‌గా పరిణమిస్తూ డీప్ సీక్ అనే చైనీస్ ఎఐ మోడల్ ప్రపంచ ప్రజల ముందుకు వచ్చిన నేపథ్యంలో పారిస్ ఎఐ యాక్షన్ సమ్మిట్ జరుగుతోంది. ఈ నవీన సాంకేతికత రంగంలో చైనా సాధించిన అద్భుత పురోగతి పాశ్చాత్య దేశాలను ముఖ్యంగా అమెరికాను అమితంగా కలవరపరుస్తోంది. ఏఐలో అమెరికా ఆధిపత్యాన్ని నిలబెట్టేందుకు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంత దూరమైనా వెళతారు, ఎంతకైనా సాహసిస్తారు. అపార భాగ్యరాశులను పోగేసుకున్న అమెరికన్ టెక్ కంపెనీలు ఎఐ రంగంలో తమ గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నాయి. గుత్తాధిపత్యం ఉన్నచోట సమ అవకాశాలు ఎలా లభిస్తాయి? పారిస్ సదస్సు నిర్వాహకుల లక్ష్యం ఎలా ఉన్నా అమెరికా, ఆ దేశ టెక్ దిగ్గజాల ఆధిపత్యాన్ని అదుపుచేయడం సాధ్యమవుతుందా? అమెజాన్, గూగిల్, మైక్రోసాఫ్ట్ మొదలైన కంపెనీలతో పాటు ఎఐ చిప్‌ల డిజైన్, ఉత్పత్తిపై నియంత్రణ ఉన్న ఓపెన్ ఎఐ, ఆంత్రోపిక్, డీప్‌మైండ్, మిస్ట్రాల్, ఎన్‌విడియా మొదలైన ఎఐ ల్యాబ్స్ గుత్తాధిపత్యాన్ని తగ్గించడంలో పారిస్ సదస్సు కించిత్ విజయం సాధించినా ఎఐ యాక్షన్ సమ్మిట్ అన్న నామకరణం సార్థకమవుతుంది. విప్లవాత్మక సాంకేతికతల వలే మౌలిక రాజకీయ పరిణామాలు, సామాజిక పరివర్తనలు మానవాళికి శుభకరాలు. మహాకవి శ్రీశ్రీ అన్నట్టు 'మనుష్యుడే నా సంగీతం/మానవుడే నా సందేశం' అన్నది ఏ సాంకేతిక విప్లవానికైనా ఆదర్శంగా, లక్ష్యంగా ఉండాలి. కృత్రిమ మేధ విషయంలో అటువంటి స్ఫూర్తి వెల్లివిరిస్తే ఆ అపూర్వ సాంకేతికత సమస్త మానవులకూ తప్పక శ్రేయో మేధ అవుతుంది.

మూడు దశాబ్దాల నిరీక్షణ

అనుకున్నదే..! అనూహ్యమైనదేమీ కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి, నవభారత రాజకీయ వినీలాకాశంలో వినూత్న తారాజువ్వలా ఒక్క ఉదుటున పైకి ఎగసిన అరవింద్ కేజ్రీవాల్... అంతే వేగంతో అవినీతి పంకిలంలోకి రాలి పడినప్పుడే ఈ ఫలితం ఖరారైంది. చెత్తను సాంతం ఊడ్చేస్తానంటూ బయలుదేరిన చీపురు కట్టే... స్వయంగా చెత్తబుట్టలోకి చేరినప్పుడే జరగబోయేదేమిటో నిర్ధయమైపోయింది.

దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ దరిమిలా బీజేపీ చేతికి అందివచ్చిన విజయ ఫలమిది. అసలు ఇంతకీ అప్పట్లో బీజేపీ ఎందుకు ఢిల్లీ పీఠానికి దూరమైంది... ఆ తర్వాత కూడా రాజధాని ప్రజలు కమలం పార్టీని వరుసగా ఎందుకు తిరస్కరిస్తూ వచ్చారన్నది ప్రస్తుత గెలుపును అర్థం చేసుకోవడానికి ఉపకరించేదే.

ఢిల్లీ అసెంబ్లీ ఏర్పడ్డాక 1993లో మొట్టమొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో బీజేపీనే విజేతగా నిలిచింది. కానీ 1998 దాకా ఐదేళ్లపాటు సాగిన ఆ పార్టీ పాలన సమస్తం అస్తవ్యస్తం. అస్థిరత, కుమ్ములాటలు, ఆర్థిక అరాచకం. ఐదేళ్లలోనే ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. వివాదాల్లో కూరుకుపోయారు. ఆటుపోట్లు, ప్రతిఘటనలను సమర్థంగా ఎదుర్కొనలేక చివరకు చేతులెత్తేశారు.

మొట్టమొదట 1993లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన మదన్‌లాల్ ఖురానా మంచి ప్రజాదరణ కలిగిన నాయకుడే అయినప్పటికీ, అవినీతి ఆరోపణల్లో పూర్తిగా దిగబడిపోయారు. దరిమిలా 1996లో రాజీనామా చేశారు. దాంతో పార్టీలోని ఆయన వర్గంలో అలజడి చెలరేగింది. అవకాశం కోసం ఎదురుచూడసాగారు. ఆయన స్థానే ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన సాహిబ్‌సింగ్ వర్మది మరో కథ.. వేరే వ్యథ. అప్పటికే ఢిల్లీ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. ముఖ్యంగా నిత్యావసర సరకైన ఉల్లి ధర ఏకంగా 50 రూపాయల దాకా దేకి ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు, పార్టీ వర్గాలకు, అభిమానులకు కన్నీళ్లు తెప్పించింది. ఫలితంగా బీజేపీ ప్రతిష్ఠ పూర్తిగా మసకబారింది. ధరోల్బణం, గాడి తప్పిన పరిపాలన తోడై.. కోలుకోవడం అసాధ్యంగా మారింది.



కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.
కాలదన్నిన వాళ్లను, వాళ్లవాళ్లనూ
ఒక్కోసారి కళ్లకద్దుకొని,
నెత్తినెత్తుకొంటుంది.
ఇప్పుడు ఢిల్లీ ఓటర్లు బీజేపీపై
తమ నమ్మకాన్ని పునరుద్ధరించుకొని..
మరొక్క అవకాశం ఇచ్చారు.
పాత వైఫల్యాలనుంచి
అది ఏ మేరకు పాఠాలు నేర్చుకొని
కొత్త బాటలు వేస్తుందో
చూడాలి!

వాస్తవంలో ఆ దురవస్థకు సాహిబ్‌సింగ్‌నే పూర్తిగా బాధ్యుడిని చేయలేం. ఆయన ఒక్కడినే నిందించలేం. అప్పటి పరిస్థితులు ఆయనతో చెలగాటమాడాయి. 1998 జనవరిలో కురిసిన అకాల వర్షాలు ఉల్లి ఉత్పత్తిని దారుణంగా దెబ్బతీశాయి. కిలో పది రూపాయల దాకా ఉన్న ధరలు ఒక్క నెల వ్యవధిలోనే పాతిక రూపాయలు దాటాయి. ఆనాటి వాజపేయి సర్కారు వెంటనే ఉల్లి ఎగుమతుల్ని నిషేధించినప్పటికీ, మార్చిలో ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. దురదృష్టం వెన్నాడి అధిక ఉష్ణోగ్రతల కారణంగా రబీ పంటా నేలకు ఒరిగిపోయింది. ఆగస్టు నాటికి ధర 30కి చేరింది. ఖరీఫ్ పంటపైనా ఆశలు అడుగంటిపోయి, అక్టోబర్ నాటికి కిలో ఉల్లి ధర 50 దాటింది. అప్పటికి ఎలాంటి దిద్దుబాటు చర్యలకు అవకాశం లేకుండా పోయింది. ఆశలు పూర్తిగా అడుగంటిపోయిన పరిస్థితుల్లో... ఆఖరి అస్త్రంగా ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు సుష్మాస్వరాజ్‌ను బీజేపీ అధిష్ఠానం రంగంలోకి దింపింది. కేవలం 52 రోజుల స్వల్ప వ్యవధిలో పరిస్థితిని చక్కదిద్దడం అన్నది ఆమెకే కాదు.. మరెవరున్నా సాధ్యపడదు, పడలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఢిల్లీలో బీజేపీ భవిష్యత్తు ఏమిటో తేలిపోయింది... భవిష్యత్తు లేదనీ స్పష్టమైపోయింది. 1998 నవంబరు నెలాఖరులో జరిగిన ఎన్నికల్లో షీలా దీక్షిత్ సారథ్యంలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించి ఢిల్లీ కోటలో పాగా వేసింది. ఆనాటి నుంచి ప్రజల్లో నమ్మకం కలిగించలేక ఢిల్లీ పీఠానికి బీజేపీ బహు దూరంలోనే ఉండిపోయింది. కాలగమనంలో 27 ఏళ్లు దొర్లిపోయాక.. ఇప్పుడు మరోసారి ఓటరు దేవుడు కరుణించడంతో ఆ కరవుకు తీరినట్లయింది.

షీలా దీక్షిత్ 1998 నుంచి 2013 దాకా 15 ఏళ్ల పాటు ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలం ..దేశ రాజధానిలో కాంగ్రెస్‌కు స్వర్ణ యుగం. మెట్రో వ్యవస్థ పట్టాలకు ఎక్కడమే కాకుండా, ప్రజా రవాణా, నీటి సరఫరా సహా మౌలిక సదుపాయాల సర్వోన్నతి కారణంగా ఢిల్లీ ఓటర్లు వరుసగా మూడుసార్లు ఆమెకు పట్టం కట్టారు. అంతా బాగానే సాగుతోందని అనుకుంటున్న పరిస్థితుల్లో అద్భుతం జరిగింది. మాజీ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో 2013లో రాజకీయ తెరంగేట్రం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ... జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ రెండింటి గుత్తాధిపత్యానికి గండి కొట్టింది. 2015 ఎన్నికల్లో 70 స్థానాల్లో 62 గెలుచుకొని కొత్త చరిత్ర సృష్టించడమే కాదు... బీజేపీని కేవలం 3 సీట్లకు పరిమితం చేసింది. కాంగ్రెస్ సోదిలోకి లేకుండా పోయింది. 2020 ఎన్నికల్లోనూ అదే హవా కొనసాగింది. బీజేపీ దేశవ్యాప్తంగా చక్రం తిప్పుతున్నప్పటికీ.. ఢిల్లీ పీఠం బహుదూరంలోనే ఉండిపోయింది. 62 సీట్లతో ఆప్ మళ్లీ దుమ్మురేపింది.

ఎట్టకేలకు ఇప్పుడు ఢిల్లీ ఓటర్లు బీజేపీపై తమ నమ్మకాన్ని పునరుద్ధరించుకొని.. మరొక్క అవకాశం ఇచ్చారు. పాత వైఫల్యాల నుంచి అది ఏ మేరకు పాఠాలు నేర్చుకొని కొత్త బాటలు వేస్తుందో... ఎంతవరకు ప్రజావిశ్వాసాన్ని నిలబెట్టుకుంటుందో చూడాలిక..!

కొసమెరుపు: కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కాలదన్నిన వాళ్లను, వాళ్లవాళ్లనూ ఒక్కోసారి కళ్లకద్దుకొని, నెత్తినెత్తుకొంటుంది. అప్పట్లో ఉల్లి లొల్లి కారణంగా అప్రతిష్ఠ మూటగట్టుకొని ఢిల్లీ సీఎంగా తప్పుకోవడమే కాదు, రాజధాని నుంచే బీజేపీ తాత్కాలిక నిష్క్రమణకు చాలావరకు బాధ్యుడిగా నిందమోశారు– సాహిబ్‌సింగ్ వర్మ. ఇప్పుడు అదే సాహిబ్ కుమారుడు పర్వేశ్ వర్మ– కీలక న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌ను మట్టికరిపించడమే కాదు, ఏకంగా ఢిల్లీ సీఎం పీఠానికే బాటలు వేసుకొన్నారు. కాలం కలిసొస్తే పట్టాభిషేకం ఆయనకే. ఏమో... గుర్రం ఎగురావచ్చు?

○ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కొత్త సమస్యల్లో వీసీల నియామకాలు

భారతదేశపు మొదటి ఉపరాష్ట్రపతి, గొప్ప తత్త్వవేత్త, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కమిటీ సూచన మేరకు భారత ప్రభుత్వం పార్లమెంటు చట్టం ద్వారా 1953లో 'విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం' (యూజీసీ)ను ఏర్పాటు చేసింది. దేశంలోని విశ్వవిద్యాలయాలను ఈ సంస్థ పరిధిలోకి తీసుకొచ్చి డిగ్రీలు ప్రదానం చేసే అవకాశం కల్పించడం ఈ సంస్థ బాధ్యత. విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం, నాణ్యమైన విద్యను బోధించడం, నాణ్యత కలిగిన పరిశోధనలు జరిగేలా చూడటం యూజీసీ బాధ్యత. డీమ్డ్ విశ్వవిద్యాలయాల స్థాపనలో మానవ వనరుల అభివృద్ధి శాఖకు యూజీసీ కమిటీల ద్వారా సిఫార్సు చేయటం, అర్హత కలిగిన విశ్వవిద్యాలయాలను, కళాశాలలను గుర్తించి వాటికి ఆర్థిక సహాయం చేయటమే కాకుండా, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో యూజీసీ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఉత్కృష్ట ప్రమాణాలతో నడుస్తున్న కళాశాలలను గుర్తించి, స్వయం ప్రతిపత్తి హోదా కలిగించటం, ఆర్థిక సహాయం చేయటం, ఉన్నతమైన విశ్వవిద్యాలయాలలో పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించటం మొదలైనవి యూజీసీ బాధ్యతలు.

దేశంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, పార్లమెంటరీ చట్టం ద్వారా; రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర అసెంబ్లీ చట్టం ద్వారా ఏర్పాటవుతాయి. యూజీసీ కమిటీ సిఫార్సు మేరకు కేంద్రీయ విద్యాశాఖ యూజీసీ చట్టం ద్వారా (Section 3 of U.G.C act) విశ్వవిద్యాలయాలు ఏర్పాటవుతాయి. ఇక రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఆయా రాష్ట్ర శాసనమండలి, ప్రభుత్వాల చట్టం ద్వారా అనుమతులతో ఏర్పడతాయి. భారతదేశంలో ప్రస్తుతం 1000 పైచిలుకు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు కాగా, దాదాపు 375 రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, నాలుగు వందల పైచిలుకు రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఇక పోతే 130 పైగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఈ విశ్వవిద్యాలయాలు సమర్థంగా, ప్రగతి పథంలో పయనించాలంటే సమర్థత కలిగిన, మంచి అనుభవం కలిగిన విద్యావేత్తలను కులపతులుగా నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపకులపతులుగా ఎటువంటి వారిని నియమిస్తే విశ్వవిద్యాలయాలు బాగుపడుతాయో పలు కమిటీలు, రాధాకృష్ణ కమిటీ (1948), డాక్టర్ కొఠారి కమిటీ (1966), జ్ఞానం కమిటీ (1990), రామ్‌లాల్ పరీఖ్ కమిషన్ (1993) విలువైన సూచనలు ఇచ్చాయి. ఈ కమిటీలు కూడా మంచి పరిజ్ఞానం, పరిపాలన దక్షత కలిగిన వ్యక్తులను, విశ్వవిద్యాలయ ఉపకులపతులుగా నియమించడం మంచిదన్న అభిప్రాయం వ్యక్తం చేశాయి. పరీఖ్ కమిటీ అయితే ప్రభుత్వ అధికారులు కాకుండా విద్యాసంస్థల పరిపాలన అనుభవం కలిగిన వారిని నియమించటం మంచిదని అభిప్రాయం వ్యక్తం చేసింది.

కొత్త యూజీసీ నిబంధనల ప్రకారం పరిశ్రమల విభాగం నుంచి గాని, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నుంచి గాని, పబ్లిక్ పాలసీ నుంచి గాని, ఇంకా పరిశోధన సంస్థల నుంచి గాని మంచి విద్యావేత్తలను విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా నియమించవచ్చు. ఈ ప్రతిపాదనలు కొత్త సమస్యను తీసుకువచ్చాయి. ఏ ఏ సంస్థలు నిపుణులు ఆయా సంస్థలకు అధిపతిగా ఉండటం మంచిది. ఒక సంస్థ నుంచి విద్యారంగంలో అనుభవం లేని వ్యక్తులను, విశ్వవిద్యాలయ వ్యవస్థలో పరిపూర్ణ జ్ఞానం లేని వ్యక్తులను ఉపకులపతులుగా నియమించటం ఆలోచించదగ్గ విషయం. ఇక పోతే విశ్వవిద్యాలయ రంగంలో మంచి అనుభవం కలిగిన సమర్థమైన వ్యక్తులను ఉపకులపతులుగా నియమించడం ఎంతైనా సమంజసం.



మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా ఆమోదం పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో ఉపకులపతులు నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం పెత్తనం లేనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడ్డ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాల్లో మాత్రం కేంద్రం పెత్తనం ఎందుకు? బీజేపీ యేతర రాష్ట్రాలు గాని, బీజేపీ పాలనలోని రాష్ట్రాలు గాని యూజీసీ కొత్తగా ప్రతిపాదించిన ముసాయిదాని వ్యతిరేకించడం ఎంతైనా అవసరం.

రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతులను సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసిన మూడు పేర్లలో రాష్ట్ర గవర్నర్ ఒకరిని ఉపకులపతిగా నియమిస్తారు. ప్రస్తుతం సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ మెంబర్లుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒకరు, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ద్వారా ఒకరు, యూజీసీ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. యూజీసీ కొత్తగా తెచ్చిన సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సభ్యుడి బదులుగా గవర్నర్ తరఫున సభ్యుడిని ప్రతిపాదించి రాష్ట్ర ప్రభుత్వాలలో ఒక అలజడి తీసుకొచ్చింది. యూజీసీ కొత్తగా తీసుకొచ్చిన సవరణను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యతిరేకించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం, విద్యావేత్తలూ వ్యతిరేకిస్తున్నారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మార్పును వ్యతిరేకిస్తాయని అనటంలో సందేహం లేదు.

సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీల విషయానికొస్తే కేంద్ర విశ్వవిద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ నుంచి ఇద్దరు మెంబర్లు ఉండగా, ఒకరు విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కమిటీ నామినేట్ చేసిన వ్యక్తి కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ ముగ్గురూ వచ్చిన అప్లికేషన్లు పరిశీలించి ముగ్గురు వ్యక్తులను కేంద్ర మానవ వనరుల శాఖకు పంపిస్తారు. ఆ శాఖ వీరి పేర్లను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ఆ జాబితా నుంచి ఒకరిని కేంద్రీయ విశ్వవిద్యాలయ కులపతిగా నియమిస్తారు. కేంద్ర మానవ వనరుల శాఖ నోటిఫికేషన్ ద్వారా విశ్వవిద్యాలయం ఉపకులపతిని నియమిస్తారు. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వానికి కావాల్సిన వ్యక్తిని రాష్ట్రపతి నియమిస్తారు.

ఇక రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒకరు, విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కమిటీ నుంచి ఒకరు, యూజీసీ నుంచి ఒకరు ముగ్గురు సభ్యులు సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ ముగ్గురు సభ్యులు మూడు పేర్లను రాష్ట్ర విద్యాశాఖకు సమర్పిస్తారు. ఈ మూడు పేర్లను గవర్నర్‌కు పంపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యక్తిని సూచిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వ్యక్తిని కాకుండా, గవర్నర్ ఇంకొక వ్యక్తిని విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమించిన సందర్భాలు కూడా ఉన్నాయి. నందమూరి తారకరామారావు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల యాక్ట్‌ను సవరణ చేసి ప్రభుత్వం పంపిన ముగ్గురు పేర్లలో ప్రభుత్వం సూచించిన వ్యక్తినే విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమించాలని సూచించారు. దాని ప్రకారం ప్రభుత్వం సూచించిన వ్యక్తినే ఉపకులపతిగా నియమించేవారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ముందు పద్ధతినే అనుసరించి ఉపకులపతిని నియమించే అధికారం గవర్నర్‌కే ఇచ్చాయి.

ఇక రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల విషయానికొస్తే ఉపకులపతులను నియమించే అధికారం పూర్తిగా మేనేజ్‌మెంట్ మీద ఉంటుంది. సెర్చ్ కమిటీని నియమించి మేనేజ్‌మెంటుకు కావలసిన వ్యక్తిని సూచించి ఉపకులపతిగా నియమించుకుంటారు. ఇక డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు వస్తే, విశ్వవిద్యాలయ కులపతి... ఉపకులపతిని నియమిస్తారు. మేనేజ్‌మెంట్ వారు గానీ, వారికి బాగా తెలిసిన వ్యక్తి గాని విశ్వవిద్యాలయం కులపతిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఉపకులపతుల నియామకాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం ఉండదు.

కొత్తగా ప్రతిపాదించిన యూజీసీ ముసాయిదా ప్రకారం సెర్చ్ కమిటీలో యూజీసీ నుంచి ఒకరు, గవర్నరు సూచించే మరొక వ్యక్తి, యూనివర్సిటీ నుంచి ఒకరు ఉంటారు. అంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎవరూ సెర్చ్ కమిటీ మెంబర్‌గా ఉండరు. సెర్చ్ కమిటీ తన ప్రతిపాదనలను నేరుగా గవర్నర్‌కి పంపిస్తే, గవర్నర్ ఉపకులపతిని ఎంపిక చేస్తారు. అంటే గవర్నర్ సూచించిన వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతిగా నియమించవలసిన పరిస్థితి. విశ్వవిద్యాలయం స్థాపించడం, వాటికి కావలసిన అన్ని సదుపాయాలు కల్పించడం, ఆర్థిక వనరులు కల్పించాల్సిన బాధ్యతలున్న రాష్ట్ర ప్రభుత్వాలకు విశ్వవిద్యాలయాల ఉపకులపతిని నియమించే అధికారం లేదంటే ఆలోచించదగిన విషయం.

ఇకపోతే యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా నిబంధనల్లో ఉపకులపతులను నియమించడంలో, పరిశ్రమల నుంచి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నుంచి, పబ్లిక్ పాలసీ నుంచి, వైజ్ఞానిక పరిశోధనా సంస్థల నుంచి వ్యక్తులను తీసుకురావడం సమంజసం కాదు. గొప్ప విద్యావంతులు, మేధావులు, ప్రతిభావంతులు, విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా అనుభవం కలిగిన వ్యక్తులను ఉపకులపతులుగా నియమించడం ఉన్నత విద్యను ప్రగతిపథంలోకి తీసుకురావడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

దేశంలో దాదాపు 400 పైబడిన రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాలలో కేంద్ర ప్రభుత్వం ప్రమేయం లేనప్పుడు ఏ మాత్రం, ఆర్థిక సహాయం చేయని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రమేయం అవసరం లేదు. దీనికంటే విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన విద్య, పరిశోధనలు, ఇన్నోవేటివ్ కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా ప్రపంచ విశ్వవిద్యాలయాలకు పోటీగా తీసుకురావడంలో తగు సూచనలు ఇవ్వడం మంచిది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ద్వారా ఆమోదం పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో ఉపకులపతుల నియామకాల్లో కేంద్ర ప్రభుత్వ పెత్తనం లేనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడ్డ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాల్లో మాత్రం పెత్తనం ఎందుకు? బీజేపీ యేతర రాష్ట్రాలు గాని, బీజేపీ పాలనలో రాష్ట్రాలు గాని యూజీసీ కొత్తగా ప్రతిపాదించిన ముసాయిదాని వ్యతిరేకించడం ఎంతైనా అవసరం. ఎందుకంటే విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరించే విధంగా యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా ఉంది. దేశంలోని గొప్ప విద్యావంతులు, మేధావులు, ప్రతిభావంతులు ఆలోచించి ఈ ముసాయిదాను వ్యతిరేకించవలసిన అవసరం ఉంది.


■ ఆచార్య కిలారి రామమూర్తినాయుడు
పూర్వపు మెంబరు, యూజీసీ

చరిత్రా, ఆ ప్రాచీన యశస్సు ఎవరిది?

పురావస్తు తవ్వకాలలో వెలుగు చూసిన కొత్త విషయాలను ప్రపంచానికి ఎవరు వెల్లడించాలి? తవ్వకాలు జరిపిన, పరిశోధనలను పర్యవేక్షించిన పురావస్తు శాస్త్రవేత్తలే కాదూ? 'చారిత్రక విభాత సంధ్యల మానవకథ వికాసం'పై కొత్త వెలుగులు ప్రసరించిన పురావస్తు శాస్త్ర ఆవిష్కరణను ఒక రాజకీయ నాయకుడు ప్రకటించడం అసాధారణ పరిణామం. అయితే నేటి భారతదేశంలో అదేమంత ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు సుమా! స్వాతంత్ర్యానికి పూర్వం లేదా నెహ్రూ భారత్‌లో అయితే మౌలిక ప్రాధాన్యమున్న పురావస్తు విశేషాలను తొలుత ప్రముఖ అకడమిక్ జర్నల్స్‌లో, అదీ పురావస్తు శాస్త్ర పరిశోధనల్లో అనుభవజ్ఞులయిన విద్వజ్ఞుల నిశిత పరిశీలన, ఆమోదం అనంతరం మాత్రమే వెల్లడించేవారు. ఉదాహరణకు 1995లో ఉత్తరప్రదేశ్‌లో క్రీ.పూ.1800 – క్రీ.పూ.1000 మధ్య కాలం నాటి ఇనుప పనిముట్లు, బట్టీలు, ఇతర సామగ్రి పురావస్తు తవ్వకాలలో బయల్పడ్డాయి. ఆ కొత్త విశేషాలను మొట్టమొదట భారతీయ, విదేశీ పురావస్తు శాస్త్ర జర్నల్స్‌లో వెల్లడించారు. అదొక విసుగు పుట్టించే సుదీర్ఘ విద్యా విషయిక ప్రక్రియ.

కాలం మారింది. ఇప్పుడు ఏదీ రాజకీయాలకు అతీతమైనది కాదు, అనర్హమైనది అంతకంటే కాదు. ఎన్నికల తరువాత ఎన్నికలకు సంసిద్ధమవడమే చరిత్ర గమనంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పురావస్తు శాస్త్రాన్ని సైతం ఆ విద్వత్ క్షేత్ర కృషీవలులకు వదిలివేయడానికి మన రాజకీయవేత్తలకు మనసొప్పడం లేదు. మన దేశంలో హరప్పా నాగరికత విలసిల్లిన ప్రాంతాలలో ఒకటైన రఖిగర్హిలో పురావస్తు తవ్వకాలను హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఎలా పర్యవేక్షించారో గుర్తుచేసుకోండి. ఆ తవ్వకాల ద్వారా పురాణాలలో ప్రస్తావితమైన, అయితే భౌతికంగా అదృశ్యమైన సరస్వతీ నది జాడను కనుగొనేందుకు ఆయన ప్రభుత్వం ఎంతగా ఆరాటపడిందో మరి చెప్పాలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం అయోధ్యలో అభిరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఎంత ఆచారబద్ధంగా పాల్గొన్నారో చూశాం. మొగల్ సామ్రాజ్య స్థాపకుడు బాబర్ కూల్చివేసిన ఒక దేవాలయం స్థలంలోనే బాబ్రీ మసీదును నిర్మించారని పురావస్తు తవ్వకాలతో సహా భారతీయ జనతా పార్టీ దశాబ్దాల పాటు శత విధాల చేసిన ప్రయత్నాల పరాకాష్ఠే అయోధ్యలో దశరథరాముడి ప్రతిమా ప్రతిష్ఠాపన.

రాజకీయవేత్తల ఈ వైఖరినే తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ సైతం అనుసరిస్తున్నారు. 'మానవ ఇతిహాసంలో ఇనుప యుగం తమిళగడ్డపై ప్రారంభమయిందని ప్రపంచానికి చెప్పుతున్నా'నని గత నెల 24న 'సగర్వంగా, ఎనలేని సంతృప్తితో' ఆయన ప్రకటించడం ఆ వైచిత్రీ విన్యాసమే. తన ప్రకటనకు మద్దతుగా ఆయన రెండు కార్బన్ డేటింగ్ (రేడియో కార్బన్ సహాయంతో కాల నిర్ధారణ)తో సహా మూడు శాస్త్రీయ పరీక్షల ఫలితాలను రుజువులుగా చూపారు. మన దేశంలోని రెండు ప్రతిష్ఠాత్మక వైజ్ఞానిక పరిశోధనా సంస్థలు, అమెరికాలోని ఒక ప్రముఖ ప్రయోగశాల ఆ పరీక్షలను నిర్వహించాయి. తమిళనాడులోని మయిలదుంపరాయి, కిల్నామండి, శివగళై, ఆదిచనల్లూర్‌లలో జరిగిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన ఇనుప వస్తువులు క్రీస్తుపూర్వం మూడవ, నాల్గవ సహస్రాబ్దాలకు చెందినవని ఆ పరీక్షల్లో నిర్ధారితమయింది.



సంగం యుగం నుంచి ఇనుపయుగం దాకా పురాతన అస్తిత్వ యశస్సుకై తమిళ స్వాభిమాన అన్వేషణ–అతి పురాతన వైభవానికి హిందూత్వ అన్వేషణను–ప్రతిబింబించడం ఆసక్తికరమైన విషయం. ద్రావిడ అభిజాత్యులు, హిందుత్వవాదులు ఇరువురూ ప్రాచీన యశస్సుకు ఎందుకు ఆరాటపడుతున్నారనేది స్పష్టమే.

తమిళ భూమికి లభించిన కొత్త కీర్తి కాంతుల గురించి తమిళనాడు పురావస్తు పరిశోధనల విభాగం 73 పేజీల మోనోగ్రాఫ్ నొకదాన్ని ప్రచురించింది. ఉత్తరప్రదేశ్‌లో ఇనుపయుగ ప్రదేశాలను కనుగొన్న రాకేశ్ తివారీ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్)సహా పదిమంది పురావస్తు శాస్త్ర దిగ్గజాల అభినందన సందేశాలు ఆ పుస్తకంలో ఉన్నాయి. ఇతర స్వతంత్ర మదింపుల్లో ఆ మూడు పరీక్షల ఫలితాలు సరైనవని ధ్రువీకరణ అయితే మానవాళి ప్రాక్ చరిత్రను సరికొత్తగా రచించిన ఘనత తమిళనాడుకు సమకూరుతుంది. ప్రపంచానికి ఇంతవరకు తెలిసిన ఇనుపయుగ ప్రదేశాలు క్రీ.పూ. 2000 సంవత్సరానికి ముందువి కావు. తమిళనాడులో బయల్పడిన ఇనుపయుగ క్షేత్రాల కాలం క్రీ.పూ. 2953 – క్రీ.పూ.3345 సంవత్సరాల మధ్య నాటివి. తాజా ఆవిష్కరణలు ఇనుపయుగ ఆరంభం 5300 సంవత్సరాల క్రితానికి తీసుకువెళ్లాయి.

స్టాలిన్ అభివర్ణించినట్టు తమిళనాడు చరిత్ర అతి ప్రాచీనత నిర్ధారణతో డిఎంకె అనివార్యంగా తమిళ అస్తిత్వం, స్వాభిమానం, అగ్రగామిత్వం గురించి మాట్లాడే హక్కు పూర్తిగా తమదే అని ఘంటాపథంగా ఘోషిస్తుంది. 2014లో కీలడిలో పురావస్తు తవ్వకాలతో ప్రారంభమైన అన్వేషణలకు పరాకాష్ఠగా తమిళనాడులో ఇనుపయుగ ఆవిష్కరణ జరిగింది. నరేంద్రమోదీ ప్రధానమంత్రిత్వం ఆరంభమైన కాలంలోనే తమిళనాడులో ఎడతెగని పురావస్తు అన్వేషణలూ ఆరంభమవటం యాదృచ్ఛికమే. అప్పట్లో బీజేపీ అజెండాలో సరస్వతీ నది జాడను కనుగొనడానికి అగ్ర ప్రాధాన్యముండేది. హరప్పా నాగరికతను వేదకాలంతో ముడిపెట్టడం, తొలి హిందువుల 'ఇండిక్' మూలాలను ఆవిష్కరించడం ఆ అజెండా ప్రధాన లక్ష్యం.

ఉత్తరభారతావనిలోను, దక్షిణాపథాన స్వర్థాత్మక పురావస్తు పరిశోధనలతో కీలడి తవ్వకాల వ్యవహారం తొలుతనే ఒక కుట్ర సిద్ధాంతంలో చిక్కుకున్నది. 'ద్రావిడ నాగరికత' ఆవిష్కరణలను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదన్నది ఆ సిద్ధాంత సారాంశం. కీలడి తవ్వకాలను పర్యవేక్షించిన అధికారిని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా బదిలీ చేయడంతో ఆ సిద్ధాంతానికి మరింత ఆసరా లభించింది. కీలడి తవ్వకాలకు సంబంధించి బదిలీ అయిన ఆ అధికారి రాసిన నివేదికపై నిర్ణయం తీసుకోవడంలో ఎఎస్ఐ ఉన్నతాధికారులు ఏ కారణాల వల్లో గానీ తీవ్ర జాప్యం చేశారు. తమిళుల చరిత్రలో సుప్రసిద్ధమైన సంగం యుగం కాలాన్ని అప్పటివరకు అందరూ అంగీకరిస్తున్నట్టు క్రీ.పూ.300 కాకుండా క్రీ.పూ.600గా ఆ నివేదిక నిర్ధారించిందని తమిళనాడులోని సామాన్య విద్యావంతులకూ తెలుసు. ఆ నివేదికను ప్రచురించాలని డిమాండ్ చేస్తూ అనేక ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కీలడి పురావస్తు తవ్వకాల ప్రదేశాన్ని తమిళనాడు పురావస్తు పరిశోధనల విభాగానికి అప్పగించాలని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాను మద్రాసు హైకోర్టు ఆదేశించింది. తమిళనాడు ప్రభుత్వం మరిన్ని తవ్వకాలు జరిపించడమే కాకుండా అక్కడొక మ్యూజియంను కూడా ఏర్పాటు చేసింది.

కీలడిలో కనుగొన్న వాస్తవాల కంటే ఈ ఇనుపయుగ ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యమున్నది. ఈ కొత్త ఆవిష్కరణల అంతస్సూచనలు ఏమిటనేది ఇంకా స్పష్టం కానప్పటికీ సింధులోయ నాగరికతకు ద్రావిడ నాగరికతతో అనుబంధమున్నదనే వాదనను బలపరిచేందుకు అవి విశేషంగా తోడ్పడుతున్నాయి. తమిళనాడు విద్యామంత్రి ఇదే విషయాన్ని నొక్కి చెప్పుతున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే సంస్కృతం కంటే తమిళ భాషే పురాతనమైనదని, ద్రావిడులు హరప్పా ప్రజల కంటే ముందువారని లేదా సమకాలికులు అని, కచ్చితంగా ఆర్యులకు పూర్వమే వారు ఈ గడ్డపై ఉన్నారని. విఖ్యాత విద్వజ్ఞులు ఇరావతం మహదేవన్, అస్కోపర్పోల పరిశోధనలు ఈ వాదనను పూర్తిగా బలపరుస్తున్నాయి. ఇప్పటికీ ఎవరూ చదవలేకపోతున్న సింధు లిపి తొలినాటి ద్రావిడ లిపికి అనురూపమైనదనే వాదనను కూడా వారి పరిశోధనలు దృఢపరుస్తున్నాయి.

ఈ ఇనుపయుగ ఆవిష్కరణను ప్రకటించడానికి కొన్ని రోజుల ముందు తమిళనాడు ప్రభుత్వం చెన్నైలో హరప్పా, మొహంజొదారోల ఆవిష్కరణ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించింది. భారతీయ, అంతర్జాతీయ విద్వజ్ఞులు పాల్గొన్న సభలో సింధు లిపిని సంపూర్ణంగా చదివిన వారికి మిలియన్ డాలర్లను బహుమానంగా ఇస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. సింధు నాగరికత ఆవిష్కరణ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మొట్టమొదటి డైరెక్టర్ జనరల్ సర్ జాన్ మార్షల్ విగ్రహ ప్రతిష్ఠాపనకు కూడా తమిళనాడు ప్రభుత్వం పూనుకున్నది. 'భారత ఉపఖండ చరిత్ర ఇంకెంత మాత్రం తమిళనాడును ఉపేక్షించలేదు. ఆ మహోజ్జ్వల చరిత్ర ఇక్కడే (తమిళనాట) ప్రారంభమయింది' అని స్టాలిన్ ఆ సదస్సులో వక్కాణించారు.

సంగం యుగం నుంచి ఇనుపయుగం దాకా పురాతన అస్తిత్వ యశస్సుకై తమిళ స్వాభిమాన అన్వేషణ అతి పురాతన వైభవానికి హిందుత్వ అన్వేషణను ప్రతిబింబించడం ఒక ఆసక్తికరమైన విషయం. ద్రావిడ అభిజాత్యులు, హిందుత్వవాదులు ఇరువురూ ప్రాచీన యశస్సుకు ఎందుకు ఆరాటపడుతున్నారనేది స్పష్టమే. అయితే వర్తమాన సవాళ్లు సంక్లిష్టమైనవి, ముఖ్యంగా ఎన్నికల సమయాల్లో అవి మరింత క్లిష్టమవుతాయి.

● నిరుపమ సుబ్రమణియన్
(ది ట్రిబ్యూన్)

• టీచర్.. ఫైట్!

తొలి అంకం పూర్తి

ముగిసిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం

- 50 సెట్లు దాఖలు చేసిన 23మంది అభ్యర్థులు
- నేడు నామినేషన్ల పరిశీలన.. 13వ తేదీ వరకు ఉపసంహరణ
- 12 జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాల్లో 27 న పోలింగ్
- ఎమ్మెల్సీ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లు
- కీలక నేతలను బరిలో దించిన ఉపాధ్యాయ సంఘాలు, బీజేపీ



వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో తొలి అంకం పూర్తయింది. సోమవారం నామినేషన్ల ఘట్టం పూర్తవగా.. 23మంది అభ్యర్థులు 50సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో పలువురు కీలకనేతలుండగా.. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. అయితే 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరెవరు బరిలో ఉంటారనేది ఆ రోజే స్పష్టత రానుంది. ఇక ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పలు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు తమ, తాము మద్దతిచ్చే అభ్యర్థుల విజయంపై దృష్టిపెట్టాయి. మరోసారి ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకునేందుకు యూటీఎఫ్ ప్రయత్నిస్తుండగా, పాత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పీఆర్‌టీయూ ఎత్తులు వేస్తోంది. ఈ రెండు సంఘాలను ఎదుర్కొనేందుకు బీజేపీ, ఇతర సంఘాలు కీలక నేతలను బరిలో దించుతున్నాయి. దీంతో టీచర్ ఫైట్ మరింత రసవత్తరంగా మారుతోంది. కాగా, ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

పర్యావరణ సుస్థిరతతోనే మానవాళి మనుగడ

- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రెటరీ రవి
- నిట్‌లో పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాపు
- పాల్గొన్న వరంగల్ కలెక్టర్ సత్యశారద


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న పీసీబీ మెంబర్ సెక్రెటరీ రవి, పక్కన కలెక్టర్ సత్యశారద

హనుమకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) మెంబర్ సెక్రెటరీ జి.రవి అన్నారు. సోమ వారం వరంగల్ నిట్‌లో పర్యా వరణ సుస్థిరతపై వర్క్‌షాపు జరిగింది. నిట్ క్యాంపస్‌లోని అంబే ద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో విఫన్ లైఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాపును రవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పచ్చ దనం కార్యక్రమాలన్నింటిలో ప్రతీ పౌరుడు బాధ్య తగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కాలుష్యం పెరుగుతుండడం వల్ల పర్యా వరణం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ సుస్థిరతకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వరంగల్ లెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా, మారిన ప్రజల జీవన శైలి తదితర కారణాల వల్ల పర్యావరణం ప్రమాదంలో పడుతోందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివ రించారు. వరం గల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబ ుధి మాట్లాడుతూ పర్యా వరణా న్ని కాపాడడంలో యువత కీలక భూ మిక పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు కన్వీనర్లు ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ కోలా, వెంకటేశ్వర్ రావు ఉన్నారు.

పంచాయతీరాజ్‌లో ఏసీబీ కలకలం

- ఇంటి నిర్మాణం కోసం లంచం డిమాండ్
- పట్టుబడిన పీఆర్ ఏఈ


డబ్బులతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఏఈ రమేష్

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు ముడుపులు డిమాండ్ చేసిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్.. అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడిన ఘటన ఆ శాఖలో కలకలం రేపుతోంది. వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లికి చెందిన ఓ వ్యక్తి గతేడాది జూలైలో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆ అనుమతులు ఇచ్చేందుకు ఏఈ రమేశ్ సదరు వ్యక్తి నుంచి రూ.80వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆ బాధితుడు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విషయం తెలుసుకున్న ఏఈ బాధితుడి దరఖాస్తును తిరస్కరించాడు. ఆ తర్వాత బాధితుడు మళ్లీ ఈ ఏడాది తన భార్య పేరిట నిర్మాణం చేసేందుకు అనుమతులు కోరగా మరో రూ.15వేలు డిమాండ్ చేశాడు. ఇలా ఏఈ పెడుతున్న వేధింపులు భరించలేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా.. పథకం ప్రకారం సోమవారం హనుమకొండ సుబేదారిలోని ఏఈ ప్రైవేట్ కార్యాలయంలో ఆయన అసిస్టెంట్ సారయ్యకు రూ.10వేలు లంచం ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఏఈతో పాటు అసిస్టెంట్‌పై కేసు నమోదు చేశారు. కాగా, ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదుతో ఏఈ, అసిస్టెంట్‌ను లంచం డబ్బులతో పట్టుకున్నామన్నారు. విచారణ జరుగుతోందని, ఇద్దరిని మంగళవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు జైలుకు తరలిస్తామన్నారు.

గతంలో ఏసీబీకి పట్టుబడ్డ పలువురు పీఆర్ అధికారులు

లంచం తీసుకుంటూ గతంలోనూ పలువురు పీఆర్ అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. గతేడాది నవంబరు 11న వరంగల్ జిల్లా కడారిగూడెంలోని సీసీ రోడ్డు బిల్లు కోసం రూ.5వేలు తీసుకుంటూ ఏఈ కార్తీక్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అక్టోబరు 10న తాడిచర్ల గ్రామంలోని సీసీ రోడ్డు బిల్లు విడుదల చేయడానికి పంచాయతీరాజ్ ఈఈ సంపతీ దిలీప్ కుమార్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ తవల చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వలుపదాసు శోభారాణి రూ. 20వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. పాలకుర్తిలోని గుడికుంట తండాలో డీజిల్, ఇతర పనుల బిల్లుల కోసం గుడికుంట తండా స్పెషల్ ఆఫీసర్, పంచాయతీరాజ్ ఏఈ గుగులోత్ గోపాల్ రూ. 6వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. రఘునాథపల్లిలో కంచనలపల్లి గ్రామపంచాయతీలో డీజిల్, ఇతర బిల్లుల కోసం పంచాయతీ కార్యదర్శి పకిడే శివాజీ రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. తాజాగా ఏఈ రమేష్ పట్టుబడటం తీవ్ర చర్చనీయాంశమైంది.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- అధికారులను ఆదేశించిన బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అందించవలసిన మౌళిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని చెప్పారు. ప్రజలకు అందించే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 75 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు నగర వాసులు హాజరై వారి వారి సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై. రామకృష్ణ, బయాలజిస్ట్ మాధవరెడ్డితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా ఇంజనీరింగ్ - 16, హెల్త్, శానిటేషన్ - 8, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 11, టౌన్‌ప్లానింగ్ - 32, తాగునీటి సరఫరా - 7, హార్టికల్చర్ - 1 ఇలా మొత్తం 75 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ప్రజల ఫిర్యాదులు ఇలా..

హనుమకొండ 1వ డివిజన్ పలివెల్పులలో ఓ జూనియర్ కళాశాల, ప్రైవేటు కమర్షియల్ కాంప్లెక్స్ నుంచి విడుదలయ్యే నీరు ఇళ్ల ముందుకు వస్తున్నాయని గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.

- గ్రేటర్ వరంగల్ 61వ డివిజన్ కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో 60 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డును ఇటీవల కొందరు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు జరుపుతున్నారని ప్రశాంత్‌నగర్ డెవలప్‌మెంట్ కమిటీ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.
- వరంగల్ 14వ డివిజన్ సాయిగణేశ్ కాలనీలో చాలా కాలంగా మంచి నీటి సమస్య ఉందని వెంటనే కాలనీవాసుల మంచి నీటి సమస్యను తీర్చాలని కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. ఇదే సమస్యపై చాలా సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వెల్లడించారు.
- వరంగల్ శంభునిపేట ప్రాంతంలో ఇంటి నెంబర్ 19-11-193 ప్రాంతంలో చాలా కాలంగా డ్రైయినేజీ సమస్య ఉందని అధికారులు స్పందించి కొత్త కాలువ నిర్మించాలని స్థానికుడు ఎమ్డీ మహబూబ్‌అలీ కమిషన్‌కు వినతి అందించారు.



రైల్వేస్టేషన్‌లో పట్టుకున్న గంజాయి, నిందితులతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది

31 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

వరంగల్ రైల్వేస్టేషన్‌లో పట్టుకున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

గిర్మాజీపేట, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో సోమవారం ఆర్‌పీఎఫ్ పోలీసులు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన నిందితులు రాహుల్ రామ్ లఖన్ తివారీ, ఆశిష్ రామ్‌నాయక్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.7.75 లక్షల విలువైన 31 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నామని ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. రైల్వేస్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో లగేజి బ్యాగులతో స్టేషన్ లోపలికి వస్తున్న ఈ ఇద్దరిని తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్లే రైలు టికెట్‌లు కూడా వీరి వద్ద ఉన్నాయని తెలిపారు. నిందితులు భువనేశ్వర్ నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం వరంగల్‌కు వచ్చి మరో రైలులో ముంబాయి వెళ్లేందుకు ఇక్కడ దిగారని వివరించారు. నిందితులతో పాటు గంజాయిని టాస్క్‌ఫోర్సు సీఐ శ్రీధర్‌కు అప్పగించామని ఆర్‌పీఎఫ్ ఎస్సై తెలిపారు.

కేయూలో కీలక అధికారుల నియామకం

కళాశాల ప్రిన్సిపాల్‌గా మనోహర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా సురేశ్‌లాల్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో కీలక పదవుల్లో వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లతో పాటు మరో ఇద్దరు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తూ సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలతో నియమాకాలు చేపట్టారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేయూ హిస్టరీ అండ్ టూరిజం విభాగం సీనియర్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ఎకానమిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్‌లను నియమించారు. అలాగే కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ మహిళ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, కేయూ అడ్మిషన్ల డైరెక్టర్‌గా ఫిజిక్స్ విభాగం మహిళ ప్రొఫెసర్ సీజే శ్రీలత నియమితులయ్యారు. వీరితో పాటు కేయూ న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్ లీగల్/ఆర్టీఐ, ఎస్టేట్ డైరెక్టర్‌గా, కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మమత, కేయూ సెల్ఫ్ ఫైనాన్స్ సెల్ డైరెక్టర్‌గా సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కుంట ఐలయ్యలను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలో ఒకే దఫా ఏడుగురికి ప్రొఫెసర్లకు కీలక పరిపాలన, అకాడమిక్ పోస్టులను భర్తీ చేశారు. కీలక పదవుల్లో నియామితులైన ప్రొఫెసర్లను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజుగౌడ్‌తో పాటు ఇతర బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.



కొత్త పాలన అధికారులతో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 179 జీపీల్లో రైతుల నిరసన
- విలేకరుల సమావేశంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో గతంలో ఏ ప్రభుత్వం ఎదుర్కోనటువంటి ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందనీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్‌లోని 179 గ్రామ పంచాయతీల్లో రైతులు నిరసన వ్యక్తం చేశారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలుచేయలేక రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతు భరోసా, రైతు బంధు ఇవ్వకుండా రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. ఎమ్మెల్యే సొంత కంపెనీకి త్వరగా బిల్లు వస్తుంది కానీ రైతులకు మాత్రం బోనస్ రాదు, ఇదెక్కడి న్యాయమని నర్సంపేట ఎమ్మెల్యేను ప్రశ్నించారు. పథకాల అమలుకు ఎన్నికల కోడ్ వచ్చిందని చెబితే నమ్మే పరిస్థితుల్లో ప్రజలు, రైతులు లేరన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన నాలుగు హామీలను అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని, లేకుంటే గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. నర్సంపేట నియోజకవర్గానికి రూ.154 కోట్ల రూపాయల రైతు భరోసా ఎమ్మెల్యే మాధవరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారన్నారు. నియోజకవర్గంలో దాదాపు 16 వేల మందికి పైగా కూలీలు రూ.12 వేల పథకానికి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులుగా ఉన్నారన్నారు. మిగిలిపోయిన రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నల్ల మనోహర్‌రెడ్డి, నామాల సత్యనారాయణ, బండి రమేష్, గోనె యువరాజు, శ్రీధర్‌రెడ్డి, మండల శ్రీనివాస్, పెండ్యాల యాదగిరి, దేవోజు సదానందం పాల్గొన్నారు.



రాయపర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నాలుగు నెలల్లో ప్రభుత్వం కూలుతుంది

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులతోనే ప్రభుత్వం కూలుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోస్యం చెప్పారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి అబద్ధపు పాలనను నడిపిస్తుందని ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను మన నియోజకవర్గంలో క్లీన్ స్వీప్ చేయాలన్నారు. ఎన్నికల్లో పంచిన గ్యారెంటీ కార్డులు ఎటు పోయాయని ప్రశ్నించాలన్నారు. 420 హామీలు ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డి 420 గా మారాడని ఎద్దేవా చేశారు. ఇన్ని రోజులు చేసిన సర్వేలు ఉత్తయేనని, సర్వేల పేరిట రాష్ట్ర ప్రభుత్వం కాలం వెల్లదీస్తోందని ఆరోపించారు. బ్లాక్ మెయిల్ రాజకీయం చేసే వ్యక్తులకు బీఆర్ఎస్‌లో చోటు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలైన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో ఉన్నారని, ఇతర పార్టీలకు వెళ్లే వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు బీఆర్ఎస్, తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బ్రోకర్ రాజకీయాలకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరో లేగదూడను చంపిన హైనా!

- మూడు రోజుల్లో రెండు హతం
- భయాందోళనలో రైతులు
- సంఘటన స్థలాన్ని ఆటవీ శాఖ అధికారుల పరిశీలన

ఐనవోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హైనా మరో లేగ దూడను చంపేసింది. ఏ ప్రాంతం నుంచి వచ్చిందో తెలియదు కాని గర్మిళ్లపల్లి గ్రామ రైతులను నాలుగు రోజుల నుంచి భయాందోళనలకు గురిచేస్తోంది. మూడు రోజుల వ్యవధిలో రెండు లేగదూడలను చంపి తింది. మరో లేగదూడను తీవ్రంగా గాయపరిచింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని నల్లబండ సమీపంలో రైతు రాజారపు పోశాలు తన వ్యవసాయ భూమి వద్ద నాలుగు పశువులు, లేగదూడను కట్టేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి హైనా లేగదూడను చంపి తింది. అంతకు ముందు రోజు ఆదివారం రాత్రి బాలబోయిన అఖిల్‌కు చెందిన లేగదూడపై దాడి చేయగా పక్కనే ఉన్న ఆవులు ప్రతిఘటించడంతో వెళ్లిపోయింది. దూడను చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 7న అర్ధరాత్రి శార్ల నారాయణకు చెందిన లేగదూడను ఉప్పల బండ సమీపంలో హతమార్చిన విషయం తెలిసిందే. ఈ మూడు సంఘటనలు 1 కిలోమీటం ప పరిధిలోనే జరిగాయి. ఆ ప్రాంతంలోని రాళ్ల రప్పలు, చెట్ల పొదల్లో హైనా దాగి ఉంటుందని రైతులు అనుమానిస్తున్నారు. హైనాలు ఎన్ని ఉన్నాయో తెలియడం లేదు. దూడలపై చిరుతపులి దాడి చేస్తుందని రైతులు భావిస్తున్నారు. రాత్రి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే జంకుతున్నారు. బోన్లు ఏర్పాటు చేసి బంధించాలని కోరుతున్నారు.



గర్మిళ్లపల్లి గ్రామ శివారులో లేగదూడను చంపిన హైనా

పరిశీలించిన ఆటవీశాఖ అధికారులు, గ్రామంలో దండోరా

ఎఫ్ఆర్‌వో భిక్షపతి, డీఆర్‌వో మోహన్, ఎఫ్‌బీవో రతన్‌లాల్ సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రలు సేకరించి హైనాగా నిర్ధారించారు. ఒకటి పెద్దదిగా మరొకటి చిన్నదిగా ఉన్నట్టు అనుమానిస్తున్నారు. లేగదూడలు, గొర్రెలు, మేకలను వ్యవసాయ బావుల వద్ద రాత్రి వేళ ఉంచొద్దని గ్రామంలో దండోరా వేయించారు. హైనా దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు పరిహారం రావాలంటే పోస్టుమార్టం చేసి రిపోర్టు ఇవ్వాలని తెలిపారు.



గొర్ల కాపరులు, రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో భిక్షపతి, డీఆర్‌వో మోహన్, ఎఫ్‌బీవో రతన్‌లాల్

పాత రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

- మార్చి 15లోపు ఎన్నికలు జరిగే ఛాన్స్..
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పాత రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకు నాయకులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన నాయకులకు స్థానిక ఎన్నికల పై దిశానిర్దేశం చేశారు. మార్చి 15లోపు ఎన్నిక లు పూర్తి చేయాలని చేస్తోందని, గతప్రభుత్వంలో తీసు కువచ్చిన చట్టంను అమలు చేయాల్సి ఉంటుందన్నారు. రిజర్వేషన్లు మార్చాలంటే కొత్త చట్టం తీసురావాల్సిన అవసరం ఉంటుందని, ఇప్పటివరకు దానిపై ఎలాంటి స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో కులగణన, రిజర్వేషన్ల అమలు విషయంలో ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుంటుందన్నారు. కులగణన విషయంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు గందరగోళం చేయాలని చూస్తున్నాయన్నారు. వాటిని కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్‌లు వ్యతిరేకంచేలా మాట్లాడడం సరికాదన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, నరేందర్ రెడ్డి, బ్రహ్మరెడ్డి, మనోజ్ రెడ్డి, నూకల ఐలయ్య పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే పనితీరును పరిశీలించిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఏరియల్ భూ సర్వే ప్రక్రియను కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. ఇందుకు సంబంధించిన హెలిక్యాప్టర్ సోమవారం కాజీపేటలోని సెయింట్ గ్యాబ్రియల్ మైదానంలో దిగడంతో కలెక్టర్ వెళ్లి సర్వే నిర్వహణ తీరు గురించి సాంకేతిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సర్వేలో ప్రణాళికలు లేని పట్టణాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మునిసిపాలిటీ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని, ఏరియల్ ఫొటోగ్రఫీ టెక్నాలజీని వినియోగిస్తూ సర్వే చేస్తున్నారని అన్నారు. దీని వల్ల పట్టణ ప్రాంతాలలో ఉన్న నిర్మాణాలు, చెరువులు, కాల్వలు, రోడ్లు, హై టెన్షన్ విద్యుత్ వైర్లను క్యాప్చర్ చేసి అక్షాంశాలు, రేఖాంశాలను నమోదు చేస్తారని తెలిపారు. దీంతో భూమికి సంబంధించిన నిజమైన యజమానులు ఎవరో గుర్తించడం సులభం అవుతుందని అన్నారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ మొత్తం ఏరియా 41 కిలోమీటర్లు ఉందని, మంగళవారంలోగా సర్వే పూర్తి చేసి వారం రోజుల తర్వాత వీటికి సంబంధించిన చిత్రాలను అందజేస్తారని అన్నారు. హెలిక్యాప్టర్‌లో అమర్చిన సర్వే సంబంధిత పరికరాలు వాటి పనితీరు గురించి కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.



సర్వే పరికరాల పనితీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

శవ పరీక్షల నిర్వహణ పటిష్ఠంగా జరగాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- మార్చురీలో సీసీ కెమెరాలు, ఆడియో రికార్డ్
- 72 గంటల్లో శవ పంచనామా చేయాలి
- సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మార్చురీలో శవ పరీక్షల నిర్వహణ పటిష్ఠంగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'శవాలపై వసూళ్లు' అనే వార్త కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించి కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. శవ పరీక్షల కేంద్ర నిర్వహణపై సమావేశంలో కలెక్టర్ సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ శవాల పోస్టుమార్టం సకాలంలో జరిగి గౌరవంగా పంపేలా ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెడికల్, ఫోరెన్సిక్, మునిసిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో పోస్టుమార్టం త్వరిగతిన నిర్వహించాలని తెలిపారు. మార్చురీకి వెంటనే మంచినీటి పైపులైన్ వేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా మార్చురీలో సీసీ కెమెరాలు, ఆడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలని, తక్షణమే ఆటోమోడ్‌లో జనరేటర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనాథ శవాలను న్యాయబద్ధంగా 72 గంటల్లో పంచనామా చేసి ఖననం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తగినంత సెక్యూరిటీ ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శవాలకు కప్పుటకు అవసరమైన తెల్ల వస్త్రాన్ని, బాక్సులను సమకూర్చాలన్నారు. నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా అధికారులు ఆకస్మికంగా మార్చురీని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు డాక్టర్ కిశోర్, ఆర్ఎంవో శ్రీనివాస్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, ఎస్ఐ సాంబయ్య, డీఈ రంగారావు, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



కవి ప్రభాకర్

'రేపటి వెలుగు' కవితా సంపుటి

జాతీయ పురస్కారానికి ఎంపిక

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి లగిశెట్టి ప్రభాకర్ రచించిన 'రేపటి వెలుగు' కవితా సంపుటి జాతీయ పురస్కారానికి ఎంపికైంది. కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సాహిత్యరంగంలో జాతీయ పురస్కారాలను అందజేస్తారు. ఈమేరకు 2024-25 సంవత్సరానికి గాను జనగామ జిల్లా కేంద్రానికి చెందిన లగిశెట్టి ప్రభాకర్ రచించిన 'రేపటి వెలుగు' కవితా సంపుటికి జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు డీకే చదువుల బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

భద్రకాళి చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జూమ్ మీటింగ్‌లో మంత్రిని కోరిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. సోమవారం మంత్రితో, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులతో జరిగిన జూమ్ సమావేశంలో రాజేందర్ రెడ్డి మాట్లాడారు. వచ్చే వర్షా కాలం నాటికి చెరువు పూడిక తీత పనులను పూర్తి చేయాలని కోరారు. అలాగే బండ్‌ను కూడా పటిష్టం చేసి సిద్ధంగా ఉంచాల ని కోరారు. ఇందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిం చినట్టు తెలిపారు. ఈ మేరకు అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ మీటింగ్‌లో జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ మురళీధర్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, పి ప్రావీణ్య, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

కాజీపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సెక్షన్‌లో జరుగున్న మూడో రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా ఈ నెల 10 నుంచి 20 వరకు రద్దు చేసిన సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్ నగర్‌ల మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించారు. ఈ రైలును మంగళవారం నుంచి యథావిధిగా నడిపించనున్నట్లు చెప్పారు. ప్రయాణికుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

సికింద్రాబాద్ - విజయవాడ రైల్వే స్టేషన్ల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రస్తుతం ఉన్న బోగీలు కాకుండా అధునాతనమైన లింక్ హాఫ్ మన్ బెష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలను తగిలించి నడిపిస్తున్నారు. ఈ నూతన బోగీలు ప్రయాణికులకు సురక్షితం, సౌకర్యవంతంగా ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. సీట్లకు మెరుగైన కుషనింగ్, ఏయిర్ సస్పెన్షన్ సిస్టమ్, విశాలమైన విండోలతో వెంటిలేషన్, అధునాతనమైన ఇంటీరియర్ ఉంటుందని అధికారులు తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2310	2100
పల్లికాయ (సూక)	6750	4600
పల్లికాయ (పచ్చిది)	4750	3100
కందులు	6921	5540
పెసళ్లు	6322	5645
పత్తి	6960	5800
పసుపు (కాడి)	9559	7425
పసుపు (గోల)	7070	6703
తేజ మిర్చి	13400	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	14100	11500
యూఎస్341ఏసీ	13300	11500
యూఎస్ 341 కొత్తది	-	-
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

తొలి అంకం పూర్తి

ముగిసిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం



టీచర్.. ఫైట్!

- 50 సెట్లు దాఖలు చేసిన 23మంది అభ్యర్థులు
- నేడు నామినేషన్ల పరిశీలన.. 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం
- 12 జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాల్లో 27న పోలింగ్
- ఎమ్మెల్సీ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లు
- కీలక నేతలను బరిలో దించిన ఉపాధ్యాయ సంఘాలు, బీజేపీ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం సోమవారం ముగిసింది. 23మంది కీలక నేతలు.. 50సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలించనుండగా.. 13వ తేదీ వరకు ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పలు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టిపెట్టాయి. మార్చి 29వ తేదీతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో తిరిగి మరోసారి ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకునేందుకు యూటీఎఫ్ ప్రయత్నిస్తుండగా, పాత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పీఆర్‌టీయూ ఎత్తులు వేస్తోంది. ఈ రెండు సంఘాలను ఎదుర్కొనేందుకు బీజేపీ, ఇతర సంఘాలు కీలక నేతలను బరిలో దించటంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. కాగా, ఎమ్మెల్సీ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు.

బరిలో 23మంది అభ్యర్థులు..

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 23మంది అభ్యర్థులు నిలిచారు. సోమవారంతో నామినేషన్ల ఘట్టం పూర్తవడంతో 50సెట్లలో 23మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ప్రధానంగా సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి యూటీఎఫ్ నుంచి మరోసారి పోటీలోకి దిగారు. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, టీపీఆర్‌టీయూ నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి గాలరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తమ్‌రెడ్డి, టీచర్స్ జాక్ నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పాటు వరంగల్‌కు చెందిన మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామితో పాటు 23మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఈ నెల 27న ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుండగా ఇప్పటికే అధికారయంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.



నామినేషన్ దాఖలు చేస్తున్న సుందర్‌రాజు యాదవ్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 12 జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
వరంగల్	13	1474	878	2,352
హనుమకొండ	15	2943	2272	5,215
మహబూబాబాద్	16	1112	551	1663
జనగామ	12	614	388	1002
భూపాలపల్లి	07	215	114	329
ములుగు	09	405	223	628
సిద్ధిపేట	04	123	43	166
నల్గొండ	37	2817	1866	4,683
సూర్యాపేట	23	1702	962	2,664
యాదాద్రిభువనగిరి	17	638	346	984
ఖమ్మం	24	2372	1717	4089
భద్రాద్రికొత్తగూడెం	23	1068	954	2022
మొత్తం	200	15,483	10,314	25,797

ఎమ్మెల్సీ సీటుపై నజర్

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటుపై పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటు బీజేపీ నజర్ వేసింది. దీంతో టీచర్ ఎమ్మెల్సీ ఫైట్ టఫ్‌గా మారుతోందన్న చర్చ జరుగుతోంది. 2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌పై టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతో పాటు టీజీ జాక్, స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీ పడుతున్నారు. అయితే ఈ ఎన్నికలను పీఆర్‌టీయూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. 2013లో పీఆర్‌టీయూ నుంచి గెలిచిన పూల రవీందర్ ఆ తరువాత బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. దీంతో ఆయన కొంత వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. 2019లో పీఆర్‌టీయూ అభ్యర్థిగా పూల రవీందర్ బరిలో దిగారు. బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించినా టీజీ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే పీఆర్‌టీయూ రెబల్ అభ్యర్థిగా సరోత్తమ్‌రెడ్డి బరిలో ఉండటంతో పూల రవీందర్‌కు మైనస్‌గా మారింది. దీంతో ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని పీఆర్‌టీయూ, సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవాలని యూటీఎఫ్‌లు ప్రత్యేకంగా దృష్టి పెట్టగా, తపస్ సహకారంతో ఎమ్మెల్సీ సీటులో పాగా వేయాలని బీజేపీలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. వీరితో పాటు టీపీఆర్‌టీయూ నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి గాలరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కూడా బరిలోకి దిగారు. అయితే హర్షవర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ అధికారికంగా మద్దతు ఇస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. అలాగే టీచర్స్ జేఏసీ నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్ దాఖలు చేశారు. బీసీ ఓటు బ్యాంక్ లక్ష్యంగా మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ పోటీ చేస్తున్నారు. అలాగే సీపీయూఎస్ నుంచి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి సైతం బరిలో నిలవటంతో పోటీ రసవత్తరంగా మారనుంది. వీరితో పాటు మొత్తం 23మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినా 13వ తేదీ తరువాత ఎంత మంది పోటీలో ఉంటారో తేలనుంది.



నామినేషన్ దాఖలు చేస్తున్న డా. వెంకటస్వామి

కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఎవరికో?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ తమ అభ్యర్థులను బరిలో దించడం లేదు. దీంతో వీరి మద్దతు ఎవరికనేది ఉత్కంఠగా మారింది. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ఆ పార్టీ మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డిని బరిలో దించి ఇతర పార్టీలకు సవాల్ విసురుతోంది. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అభ్యర్థులను దించకపోవటంతో ఎవరికో ఒకరి మద్దతు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ ఉద్యమం నేపథ్యంలో వరంగల్ కుడా మాజీ చైర్మన్ సుందరాజ్‌కు మద్దతుగా నామినేషన్లలో పాల్గొన్నారు. అయితే టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి టీపీఆర్‌టీయూ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఆయనకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా లేక ఇతర ఉపాధ్యాయ సంఘం నుంచి పోటీ చేస్తున్న మరెవరికైనా మద్దతు తెలుపుతుందా అనేది ఉత్కంఠగా మారింది. అలాగే బీఆర్‌ఎస్ సైతం ఇప్పటి వరకు ఎవరికి మద్దతు ప్రకటించలేదు. దీంతో పలువురు బీఆర్ ఎస్ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల్లో కొంత వరకు పట్టున్న బీఆర్‌ఎస్ మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠగా మారింది.

మేడారంలో చిన్న జాతర సందడి

- రేపటి నుంచి నాలుగు రోజుల పాటు మినీ వేడుక
- తరలివస్తున్న భక్తులు.. పూర్తయిన ఏర్పాట్లు



జంపన్నవాగు ఒడ్డున పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ములుగు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : తాడ్వాయి మండలం మేడారంలో చిన్న జాతర సందడి నెలకొంది. ఈనెల 12నుంచి నాలుగురోజులపాటు జరిగే జాతర కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవాదాయ, జిల్లా పంచాయతీ, నీటిపారుదల శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మల దర్శనానికి ఆదివారం సుమారు 40వేల మంది భక్తులు తరలిరాగా సోమవారం రద్దీ కొంత తగ్గింది. సుమారు 10వేల మంది వచ్చినట్లు అంచనా. పసుపు, కుంకుమలు, కానుకలను సమర్పించిన భక్తులు మేకలు, గొర్రెలు, కోళ్లను బలిచ్చారు. బుధవారం చిన్నజాతర ప్రారంభమవుతుండగా మంగళవారం సాయంత్రం నుంచి మళ్లీ రద్దీ పెరిగే అవకాశాలున్నాయి. గత చిన్న జాతరలకు భిన్నంగా ఈసారి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో రూ.4కోట్ల వ్యయంతో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు కల్పించారు. 15రోజుల ముందునుంచే పారిశుధ్య పనులు మొదలయ్యాయి. పరిసరాలను బ్లీచింగ్ చేయడంతోపాటు యాంటీ లార్వా ద్రావకాన్ని పిచికారీ చేస్తున్నారు. 200మంది పారిశుధ్య కార్మికులు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. జంపన్నవాగులో ప్రవాహం లేకపోవడంతో భక్తుల పుణ్యస్నానాలకోసం బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు కంపార్ట్‌మెంట్లను నిర్మించారు. భక్తులు ఎక్కువగా విడిదిచేసే ప్రదేశాలలో నల్లాలు పునరుద్ధరించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముఖ్య కూడళ్ల, జంపన్నవాగు పొడవునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. టీటీడీ కల్యాణ మండపంలో తాత్కాలిక వైద్యశాలను అందుబాటులోకి తెచ్చారు. ఆర్టీసీ నాలుగు రోజుల నుంచి 100 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తోంది. ఈనెల 15వ తేదీవరకు హనుమకొండ నుంచి మేడారానికి 400ట్రిప్పుల సర్వీసులను నడిపిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల భక్తులు తరలివస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌జిల్లా నుంచి ఎక్కువ మంది బస్సులలో వస్తుండగా, మిగతా జిల్లాల నుంచి సొంత వాహనాలలో వస్తున్నారు. గద్దెల వద్ద చలువ పందిళ్ల వేయడంతో మధ్యాహ్నం వేళలో ఎండ నుంచి కొంత ఉపశమనం పొందుతున్నారు. రద్దీ ఎక్కువైతే క్యూలైన్‌ల ద్వారా అనుమతించనున్నారు. మహాజాతర సమయంలో మాదిరిగానే క్యూలైన్‌లు, గద్దెల వద్ద భక్తులకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రి వేళల్లో కూడా భక్తులు తల్లులను దర్శించుకుంటున్నారు.



వనదేవతల గద్దెల ముఖద్వారం వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



మంచు మేఘాల మీదుగా..

పొగమంచులో హనుమకొండ నగర వ్యూ

సూర్యోదయ సమయాన.. నీలి నింగిలో మంచు మేఘాలు కదులుతున్న వేళ.. హనుమకొండ నగర సుందర దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. సోమవారం ఉదయం నగరాన్ని పొగమంచు కమ్మేయగా.. 300మీటర్ల ఎత్తులో.. మంచు మేఘాల మీదుగా డ్రోన్ కెమెరాతో బంధించిన నగర చిత్రాలు ఎంతో ఆహ్లాదాన్నిపంచుతున్నాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



డ్రోన్ కెమెరాతో 300 మీటర్ల ఎత్తునుంచి 360 డిగ్రీల కోణంలో తీసిన చిత్రం

నిధులు లేక నిర్వీర్యం

నీరుగారుతున్న రైతువేదికల లక్ష్యం

- రెండేళ్లుగా రాని నిర్వహణ నిధులు
- ఉమ్మడి జిల్లాలో 334 రైతు వేదికలు
- రావలసిన బకాయిలు రూ.8.71కోట్లు
- ఏఈవోలపై నిర్వహణ భారం
- కానరాని రైతు శిక్షణా సమావేశాలు
- వేదికలకు సక్రమంగా వెళ్లని ఏఈవోలు

హనుమకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ సేవలను అన్నదాతలకు చేరువ చేసే ఉద్దేశంతో గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలను కష్టాలు చుట్టుముట్టాయి. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్మించిన ఈ వేదికల నిర్వహణ వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు (ఏఈవో)లకు గుదిబండలుగా మారాయి. రైతులకు సలహాలు, సూచనలు అందించడం, అధికారులను అందుబాటు ఉంచాలన్న ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ సర్కార్ రైతు వేదికలను నిర్మించింది. 2020లో వీటికి శ్రీకారం చుట్టగా, మూడు, నాలుగు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా విభజించి వాటిని నిర్మించారు. ఒక్కోదానికి రూ. 22 లక్షలకుపైగా వెచ్చించారు. రెండేళ్ళకుపైగా నిర్వహణ నిధులు కేటాయించకపోవడంతో వ్యవసాయ విస్తరణాధికారులే తమ జేబుల్లోంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 334 రైతు వేదికలను నిర్మించారు. ప్రతీ నెల నిర్వహణ ఖర్చుల కింద రూ. 3 వేలు కేటాయించారు.

2020 ఏప్రిల్‌లో వ్యవసాయ శాఖ నుంచి ఆదనంగా రూ. 6 వేలు కేటాయించి మొత్తం ఒక్కో రైతు వేదికకు రూ. 9 వేల చొప్పున అందజేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మొత్తంలో పరిశుభ్రతకు రూ. 3 వేలు, శిక్షణకు రూ. 2,500, స్టేషనరీకి రూ. 1,000, విద్యుత్ బిల్లుకు రూ. 1,000, ఇతరత్రా వాటికి రూ. 1,500 చొప్పున వెచ్చించాలని అప్పట్లో నిర్ణయించారు. 2022 ఆగస్టు వరకు నిధులు కేటాయించిన ప్రభుత్వం తర్వాత నిలిపివేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ. 8,71,74,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఫలితంగా అసలు లక్ష్యం నీరుగారుతోంది.

ఏఈవోలే అటెండర్లు..

రైతు వేదికలకు అటెండర్ కూడా లేకపోవడంతో ఏఈవోలే అన్ని పనులు చేసుకుంటున్నారు. రోజూ తాళం తీయడం, గదులను శుభ్రం చేసుకోవడం, ఏవైనా సమావేశాలు ఉంటే ఏర్పాట్లు చేయడం అన్నీ ఏఈవోలే చేయాల్సి వస్తోంది. రైతువేదికలకు వాచ్‌మెన్లు కూడా లేకపోవడంతో అందులోని విలువైన సామాన్లు దొంగలపాలవుతున్నాయి. రైతుల సమావేశాల నిర్వణకు ఉద్దేశించిన కుర్చీలు, బెంచీలను దొంగలు ఎత్తుకు పోతున్నారు. గ్రామాల్లో మట్టి నమూనాల పరీక్షలు చేసి భూసార ఫలితాలను రైతులకు అందించడం కోసం ఒక్కో రైతు వేదికకు విసీ ల్యాబ్ కిట్లు అందజేశారు. మొదట్లో కొన్ని రసాయనాలు అందించారు. తరువాత వాటి నిర్వహణకు నిధులు, రసాయనాలు ఇవ్వకపోవడంతో ప్రస్తుతం భూసార పరీక్ష కిట్లు మూలకు పడ్డాయి. మట్టి నమూనాల పరీక్షల ప్రక్రియ అటకెక్కింది. రైతు వేదికలకు నిర్వహణ నిధులు ఇవ్వకపోవడంతో చివరకు కరెంట్ బిల్లులు కట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ శాఖ నుంచి వ్యవసాయాధికారులకు హెచ్చరికలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రైతు వేదికలకు కరెంట్ తొలగించడంతో అక్కడ నిర్వహించాల్సిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలు ఆగిపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో బకాయిలిలా..

జిల్లా	రైతువేదికల సంఖ్య	బకాయిలు
హనుమకొండ	55	రూ. 1,43,55,000
వరంగల్	59	రూ.1,53,99,000
జనగామ	62	రూ. 1,61,82,000
ములుగు	31	రూ. 80,91,000
జయశంకర్ భూపాలపల్లి	45	రూ. 1,17,45,000
మహబూబాబాద్	82	రూ. 2,14,02,000
మొత్తం	334	రూ. 8,71,74,000

ఊళ్లకు దూరంగా..

ప్రతీ రైతు వేదికలో ఏఈవో, రైతువేదిక కో ఆర్డినేటర్లకు ఒకటి చొప్పున చాంబర్, 200 మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రెండు మరుగుదొడ్లు నిర్మించారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రైతు వేదిక నిర్మాణ బాధ్యతలు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. అయితే ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో చాలా వరకు రైతు వేదికలను ఊరు చివరన నిర్మించారు. వీటిలో చాలా వాటికి అక్కడికి చేరుకోవడానికి రోడ్డు సౌకర్యం కూడా లేదు. వర్షా కాలం వస్తే అంత బురదమయంగా మారి అధికారులు, రైతులు అక్కడికి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడతాయి.



వర్ధన్నపేట మండలం కాట్ర్యాలలోని రైతు వేదిక

నీరుగారుతున్న లక్ష్యం..

నిర్వహణ నిధులు ప్రభుత్వం ఇవ్వకపోవడం, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడంతో రైతు వేదికల లక్ష్యాలు నీరుగారుతున్నాయి. రైతు వేదికల్లో రైతు సమన్వయ సమితి సమావేశాలు నిర్వహించాలి. ఖరీఫ్, రబీల్లో ఎలాంటి పంటలు వేసుకుంటే రైతులకు లాభం చేకూరుతుందో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి వివరించాలి. పొలాలకు సంబంధించిన భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు వెల్లడించాలి. భూసార ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకునేలా వ్యవసాయాధికారులు చొరవ చూపాలి. కానీ వ్యవసాయ విస్తరణాధికారులు విధుల నిర్వహణలో బీజీగా ఉండడం, తరుచూ సర్వేలు చేసేందుకు పొలాల చుట్టూ తిరగడంతోనే సరిపోవడంతో రైతువేదికలను పట్టించుకునే తీరిక వారికి లేకుండా పోయింది. ప్రతీ రోజు ఉదయం విధిగా రావాల్సిన వీరు వారానికి ఒకటీ రెండు సార్లు చుట్టపు చూపుగా వస్తున్నారు. కొన్ని చోట్ల ఏఈవోలు ఉదయం వచ్చి ఆ వెంటనే తమ క్షేత్ర పర్యటనకు వెళ్లిపోతున్నారు. దీంతో రైతు వేదికలకు ఎప్పుడు చూసినా తాళాలు వేలాడుతూ కనిపిస్తున్నాయి.



హసన్‌పర్తి మండలం నాగారంలోని రైతు వేదిక

రూ.8.71 కోట్ల బకాయిలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 334 రైతు వేదికలుండగా రూ. 8.71 కోట్ల నిర్వహణ నిధుల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. 27 నెలల నుంచి మండల వ్యవసాయ విస్తరణాధికారులు (ఎంఈవోలు) తమ నెలవారీ వేతనాల నుంచి నిర్వహణ ఖర్చులు భరిస్తున్నారు. విద్యుత్, పారిశుధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతు శిక్షణ, తాగునీటి సౌకర్యాలకు కూడా నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఏఈవోలు చెబుతున్నారు. ఒక్కో రైతు వేదికకు రూ. 2.43లక్షలు రావాల్సి ఉంది. రైతు సమావేశాలు జరిగినప్పుడు తాగునీరు, తేనీటికి కూడా తామే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఏఈవోలు చెబుతున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా ప్రతీ శాసన సభ నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు విడుల చేయకపోడంతో కార్యాలయ పరిశుభ్రత, ఇతరత్రా పనులు కూడా తామే చేయాల్సి వస్తోందనీ సంబంధిత అధికారులు చెబుతున్నారు.

షూటింగ్‌లో ఏఎస్సై సువర్ణకు కాంస్య పతకం

అభినందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి షూటింగ్ క్రీడల్లో సుబేదారి పీఎస్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సువర్ణ కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝాను కలవగా శాలువాతో సన్మానించి అభినందించారు. డిసెంబరు 15 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్‌లో భోపాల్ నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 67వ జాతీయ షూటింగ్ క్రీడల్లో తెలంగాణ నుంచి 50 మీటర్ల ప్రోన్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. కార్యక్రమంలో ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏఎస్సై సువర్ణను అభినందిస్తున్న సీపీ

జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు



జంగా రాఘవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ కాంగ్రెస్ నేత, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఆయన ఫామ్ హౌస్‌లో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ నాయకులు సందెల విజయ్, బోయిని కుమార్‌యాదవ్, గుర్రంకోటేశ్వర్, సుంచు చంద్రయ్య, రావుల విద్యాసాగర్, గంగుల రాజిరెడ్డిలు జంగాతో కేక్ కట్ చేయించి, భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

»» అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. పెండింగ్ లేకుండా పనులు చేయాలని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. మండల కార్యాలయం వెనుక నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దారు చల్ల ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు ఎండీ రహీం, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి తదితరులున్నారు.

ఓఎస్‌డీ ప్రొఫెసర్ మల్లారెడ్డికి అభినందనలు



ఓఎస్డీ మల్లారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఓఎస్డీగా నియమితులైన గణిత శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని సోమవారం గణితశాస్త్ర విభాగంలో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ బాధ్యులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.చిన్న, కాకతీయ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.రామకృష్ణారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి. వెంకన్న, హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం. రవికుమార్, టీజీసీజీటీఏ మహబూబాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ అడెపు వెంకటరమణ, ములుగు జిల్లా ఎమ్డీ యాకుబ్, అలాగే టీజీసీఏ తెలంగాణ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ డి.సమ్మయ్య, వేణుగోపాల్, సీతారాములు, మహేందర్, గణ సింగ్, శశికాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో హెచ్ఐవీ, ఎస్‌టీఐ అవగాహన సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రారంభించడంతో పాటు వర్సిటీ సెనెట్ హాల్‌లో ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు హెచ్ఐవీ, ఎస్ఐటీ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ సోమవారం తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి , గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అలాగే స్పీకర్‌గా హైదరాబాద్ నుంచి జి.రమేశ్, పి.భవాని, వరంగల్ డిస్ట్రిక్టు ప్రాజెక్టుమేనేజర్ స్వప్నమాధురి పాల్గొని మాట్లాడుతారని పేర్కొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

»» బేడ బుడగ జంగం - జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సిరిపాటి వేణు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన బేడ బుడగ జంగాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 37 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లను సైతం నియమించిందన్నారు. అదే అన్ని రంగాల్లో వెనుకబడి సంచార జీవనం గడుపుతున్న బేడ బుడగ జంగాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికి బేడ బుడగ జంగాలకు పక్కా గృహాలు లేక పూరి గుడిసెలు, గుడారాల్లో జీవిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌కు ఉపాధి కోసం వలస వచ్చి వివిధ పనులు చేసుకుంటూ జీవిస్తున్న తమ కులస్తుల కోసం వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సామాజిక వర్గంలోని పంబాల, మన్నె కులాల వారిని ఎస్సీ(ఏ) కేటగిరిలో కేటాయిస్తూ ప్రభుత్వం పేర్కొందని ఆయా కులాలు విద్య, ఉద్యోగ రంగాల్లో బలపడి ఉన్నాయని సిరిపాటి వేణు అన్నారు. ఏ కేటగిరిలో నుంచి ఆ కులాలను తొలగించి పూర్తిగా వెనుకబడిన సంచార జాతులు దాసరి, హోలియా కులాలను ఎస్సీ (ఏ) కేటగిరిలో చేర్చాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. సమావేశంలో బేడ బుడగ జంగం - జన సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆనరాసి గిర్ని వెంకటి, రాష్ట్ర, జిల్లా నాయకులు సిరిగిరి సంపత్‌కుమార్, రేవల్లి చంద్రమౌళి, సిరిగిరి జంపయ్య, సిరివాటి సారంగపాణి, మోటం మస్తాన్, చిల్లా మధు, సిరివాటి శ్రీనివాస్, పస్తం సమ్మయ్య, పస్తం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై ఇంజనీరింగ్ అధికారుల ఫైర్

• సీసీ రోడ్లకు క్యూరింగ్ చేయాలని ఆదేశం



క్యూరింగ్ కోసం వేసిన గోనె సంచులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఇష్టారాజ్యంగా అంతర్గత రోడ్లు.. క్యూరింగ్ లేక ఎండిపోతున్న వైనం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. 66వ డివిజన్ యాదవనగర్‌తో పాటు ఎర్రగట్టుగుట్ట మంత్రపురి కాలనీల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ కాంట్రాక్టర్‌పై కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు మండిపడ్డారు. వారి పర్యవేక్షణ లేకుండా ఆ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టడమే కాకుండా కాంక్రీట్ రోడ్లకు క్యూరింగ్ చేయకుండా వదిలి వేయడంపై మండిపడ్డారు. దీంతో సదరు కాంట్రాక్టర్ యాదవనగర్‌లో పది రోజుల క్రితం పోసిన సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేసేందుకు గోనె సంచులను ఏర్పాటు చేశాడు. అధికారులు చూడడానికి మాత్రమే గోనె సంచులు ఏర్పాటు చేశారు కానీ నీటితో క్యూరింగ్ చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వివిధ కాలనీల్లో క్యూరింగ్ కోసం ఏర్పాట్లు చేయకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పరిశీలించి ఎంబీ చేసే ముందు క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ చేసి నాణ్యత లోపం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లలకు సంస్కారం నేర్పాలి..

»» సినీ గేయ రచయిత జొన్నవిత్తుల

హసన్‌పర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ ఎల్లాపూర్ ఎస్వీఆర్ పాఠశాలలో వార్షికోత్సవం సగూటిన్-2025 పేరుతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు, వందేమాతరం ఫౌండర్ అధ్యక్షుడు రవీందర్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా రమేష్ గురూజీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల పాదాలను కడిగి తమ ప్రేమానురాగాలను చాటుకున్నారు. ఈసందర్భంగా జొన్నత్తుల, రవీందర్‌రావు మాట్లాడారు. ప్రపంచంలో మారుతున్న సంస్కృతితో యువత కొట్టుకుపోకుండా భారతీయ ధర్మాలు, అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలన్నారు. అమ్మ ఒడి మొదటి బడి అని అన్నారు. పిల్లలు దారి తప్పకుండా ఉండాలంటే సంస్కారం నేర్పాలన్నారు. సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరుల ప్రత్యక్ష రూపాలే తల్లిదండ్రులన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. జొన్నవిత్తుల పేరడి పాటలు తల్లిదండ్రులు, పిల్లలను కడుపుబ్బ నవ్వించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీపతిరెడ్డి, డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్, హెచ్ఎం శేషగిరిరావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన సీఐ

హనుమకొండటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 100కు ఫోన్ చేయడంతో వెంటనే సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తిని చేరదీసి 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సను అందించారు. ప్రస్తుతం గాయపడిన ఇద్దరు క్షేమంగానే ఉన్నట్లు తెలిసింది. సమయానికి ఆస్పత్రికి తరలించడంతో వ్యక్తి ప్రాణాలు దక్కాయని స్థానికులు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు సుబేదారిలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా గాయపడిన వారు వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు.

అర్చకుడిపై దాడి అప్రజాస్వామికం

ఖండించిన అర్చక సమాఖ్య, విశ్వహిందూ పరిషత్

హనుమకొండకల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు ఎంవి.రంగరాజన్‌పై సోమవారం కొంత మంది దండుగులు దాడి చేయడాన్ని అప్రజాస్వామిక చర్యగా పేర్కొంటూ దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్‌లు ఖండించారు. ప్రజాస్వామిక విలువలు తెలియని వ్యక్తులు అర్చకుడిపై దాడి చేయడం హిందూ ధర్మంపై దాడి చేయడమేనని వారు పేర్కొన్నారు. ఎందుకు దాడి చేశారో బేషరతుగా హిందూ సమాజానికి సమాధానం చెప్పాలని గంగు ఉపేంద్రశర్మ డిమాండ్ చేశారు.

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడి, హత్యాయత్నాన్ని విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహావిభాగ్ ప్రముఖ్ శ్రీరాం ఉదయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన సంఘ విద్రోహ శక్తులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సనాతన ధర్మ పరంపరకు అవమానం కలిగించిన దోషులను హిందూ సమాజం ఏనాటికి క్షమించబోదని ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ హత్యాయత్నంపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు.

మలేరియా సిబ్బందిపై కమిషనర్ సీరియస్

»» వివరణ ఇవ్వాలని ఆదేశాలు

»» సిబ్బందితో సమావేశం

»» డబ్బులు వసూలు చేసేవారిపై ఆరా



మలేరియా విభాగంలో మీటింగ్ ఏర్పాటు చేసిన అధికారి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మలేరియా సిబ్బందిపై వరంగల్ బల్దియా కమిషనర్ ఫైర్ అయ్యారు. కొంత కాలంగా మలేరియా విభాగంలో జరుగుతున్న అవినీతి, అడ్డదారిలోడీజిల్, పెట్రోల్, మలాథిన్ మందు విక్రయాలు,

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రహస్య తరలింపుపై వార్తా కథనాలు ప్రచురితం కావడంలో బల్దియా కమిషనర్ సీరియస్ అయినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మలేరియా'లో అక్రమ వసూళ్ల అనే వార్త ప్రచురితమైంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించినట్టు తెలిసింది. మలేరియా విభాగం సంబంధిత ఉన్నతాధికారి వివరణ ఇవ్వాలని కమిషనర్ కోరినట్టు తెలిసింది. దీంతో వెంటనే ఉదయమే మలేరియా విభాగం ఉన్నతాధికారి, బయాలజిస్ట్ మాధవరెడ్డి బల్దియా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. విషయం బయటకు తెలియకూడదని ముందుగానే సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో సిబ్బంది నుంచి డబ్బులు ఎవరు డిమాండ్ చేస్తున్నారు? నెలకు ఎంత వసూలు చేస్తున్నారు? అసలు మన వింగ్ విషయాలు బయటకు ఎవరు లీకులు ఇస్తున్నారు? అని హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఇంచార్జీ హెల్త్ అసిస్టెంట్లను సీరియస్‌గా ప్రశ్నించినట్టు తెలిసింది. తమకు సంబంధం లేదని పలానా అధికారి వసూలు చేస్తున్నాడని మిగతా సిబ్బంది వెల్లడించడంతో ఓ హెల్త్ అసిస్టెంట్‌ను పెంట్రోల్‌పంపు నుంచి కాజీపేటలో ఫీల్డ్ వర్కర్‌గా చేయాలని బదిలీ వేటు వేసినట్టు తెలిసింది. అంతేకాకుండా మలేరియా సిబ్బందిని, ఫీల్డ్ వర్కర్లను డీజిల్, పెట్రోల్ మిగిల్చిన డబ్బులు ఇవ్వాలని, మద్యం కావాలని డిమాండ్ చేసే ఓ అధికారిని సైతం బయాలజిస్ట్ వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. తర్వాత ఇకపై మేము ఎవరిని డబ్బులు అడగము, పెట్రోల్, డీజిల్‌లు అడ్డదారిలో అమ్ముకోము, సరిగా డ్యూటీలు చేస్తాము అని సుమారు పది మంది సిబ్బందితో ఓ పేపర్ రాయించి అందరి సంతకాలు చేయించినట్టు తెలిసింది. కాగా, మీటింగ్ ముగిసిన తర్వాత అందరు కలిసి వరంగల్ సెంట్రల్ జైల్ పెట్రోల్ బంకుకు చేరుకున్నారు. డీజిల్ చోరీ కాకుండా బయాలజిస్ట్ మాధవరెడ్డి దగ్గరుండి మరీ ఫాగింగ్ చేసే ఆటోలు, ఫాగింగ్ మిషన్లకు డీజిల్ నింపించాడు. అక్కడ పని చేసే సిబ్బందికి సైతం వార్నింగ్ ఇచ్చారు. ఇకపై మలేరియా విభాగంతో ఎవ్వరు తప్పు చేసినా సీరియస్‌గా ఉంటుందని, విధుల నుంచి తొలగించి ఐడీ నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం జరుగుతుందని హెచ్చరించినట్టు విశ్వసనీయ సమాచారం.

మళ్లీ ఎమ్మెల్సీగా అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

»» టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగబెల్లి నర్సిరెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి మళ్లీ ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం వాకర్స్‌తో పాటు టీచర్స్ ఓటర్ల కలిసి కేయూ క్రీడామైదానంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉన్నత విద్య రంగంలో సమస్యలను పరిష్కారం కోసం కృషి చేశారని భవిష్యత్‌లోనూ మరింత సమర్థవంతంగా పనిచేస్తానని అన్నారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ కుడ్లె మధుకర్, డాక్టర్ కర్రె సదాశివ, డాక్టర్ వి.నవీన్, టీఎస్‌యూటీఎస్ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి పెండెం రాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి చంద్రయ్య, టీపీటీఎఫ్ బాధ్యులు రఘుపతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌ను విజయవంతం చేయండి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 12వ తేదీన చేపట్టిన 2కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ డీటీవో శోభన్‌బాబు సూచించారు. సోమవారం వరంగల్ ఆర్టీవో కార్యాలయంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్(టీఎస్‌జేయు) ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం ఉదయం ఏడు గంటలకు వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి కేఎంసీ వరకు నిర్వహించే 2 కే రన్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం ఇటీవల డీటీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన శోభన్‌బాబుకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ నాయకులు తోకల అనిల్‌కుమార్, నాగపురి నాగరాజు, కందికొండ మోహన్, గంగరాజు, బత్తుల సత్యం, శ్రీహరి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 39 మందికి జరిమానా

మట్టెవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 39 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ సోమవారం రూ.46,800 జరిమానా విధించారు. ఇదే కేసులో వరంగల్ కొత్తవాడకు చెందిన నవీన్, మామునూరుకు చెందిన ఎం.ధర్మయ్యలకు సామాజిక సేవా శిక్ష వేశారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.2000 జరిమానా విధించారని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

ఎంత పనిచేశావమ్మా!

- »» కన్నప్రేమను మరిచి.. కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి..
- »» పిల్లలిద్దరిని హతమార్చేందుకు ప్రయత్నించిన తల్లి
- »» ఆపై తానూ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం
- »» చిన్నారుల పరిస్థితి విషమం.. ఆలస్యంగా వెలుగులోకి
- »» మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలంలో ఘటన
- »» కుటుంబ పరిస్థితుల నేపథ్యమే కారణమని సమాచారం



డోర్నకల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూల్ డ్రింక్‌లో గడ్డిమందు కలిపి వారికి తాపించి.. ఆపై తానూ ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యతండలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి చిన్నారుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివీ.. జోగ్యతండాకు చెం దిన వాంకుడోతు వెంకటేష్, ఉష దంపతులకు వరుణ్‌తేజ్, నిత్యశ్రీ అనే చిన్నారులున్నారు. అయితే వెంకటేష్ అనారోగ్యం బారిన పడి గతేడాది అక్టోబరు 11న మృతి చెందాడు. దీంతో ఉష తన పిల్లిద్దరితో కలిసి జోగ్యతండాలోనే తన అత్తమామ ఇంటిపక్కనే నివాసం ఉంటూ కూలి పనులకు వెళుతూ జీవనం కొనసాగిస్తోంది. ఈ నెల 5వ తేదీన పిల్లలిద్దరు ఒక్కసారిగా అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంటుండగా తమ బంధువులతో కలిసి ఉష వారిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. వారిద్దరూ కూల్‌డ్రింక్ తాగిన తర్వాత అస్వస్థతకు గురైనట్లు ఆమె వైద్యులకు తెలిపింది. దాంతో వైద్యులు చికిత్స ప్రారంభించి.. రక్త, మూత్ర నమూనాలు సేకరించారు. ఆ పరీక్షల్లో కూల్ డ్రింక్ తాగడం వల్ల వచ్చిన అనారోగ్యం కాదని వైద్యులు గుర్తించారు. కానీ అప్పటికే రెండు రోజులు కావడం, చిన్నారుల ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని సూచించడంతో.. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి గుర్తు తెలియని కంపెనీకి చెందిన గడ్డిమందు తాగినట్టు అనుమానం ఉందని చెప్పడం తో.. చిన్నారుల బంధువులు ఉషను నిలదీశారు. అప్పటి వరకు కూల్ డ్రింక్ తాగడం వల్లే చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని చెప్పిన ఉష.. తన పిల్లలకు తానే కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాపించానని చెప్పడంతో వారంతా అవాక్కయ్యారు. వెంటనే ఆ చిన్నారులను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అయితే తాను చేసిన పని తెలియడంతో తనపై కుటుంబసభ్యులు దాడి చేస్తారని, తన పరువుపోయిందని భావించిన ఉష నిలోఫర్ ఆసుపత్రి వద్ద ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. ఆమెను కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండగా.. వెంటనే చికిత్స అందడంతో ఉష ప్రాణాపాయం నుంచి బయటపడిందని సమాచారం.

అయితే ఈ ఘటనపై చిన్నారుల నానమ్మ వాంకుడోతు బుజ్జి డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్నామని డోర్నకల్ సీఐ రాజేష్ సోమవారం తెలిపారు. విచారణ నిమిత్తం పోలీస్ సిబ్బందిని హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి పంపామన్నారు. అయితే ఇటీవలే భర్త చని పోగా.. కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్న ఉష తన పిల్లలకు విషమిచ్చి చంపాలని ఎందుకు ప్రయత్నించచదనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కూలి పనులు చేసుకునే ఆమె కుటుంబ పరిస్థితుల నేపథ్యంలోనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉంటుందన్న చర్చ జరుగుతోంది.

సమాజ అభివృద్ధికి మహిళల ఆరోగ్యమే కీలకం

»» కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, పక్కన రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సమాజ అభివృద్ధికి మహిళ ఆరోగ్యమే కీలకమని కాకతీయ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ కర్నాటి ప్రతాప్ రెడ్డి ఉద్బోదించారు. సోమవారం కేయూ ఆరోగ్యం ఆవరణలో హెల్త్ సెంటర్ మెంబర్ ఇన్‌ఛార్జి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. ప్రసాద్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మంచి ఆరోగ్యంతోనే మంచి మనస్సు ఉంటుందని అన్నారు. మహిళలు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. విద్యార్థుల మంచి ఆరోగ్యకరమైన జీవనం, పౌష్టిక ఆహారం అనుకూల దృకృథంతో ఉండాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించాలని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. మహిళ తీవ్ర ఒత్తిడికి గురైతూ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాసవి, పద్మజలు మాట్లాడారు. కాన్సర్ గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే మందులతో బయట పడోచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ సీజే శ్రీలత, డాక్టర్ బి. దీపాజ్యోతి, మహిళా అధ్యాపకులు, మహిళా బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

చక్కెర చేటు

లేబుళ్లు - మతలబులు

సూపర్‌మార్కెట్లలో ప్యాకెట్లలో దొరికే పదార్థాలు, పానీయాలు మన బరువును తగ్గించే ప్రయత్నంలో ఉన్న భ్రమకు లోను చేసే లేబుళ్లను కలిగి ఉంటాయి. మరీ ముఖ్యంగా వాటిలోని చక్కెర మోతాదులను తెలపడం కోసం చిత్రమైన పదాలను ఉపయోగిస్తూ ఆకట్టుకునే ప్రయత్నం కూడా చేస్తూ ఉంటాయి. కాబట్టి ఆ పదాల అసలు అర్థాలను తెలుసుకోవడం ఎంతో అవసరం.

చక్కెర మోతాదులు

కొన్ని ప్యాకెట్ల మీద చక్కెర మోతాదు 'ఫ్రీ' లేదా 'లో'గా ముద్రించి ఉంటుంది. అంటే ఆ ప్యాకెట్‌లో, ఉపయోగించవలసిన దాని కంటే తక్కువ చక్కెరను ఉపయోగించారు కాబట్టి మిగతా ఉత్పత్తులతో పోలిస్తే దాన్లో ఉన్న చక్కెర తక్కువని అర్థం.

షుగర్ ఫ్రీ

ఈ ఉత్పత్తుల్లో ఒక సర్వింగ్‌లో 0.5 గ్రాముల చక్కెర ఉంటుంది. ఆ చక్కెర సహజసిద్ధమైనదీ, జోడించినదీ అయి ఉండవచ్చు. ఫ్రీ ఆఫ్ షుగర్, షుగర్‌లెస్, నో షుగర్, జీరో షుగర్.. ఇవన్నీ ఇదే అర్థాన్ని కలిగి ఉంటాయి.

రెడ్యూస్డ్/లెస్ షుగర్

సాధారణ ఉత్పత్తులతో పోల్చితే దీన్లో కనీసం 25% తక్కువ చక్కెర ఉందని అర్థం.

నో యాడెడ్ షుగర్

శుద్ధి చేసే సమయంలో, లేదా ప్యాక్ చేసే సమయంలో చక్కెర లేదా చక్కెర కలిగి ఉన్న దినుసును జోడించలేదని అర్థం. సహజ చక్కెర కలిగిన పదార్థాల ప్యాకెట్ల మీద, లో క్యాలరీ స్వీటెనర్ లేదా షుగర్ సబ్‌స్టిట్యూట్ అని పేర్కొని ఉంటుంది.



చక్కెర లేకపోయినా...

ఉత్పత్తిలో చక్కెర లేదని పేర్కొన్నంతమాత్రాన అది ఆరోగ్యానికి మంచిదని భావించడం కూడా పొరపాటే! ఉదాహరణకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా తినే సిరీల్ ప్యాకెట్ మీద 'రెడ్యూస్డ్ షుగర్' లేదా 'లైట్లీ స్వీటెన్డ్' అని పేర్కొని ఉండవచ్చు. దాంతో మిగతా వాటికంటే ఇదే మెరుగైన ఉత్పత్తి అనే భావన కలుగుతుంది. నిజానికి కంపెనీలు, ప్రచారంలో భాగంగా, వాటి ఉత్పత్తుల్లో 30% తక్కువ చక్కెర వాడినట్టు పేర్కొంటూ ఉంటాయి. కానీ నిజానికి వాటిలోని చక్కెర మోతాదులు అంత కంటే ఎక్కువ కూడా ఉండవచ్చు.

మీకు తెలుసా?

జంక్ ఫుడ్ మీద మోజు ఎందుకు?

ఉదయం కంటే రాత్రివేళే మనసు జంక్ ఫుడ్ వైపు లాగుతూ ఉండడాన్ని మీరెప్పుడైనా గమనించారా? ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుందాం!

ఉదయం నిద్ర లేవగానే మన రక్తంలోని చక్కెర మోతాదులు తక్కువగా ఉండి, వాటిని స్థిరీకరించడం కోసం శరీరం సమతులాహారాన్ని కోరుకుంటుంది. కాబట్టి శరీరం, చక్కెర లేదా కొవ్వులతో కూడిన ఆహారానికి బదులుగా మాంసకృత్తులు, సంక్లిష్టమైన పిండిపదార్థాలు కలిగిన సమతులాహారాన్ని కోరుకుంటుంది. నిద్రలో ఆకలిని తగ్గించే లెప్టిన్ హార్మోన్ మోతాదు పెరిగి, ఆకలిని ప్రేరేపించే గ్రెలిన్ మోతాదు తగ్గుతుంది. అలాగే నిద్రలో శరీరంలో నీటి శాతం కూడా తగ్గిపోతుంది. దాంతో ఉదయం నిద్ర లేవగానే శరీరంలో నీటి మోతాదును పెంచే పోషకభరిత ఆహారం వైపే మొగ్గు చూపుతూ ఉంటాం. అయితే రాత్రి వేళ రక్తంలో చక్కెర మోతాదులు తగ్గి లేదా భావోద్వేగాలు ప్రేరేపితమమై, జంక్ తినాలనే కోరిక పెరుగుతుంది. జంక్ ఫుడ్ మీదకు మనసు మళ్లకుండా చేయడంలో మన హార్మోన్లు ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటాయి. ఎప్పుడైతే రక్తంలో చక్కెర మోతాదులు అదుపు తప్పుతాయో, నిద్రలేమి, పోషకలోపాలు వేధిస్తాయో, భావోద్వేగాలు అదుపు తప్పి, హార్మోన్లు క్రమం తప్పి, ఆహారం మీద యావ పెరుగుతుంది. రక్తంలో చక్కెర మోతాదులు తగ్గితే, తక్షణ భర్తీ



కోసం శరీరం పరితపిస్తుంది. అలాంటి సందర్భాల్లో అత్యధిక క్యాలరీలతో కూడిన ఆహార పదార్థాలు, పానీయాల వైపు మనసు సాగుతుంది. అవి శీతల పానీయాలు కావచ్చు. లేదా చక్కెర కలిపిన టీ, కాఫీలూ కావచ్చు. సరిపడా నిద్ర లేనప్పుడు కూడా ఆకలి హార్మోన్ గ్రెలిన్ ఆకలిని విపరీతంగా పెంచేస్తుంది. సాధారణంగా ఉదయం వేళ ఈ హార్మోన్ మోతాదు తక్కువగానే ఉంటుంది. కానీ హార్మోన్ అసమతౌల్య సమస్య ఉన్నవాళ్లలో గ్రెలిన్ మోతాదు పెరిగి ఆకలి పెరుగుతుంది. ఆకలిని పెంచే పోషక లోపాలు, క్యాల్షియం, ప్రొటీన్ లోపాలకు సూచికలు. రాత్రి భోజనం తర్వాత తీపి తినాలనే కోరిక వేధిస్తుంటే, ఆ భోజనంలో సరిపడా పీచు, ప్రొటీన్, సంక్లిష్టమైన పిండిపదార్థాలు లేవని అర్థం. పాలిష్ పట్టిన బియ్యం, మైదాతో తయారైన పదార్థాలు, లేదా బంగాళాదుంపలతో రాత్రి భోజనాన్ని ముగిస్తే, రక్తంలో చక్కెర మోతాదులు అకస్మాత్తుగా పెరిగిపోయి, వెంటనే చక్కెర మోతాదులు అంతే వేగంగా పడిపోతాయి. ఈ పరిస్థితి కూడా తీపి పదార్థాల వైపు ఆకర్షిస్తుంది. ఆకలిని ప్రేరేపించి, మనసును జంక్ దారి పట్టించే పరిస్థితికి దూరంగా ఉండాలంటే పోషకాలు సరిపడా ఉండే సమతులాహారాన్ని ఎంచుకోవాలి. కంటి నిండా నిద్ర పోవడం కూడా తప్పనిసరి.



అల్సర్

కడుపులో మంటకు కారాలు, మసాలాలు కారణమనుకుంటాం! యాంటాసిడ్లతో ఉపశమనం పొందే ప్రయత్నం చేస్తాం! కానీ కడుపులో మంటతో వేధించే 90 శాతం అల్సర్లకు పొట్టలో తిష్ఠ వేసిన 'హెలికోబ్యాక్టర్ పైలోరి' అనే బ్యాక్టీరియా కారణమని మీకు తెలుసా? అంతిమంగా క్యాన్సర్‌కు సైతం దారితీసే వీలున్న ఈ పెప్టిక్ అల్సర్ గురించి వైద్యులు ఏమంటున్నారంటే...

పొట్టలో పుండు ప్రమాదమా?

పెళుసుబారిన ఎముకల దృఢత్వాన్ని పెంచే ఇంజెక్షన్లు వాడుకునేవాళ్లకు అల్సర్లు తలెత్తే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా హృద్రోగ మందులు వాడుకుంటున్న వాళ్లకు హెలికోబ్యాక్టర్ పైలోరి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు, పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

కడుపులో పుండు.. అంటే 'అల్సర్' అన్నవాహిక చివరి భాగం, జీర్ణాశయం, చిన్నపేగు మొదటి భాగం (డియోడినం)లో తలెత్తవచ్చు. ఈ మూడు భాగాల్లో దేన్లో అల్సర్ తలెత్తినా దాన్ని పెప్టిక్ అల్సర్ డిసీజ్‌గానే భావించాలి. వీటిలో మరీ ముఖ్యంగా జీర్ణకోశం, చిన్నపేగు మొదటి భాగంలో అల్సర్లు తలెత్తే అవకాశాలు ఎక్కువ. సాధారణంగా అల్సరుకు ముందు ఎసిడిటీ లక్షణాలు చాలా కాలం పాటు వేధిస్తాయి. ఛాతీలో మంట, పొట్టలో మంట మొదలైన లక్షణాలు తిన్న తర్వాత తలెత్తుతూ ఉంటాయి కాబట్టి అసలు కారణం ఆహారంలోనే ఉందని భ్రమపడుతూ ఉంటాం. నిజానికి కారాలు, మసాలాలు తినడం వల్ల కడుపులో పుండ్లు ఏర్పడవు. ఇది అపోహ మాత్రమే! ప్రసిద్ధ వైద్య శాస్త్రవేత్త, ఎల్లాప్రగడ సుబ్బారావు గారు, 1970లోనే ఈ విషయాన్ని శాస్త్రీయంగా నిరూపించారు. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. ప్రధానంగా పొట్టలో అల్సర్లు ఒక బ్యాక్టీరియా వల్ల ఏర్పడతాయి. అదే...'హెలికోబ్యాక్టర్ పైలోరి'. 1980 - 1981లో బ్యారీ మార్షల్ అనే వైద్యుడు ఈ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వల్లే అల్సర్లు తలెత్తుతున్నట్టు కనిపెట్టాడు. పొట్టలో అల్సర్లకు 85%, చిన్నపేగు మొదటిభాగంలో అల్సర్లకు 90% ఈ బ్యాక్టీరియానే కారణం.

అంతా ఆ బ్యాక్టీరియా వల్లే...

కలుషితమైన ఆహారం, నీటి ద్వారా పొట్ట లోపలికి చేరుకునే ఈ బ్యాక్టీరియా, దీర్ఘకాలిక నివాసాన్ని ఏర్పరుచుకుని, ప్రారంభ దశల్లో పొట్టలో ఆమ్ల ఉత్పత్తిని పెంచి, పొట్ట లోపల పూతకు కారణమవుతూ ఉంటుంది. వీటినే వైద్య పరిభాషలో... గ్యాస్ట్రిక్, డియోడనల్ ఎరోజన్స్ అంటారు. ఈ సమయంలో కడుపులో మంట, ఛాతీలో మంట, కడుపు ఖాళీగా ఉన్నప్పుడు మంట, తిన్న తర్వాత మంట.. ఇలా భిన్నమైన లక్షణాలు మొదలవుతాయి. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో సమస్యకు అసలు కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, వైద్యులను కలవకుండా సొంత వైద్యంతో ఉపశమనాన్ని పొందే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అయితే ఎసిడిటీ లక్షణాలను నివారించే



ఈ గ్యాస్ మందులు తక్షణ ఉపశమనాన్ని అందించగలుగుతాయి తప్ప, పొట్టలోని బ్యాక్టీరియాను చంపలేవు. కాబట్టి అసిడిటీ సమస్య మందులు వాడినప్పుడు తగ్గుతూ, మళ్లీ తిరగబడుతూ దీర్ఘకాలం పాటు వేధిస్తుంది. 'నాకు గ్యాస్ట్రిక్ సమస్య ఉంది' అనే భావనకు లోనయ్యే 90 శాతం మందిలో ఇదే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉంటుంది. ఈ సమస్య దీర్ఘకాలంలో అల్సర్‌కు దారి తీస్తుంది. అయితే ఈ బ్యాక్టీరియా పొట్టలోకి చేరిపోయిన ప్రతి ఒక్కరికీ అల్సర్ వచ్చేస్తుందని అనడానికి కూడా వీల్లేదు. అల్సర్లు, జన్యుపరంగా సంక్రమించవచ్చు. 'ఒ' రక్త గ్రూపు వ్యక్తుల్లో, పురుషుల్లో, ధూమపాన ప్రియుల్లో ఈ సమస్య ఎక్కువ. అలాగే నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వాడుకునేవాళ్లలో కూడా అల్సర్లు తలెత్తే అవకాశాలు ఎక్కువ. వయసు పెరిగేకొద్దీ గ్యాస్ట్రిక్ అల్సరు తలెత్తే అవకాశాలు కూడా పెరుగుతాయి.

అల్సరు వచ్చిన తర్వాత...

అల్సర్లకు ముందు ఎసిడిటీ లక్షణాలు వేధిస్తే, అల్సరు ఏర్పడిన తర్వాత కొత్తలక్షణాలు మొదలవుతాయి. అవేంటంటే...

పొట్టలో వస్తే...

- ఆహారం తీసుకున్న తర్వాత పొట్టలో నొప్పి
- వాంతి వస్తున్న భావన కలగడం

చిన్న పేగు మొదటి భాగంలో వస్తే...

- సమయానికి భోజనం చేయనప్పుడు కడుపులో నొప్పి
- మధ్య రాత్రి నొప్పితో నిద్ర మెలకువ అయిపోవడం
- పొట్ట పైభాగంలో నొప్పి ఉన్న ప్రదేశాన్ని వేలితో చూపించగలగడం

ఒకే ఒక పరీక్షతో...

పొట్టలో అల్సరు ఉన్నదీ, లేనిదీ, అల్సరు ఉన్న ప్రదేశంతో పాటు హెలికోబ్యాక్టర్ పైలోరి బ్యాక్టీరియా ఉన్నదీ, లేనిదీ కూడా ఎండోస్కోపీ పరీక్షతో తెలుసుకోవచ్చు. భారతదేశంలో ఎండోస్కోపీకి అయ్యే ఖర్చు మూడు నుంచి మూడున్నర వేలు ఉంటుంది. ఎంతో మంది ఈ ఒక్క పరీక్షతో సమస్యను నిర్ధారించుకోకుండా, సంవత్సరాల తరబడి నెలకు ఐదు నుంచి ఆరు వందల రూపాయలు యాంటాసిడ్ల కోసం ఖర్చు పెట్టేస్తూ, సమస్యతో బాధపడుతూనే ఉంటారు. కానీ ఎండోస్కోపీ పరీక్షతో సమస్యను నిర్ధారించుకుని చికిత్స తీసుకుంటే ఈ సమస్య నుంచి శాశ్వతంగా విముక్తి పొందవచ్చు.

> **ఈ యాంటాసిడ్లు సురక్షితం**
>
> తాత్కాలిక ఉపశమనం కోసం పరగడుపున వేసుకునే యాంటాసిడ్ మాత్ర, ద్రవరూపంలో ఉండే యాంటాసిడ్లు సురక్షితం. పది నుంచి పదిహేను రోజుల పాటు ఈ మాత్రను వాడుకోవచ్చు. కానీ ఇదే మాత్ర ప్రతి రోజూ సంవత్సరాల తరబడి వేసుకోవడం ప్రమాదకరం. యాంటాసిడ్ మాత్రలు పొట్ట లోపలి యాసిడ్ ఉత్పత్తిని బాగా తగ్గించేస్తాయి. వీటిని దీర్ఘకాలికంగా వాడుకోవడం వల్ల తినే ఆహారంలోని ఐరన్, క్యాల్షియం శోషణ చెందవు. దాంతో రక్తహీనత వేధిస్తుంది. ఎముకలు గుల్లబారిపోతాయి. కొంతమందిలో మూత్రపిండాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది. పొట్టలోని ఆమ్లం పేగులకు రక్షణ కల్పిస్తుంది. వ్యాధికారక బ్యాక్టీరియా పేగుల్లోకి చేరుకోకుండా అడ్డుపడుతుంది. ఎప్పుడైతే యాంటాసిడ్లతో పొట్టలోని ఆమ్ల ఉత్పత్తిని అణచివేస్తామో, అప్పుడు పేగులకు ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు పెరుగుతాయి. న్యుమోనియా తలెత్తే అవకాశాలు కూడా పెరుగుతాయి.

సమస్య ముదిరిపోకుండా...

గ్యాస్ట్రిక్ అల్సర్‌ను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. హెలికోబ్యాక్టర్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా తలెత్తిన గ్యాస్ట్రిక్ అల్సర్, దీర్ఘకాలంలో గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌గా పరిణామం చెందే ప్రమాదం ఉంటుంది. అంతే కాకుండా గ్యాస్ట్రిక్ అల్సర్లు రక్తస్రావానికి కారణమై రక్తపు వాంతులు, రక్తపు విరోచనాలు లాంటి సమస్యలకు కూడా దారి తీస్తాయి. అలాగే చిన్నపేగు మొదటి భాగంలో తలెత్తే అల్సర్లను నిర్లక్ష్యం చేస్తే, రక్తస్రావం జరిగి, రక్తపు వాంతులు, రక్తపు విరోచనాలు వేధించవచ్చు. ఇలాంటప్పుడు అదే పనిగా యాంటాసిడ్లు వాడుకుంటే, చిన్న పేగు మొదటి భాగం ఇరుకుగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. కొన్నిసార్లు డియోడినం లోపలి పొర చిరిగిపోయి అత్యవసర పరిస్థితి తలెత్తుతుంది. కాబట్టి ఎసిడిటీ రూపంలో బయల్పడే అల్సర్ ప్రారంభ దశను మొదట్లోనే గుర్తించి అప్రమత్తం కావాలి. రెండు నుంచి మూడు నెలలకు పైగా ఎసిడిటీ లక్షణాలు వేధించినా, రెండు నుంచి మూడు వారాలు మందులు వాడుకుని, వాటిని ఆపేసిన వెంటనే సమస్య తిరగబెడుతున్నా, ఎండోస్కోపీ పరీక్ష చేయించుకోవాలి. ఈ సమస్యకు వయసుతో సంబంధం లేదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ ఈ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ తలెత్తవచ్చు. ఏదో ఒక సందర్భంలో మనం దరం బయటి ఆహారం తింటూ ఉంటాం. కాబట్టి నీటి ద్వారా, ఆహార పదార్థాల ద్వారా హెలికోబ్యాక్టర్ పైలోరి బ్యాక్టీరియా మన పొట్టలోకి చేరిపోతూ ఉంటుంది. ఒకట్రెండు రోజుల పాటు ఎసిడిటీ లక్షణాలు తలెత్తి తగ్గిపోతే భయపడవలసిన అవసరం లేదు. కానీ వారాల తరబడి తరచూ ఇబ్బంది పడుతున్నవాళ్లు తప్పనిసరిగా వైద్యులను కలిసి పరీక్ష చేయించుకోవాలి.

అల్సర్లు రాకుండా...

- బయటి ఆహారం మానేయాలి
- ఎసిడిటీ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు
- ఎంతో అరుదుగా తప్ప యాంటాసిడ్లు వాడుకోకూడదు
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- నొప్పి నివారణ మందుల వాడకం పరిమితం చేయాలి

14 రోజుల్లో బ్యాక్టీరియా హతం

హెలికోబ్యాక్టర్ పైలోరి కారక ఇన్‌ఫెక్షన్‌ను సమూలంగా అంతం చేయడం ఎంతో సులభం. ఎమాక్సిసిలిన్, క్లారిత్రోమైసిన్, ఒక ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్.. ఈ మూడు మాత్రల సమ్మేళనంతో, 14 రోజుల పాటు చికిత్స తీసుకుంటే, 95 శాతం మందిలో ఈ ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోతుంది. మిగతా ఐదు శాతం మందిలో యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ మూలంగా ఈ ఇన్‌ఫెక్షన్ అదుపులోకి రాకపోవచ్చు. ఉదాహరణకు హైదరాబాద్‌లో హెలికోబ్యాక్టర్ పైలోరి చికిత్సలో క్లారిత్రోమైసిన్ రెసిస్టెన్స్ కనిపిస్తోంది. వీరికి క్లారిత్రోమైసిన్‌కు బదులుగా, లీవోఫ్లాక్సాసిన్‌ను ఇవ్వవలసి ఉంటుంది. ఈ 14 రోజుల చికిత్సతో గ్యాస్ట్రిక్ అల్సర్‌ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌కు దారి తీయకుండా నివారించుకోవచ్చు.

సర్జరీ అరుదుగానే...

జీర్ణాశయంలో లేదా చిన్నపేగు మొదటి భాగంలో రక్తస్రావం జరుగుతూ ఉంటే, దాన్ని నియంత్రించడం కోసం సర్జరీ అవసరమవుతుంది. డియోడినంలో పుండు పడితే వెంటనే సర్జరీ చేయవలసి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పేగులోని కొంత భాగాన్ని తొలగించి, బైపాస్ సర్జరీ చేయవలసి రావచ్చు. డియోడినం ఇరుకుగా మారినప్పుడు కూడా సర్జరీ చేయవలసి రావచ్చు.

డాక్టర్ సోమశేఖర రావు
సీనియర్ కన్సల్టెంట్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్



అప్రమత్తం

స్మార్ట్ ఫోన్ విజన్ సిండ్రోమ్

మన పనులు, కాలక్షేపాలు స్మార్ట్‌ఫోన్లతోనే ముడిపడిపోవడంతో, దీర్ఘకాలం పాటు వాటిని వాడుకుంటూ ఉండడం వల్ల, స్మార్ట్ ఫోన్ విజన్ సిండ్రోమ్ సమస్య తలెత్తుతోంది. కళ్లను దెబ్బతీసే ఈ సమస్యను అరికట్టాలంటే...

ఎక్కువ సమయాల పాటు: పని కోసం, కాలక్షేపం కోసం, వినోదం కోసం ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోవడం మానేయాలి

కళ్లు ఆర్పడం: స్మార్ట్‌ఫోన్లను వాడుకుంటున్నప్పుడు కళ్లు ఆర్పడం 60 శాతం మేరకు తగ్గించేస్తూ ఉంటాం. దాంతో కళ్లు మంటలు, పొడిబారే సమస్యలు మొదలవుతాయి.

కళ్లకు దగ్గరగా: ఫోన్లను కళ్లకు మరీ దగ్గరగా పెట్టుకుని వాడుకోవడం వల్ల కంటి కండరాల మీద ఒత్తిడి పెరుగుతుంది.

సరిపడా వెలుగు: తక్కువ వెలుగులో ఫోన్లను



వాడుకోవడం వల్ల కూడా కళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది.

లక్షణాలు ఇవే!

చూపు మసకబారడం: ఏకాగ్రతగా చూడలేకపోవడం

తలనొప్పి: కళ్లు అలసటకు గురవడంతో తరచూ తలనొప్పి వేధించడం

కళ్లు: కనురెప్పలు ఆర్పకపోవడం వల్ల కళ్లు పొడిబారడం

మెడ, భుజం నొప్పి: స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించేటప్పుడు సరైన శరీర భంగిమ పాటించడకపోవడం వల్ల మెడ, భుజం నొప్పులు వేధిస్తాయి

నిద్రలేమి: నీలి వెలుగుకు అవసరానికి మించి బహిర్గతం అవడం వల్ల శరీర జీవగడియారం క్రమం తప్పి, నిద్ర సమస్యలు వేధిస్తాయి

పరిష్కారాలున్నాయి

కృత్రిమ కన్నీళ్లు: ఇవి పొడిబారిన కళ్లకు తేమనిచ్చి, మంటను తగ్గిస్తాయి

బ్లూ లైట్ గ్లాసెస్: ఈ ప్రత్యేకమైన లెన్స్‌లు నీలి రంగును వడగట్టి కళ్ల అలసటను నివారిస్తాయి

కంటి వ్యాయామాలు: ప్రతి 20 నిమిషాలకూ, 20 సెకన్ల పాటు, 20 అడుగుల దూరంలో ఉన్న ఒక వస్తువును చూడగలిగితే కంటి కండరాలు సేద తీరతాయి.

ఇన్‌ఫ్లమేషన్‌కు అడ్డుకట్ట ఇలా...

ఆరోగ్య రంగంలో తాజాగా 'ఇన్‌ఫ్లమేషన్' ప్రధాన అంశంగా మారిపోయింది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవడం కోసం ఎంతో మంది, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను అనుసరించడం మొదలుపెట్టారు. అయితే ఎలాంటి జాగ్రత్తలతో, ఆరోగ్య, ఆహార నియమాలతో ఇన్‌ఫ్లమేషన్‌ను అదుపులో పెట్టుకోవచ్చో ప్రముఖ సెలెబ్రిటీ డైటీషియన్, రుజుత దివేకర్, సామాజిక మాధ్యమం ద్వారా ఇలా వివరిస్తున్నారు.

'నిజానికి ఇన్‌ఫ్లమేషన్ ఆరోగ్యాన్ని పూర్తి స్థాయిలో నష్టపరచదు. వ్యాధుల నుంచి కోలుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. అయితే దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ కచ్చితంగా ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది. కాబట్టి సహజసిద్ధ శరీర ప్రతిస్పందన అయిన ఇన్‌ఫ్లమేషన్‌ను ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలో తెలుసుకోవడం అవసరం. శరీరానికి దెబ్బ తగిలినప్పుడు, ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు, లేదా ప్రమాదకరమైన ప్రేరకాలకు లోనైనప్పుడు శరీరం సహజసిద్ధ రక్షణ వ్యవస్థను ప్రేరేపించడంలో భాగంగా ఇన్‌ఫ్లమేషన్ చోటు చేసుకుంటుంది. శరీరం, దెబ్బతిన్న కణజాలాలను మరమ్మతు చేసుకోవడం కోసం, ఇన్‌ఫెక్షన్లతో పోరాడడం కోసం ఇన్‌ఫ్లమేషన్ అవసరం. అయితే అస్తవ్యస్థ ఆహారపుటలవాట్లు, ఎక్కువ సమయాల పాటు విశ్రాంతిలో గడిపే అలవాట్లు, నిద్రలేమి లాంటి కారణాల వల్ల ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమవుతుంది. ఇది దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆటోఇమ్యూన్ డిజార్డర్ లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. వంటింటి చిట్కాలు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించగలుగుతాయని చాలా మంది నమ్ముతూ ఉంటారు. ఆ క్రమంలో పసుపు నీళ్లు, డిటాక్స్ రసాలు తాగడం, పచ్చి కూరగాయలు తినడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే శరీర ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌కు ఏకైక చిట్కా లాంటిదంటూ ఏదీ ఉండదు. సమతులమైన, సుస్థిరమైన ప్రయత్నాలతోనే ఈ సమస్యను అదుపులోకి తెచ్చుకోగలుగుతాం!

ఆహారం మాయాజాలం కాదు

సూపర్‌ఫుడ్స్ అని చెప్పుకునే ఆహార పోకడలు ఇన్‌ఫ్లమేషన్‌ను సమూలంగా నయం చేయలేవు. ఫలానా ద్రవ, ఘన పదార్థంతో చిటికెలో ఇన్‌ఫ్లమేషన్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చు అనుకుంటే అది అపోహ మాత్రమే! నిజానికి కొన్ని పదార్థాలకు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం ఉన్నప్పటికీ, పరిపూర్ణ ఆహార నియమాల్లో భాగంగా వాటిని మన భోజనంలో జోడించుకోగలిగినప్పుడే వాటి ఫలాన్ని పొందగలుగుతాం! అలా కాకుండా పచ్చికూరగాయలు లేదా పండ్లు, కూరగాయల స్మూదీలనే ప్రధాన భోజనంగా తీసుకోవడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పూర్తిగా తగ్గిపోదు. బదులుగా పొట్టుతీయని, పాలిష్ పట్టని పదార్థాలతో సమతులమైన ఆహారం తీసుకోవాలి.



> **ఒత్తిడి వద్దు**
>
> ఆధునిక జీవనశైలులతో ఒత్తిడి మోతాదులు ఎక్కువైనప్పుడు కూడా ఇన్‌ఫ్లమేషన్ వేధిస్తుంది. కాబట్టి ఇతరుల గుర్తింపు, మెప్పు కోసం పరితపించడం మానేసి, స్వీయ సంరక్షణ, మానసిక శ్రేయస్సు మీద దృష్టి పెట్టాలి. ధ్యానం, ప్రాణాయామం, నచ్చిన అభిరుచులకు సమయాన్ని కేటాయించడం లాంటివాటితో ఒత్తిళ్లను సహజసిద్ధంగా తగ్గించుకోవాలి.

వ్యాయామం సరిపడా...

ఇన్‌ఫ్లమేషన్ క్రమబద్ధీకరణకు వ్యాయామం తోడ్పడుతుంది. అయితే అవసరానికి మించి లేదా అవసరమైనదానికంటే తక్కువ వ్యాయామంతో ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ సమయం పాటు కదలకుండా ఉండిపోయేవారిలో ఇన్‌ఫ్లమేషన్ పెరగడంతో పాటు, శరీరం శక్తిని ఖర్చు చేసుకోలేని మెటబాలిక్ సమస్యలు కూడా పెరుగుతాయి. అలాగే వ్యాయామం చేయడంతో పాటు శరీరానికి వ్యాయామం నుంచి కోలుకునే సమయాన్ని కూడా ఇవ్వాలి. లేదంటే శరీరం ఒత్తిడికి లోనై, ఇన్‌ఫ్లమేషన్ పెరిగిపోతుంది. కాబట్టి బరువులతో కూడిన స్ట్రెంగ్త్ ట్రైనింగ్, యోగా, నడకలతో వ్యాయామ ప్రయోజనాలను పొందాలి.

నిద్ర కంటి నిండుగా..

ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో నిద్ర ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే విషయాన్ని చాలా మంది పట్టించుకోరు. శరీరం కోలుకునే ప్రక్రియ నిద్రలోనే జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి మోతాదులను పెంచి, దాంతో ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమై, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి నిద్రవేళలకు ఒక క్రమం పాటిస్తూ, నిద్రకు ముందు ఫోన్లు, టీవీల వాడకాన్ని తగ్గించాలి.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారం

ఇన్‌ఫ్లమేషన్‌కు విరుగుడు ఆహారంతో ప్రయోజనం ఉంటుంది. అయితే ఆ ఆహారం ప్రభావం... మెటబాలిజం (శరీరం శక్తిని ఖర్చుచేసుకునే వేగం), ఆహారపుటలవాట్లు, ఆహార మోతాదుల మీద ఆధారపడి ఉంటుంది. ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలన్నీ సమపాళ్లలో దక్కాలంటే భోజన ప్రణాళికను తయారుచేసుకోవాలి. సమతులాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, కంటి నిండా నిద్రపోతూ, మానసిక ఒత్తిడిని అదుపులో పెట్టుకున్నంత కాలం ఇన్‌ఫ్లమేషన్ మన దరి చేరకుండా ఉంటుంది.

ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆకస్మిక తనిఖీలు

- అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశాలు!
- లోపాలుంటే ఆసుపత్రిని సీజ్ చేసే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులపై వరుసగా ఫిర్యాదులు వస్తుండటంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రులలోనూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన బృందాలను సిద్ధంగా ఉంచాలంటూ ఆయన వైద్య ఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. తనిఖీల్లో తప్పిదాలను గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వాస్పత్రులలో వైద్యులు వేళలను పాటించకపోయినా, డ్యూటీలకు సరిగా హాజరు కాకపోయినా వెంటనే సస్పెండ్ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీల్లో లోపాలుంటే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రిని సీజ్ చేయడం వంటి చర్యలు చేపట్టవచ్చని తెలుస్తోంది. కాగా, ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు ఎలాంటి గుర్తింపు ఇవ్వవద్దని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మెడికల్ కౌన్సిల్ కూడా ఈ అంశంపై సీరియస్‌గా ఉందని, అర్హత లేకుండా వైద్యం చేసే ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులతో ప్రజల ఆరోగ్యానికి ప్రమాదమని తెలిపింది.

ఇష్టానుసారంగా మార్క్ చేస్తే ఎలా..?

- అసంబద్ధంగా కేబీఆర్ పార్క్ చుట్టూ భూసేకరణ
- జీహెచ్ఎంసీ అధికారులతో కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు చుట్టూ నిర్మించనున్న ప్రాజెక్టులకు సంబంధించి ఆస్తుల సేకరణ కోసం చేసిన మార్కింగ్ అసంబద్ధంగా ఉందని సినీ హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబరిదిలను కలిసేందుకు ఆయన జీహెచ్ఎంసీ కార్యాలయానికి వచ్చారు. వారు లేకపోవడంతో ప్రజావాణిలో ఉన్న అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. తన ఇంటికి ఎడమ వైపు 19 అడుగులు, కుడివైపు 36 అడుగుల మార్కింగ్ చేశారని.. ఒకే నిర్మాణానికి ఇలా భిన్నంగా స్థలాన్ని సేకరించడం ఏంటని ప్రశ్నించారు. 100 అడుగులున్న రోడ్డును 120 అడుగులకు విస్తరిస్తే.. ఆ ప్రకారం మార్కింగ్ చేయలేదని చెప్పారు. కుడివైపు ఎక్కువ స్థలం సేకరించకుండా చూడాలని కోరారు. దీనిపై పట్టణ ప్రణాళికా విభాగం స్పందించింది. వేర్వేరుగా మార్కింగ్ చేయడానికి కారణాలను గతంలోనే ఆయనకు వివరించామని తెలిపింది. చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి వద్ద మలుపు ఉండడం వల్లే ఎక్కువ స్థలం తీసుకోవాల్సి వస్తుందని చెప్పింది.

బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష

- రాష్ట్రాభివృద్ధికి బీజేపీ నేతలు కలిసి రావాలి: రఘురామిరెడ్డి
- హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలి: అనిల్ యాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, కేంద్రం మాత్రం రాష్ట్రానికి నిధులివ్వడంలో వివక్ష చూపుతోందని కాంగ్రెస్ ఎంపీ రఘురామిరెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు కలిసి రావాలని కోరారు. సోమవారం పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై తీరని వివక్ష చూపారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తారని ఎంతో ఆశించామని, కానీ 4 కోట్ల తెలంగాణ ప్రజలకు నిరాశే మిగిల్చారని చెప్పారు. ఇకనైనా రాజకీయాలు పక్కనపెట్టి బీజేపీ మిత్రులు తెలంగాణ అభివృద్ధికి కలిసి రావాలని కోరారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మరో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ లేఖ రాశారు. విభజన హామీల్లో భాగంగా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉండాలని కోరారు.

ఏపీ, తెలంగాణలో అటల్ భూజల్ యోజన!

- 8,200 కోట్లతో కొత్తగా 5 రాష్ట్రాలలో విస్తరణకు కేంద్రం యోచన
- 'జల్ జీవన్'పై స్థాయీ సంఘం నివేదిక
- వెనుకబడిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్
- సంతృప్తికర జాబితాలో తెలంగాణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భూగర్భ జలాల సుస్థిరతను పెంపొందించేందుకు అమలు చేస్తున్న అటల్ భూజల్ యోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 5 రాష్ట్రాలకు విస్తరించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుతం నీటి కొరత ఉన్న 7 రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. కొత్తగా ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, బిహార్, పంజాబ్ రాష్ట్రాలకు విస్తరించాలని భావిస్తున్నట్లు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ.. జల వనరుల స్థాయీ సంఘానికి తెలియజేసింది. రూ.8,200 కోట్ల నిధులతో ఈ 5 రాష్ట్రాలలో కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలు చేసేందుకు ఆర్థిక శాఖలోని ఖర్చుల విభాగం ప్రాథమిక అనుమతి ఇచ్చిందని వెల్లడించింది. కాగా సోమవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ సారథ్యంలోని జలవనరుల స్థాయీ సంఘం జల్ జీవన్ మిషన్‌పై నివేదిక సమర్పించింది. 2024 డిసెంబరు నాటికి దేశంలోని అన్ని గ్రామీణ కుటుంబాలకు కొళాయి నీళ్లు ఇవ్వాలన్న జల్ జీవన్ మిషన్ లక్ష్యం... గడువు ముగిసినా నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేసింది. పనితీరు సరిగా లేని రాష్ట్రాలు వాటి లక్ష్యాలు సాధించేందుకు కేంద్రం సాయం చేయాలని కోరింది. జాతీయ సగటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్‌లలో పురోగతి తక్కువగా ఉందని వెల్లడించింది. తెలంగాణ, పుదుచ్చేరి, గుజరాత్, పంజాబ్ సహా 11 రాష్ట్రాలు మాత్రమే 'హర్ ఘర్ జల్' హోదాను సాధించడంలో సంతృప్తికర స్థాయికి చేరుకున్నాయని పేర్కొంది. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పురోగతి 53.84 నుంచి 96.42 శాతం వరకు ఉన్నట్టు వెల్లడించింది. ఇటీవల పార్లమెంటులో కేంద్రం సమర్పించిన డేటా ప్రకారం దేశంలో మొత్తం 19.36 కోట్ల గ్రామీణ కుటుంబాలకు గాను 15.40 కోట్ల కుటుంబాలకు (79.50 శాతం) ఈ పథకం వర్తింపజేసింది. జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగిస్తున్నట్టు ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు.

జాతీయ టాస్క్‌ఫోర్స్‌కు సిఫారసు

దేశంలో నీటి డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించేందుకు జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని జల వనరుల స్థాయీ సంఘం కోరింది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామిక వృద్ధి, వాతావరణ మార్పుల దృష్ట్యా నీటి లభ్యత సమస్యగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నీటికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తగినంత లభ్యత కోసం అన్ని ప్రయత్నాలు చేయాలని పేర్కొంది.

రంగరాజన్‌కు సీఎం ఫోన్

పరామర్శించి... అండగా ఉంటామని భరోసా.. రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ఇది సనాతన ధర్మంపై దాడి: కిషన్ రెడ్డి
- హిందూ సంఘాల పేరుతో దాడి హేయం: సంజయ్
- రంగరాజన్‌కు కొండా సురేఖ పరామర్శ
- రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు: కేటీఆర్
- దాడిని ఖండించిన అర్చక సంఘాలు


రంగరాజన్‌తో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇలాంటి దాడులను సహించేది లేదని స్పష్టం చేశారు. రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించి, ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, అండగా ఉంటామని రంగరాజన్‌కు భరోసా ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తేవాలని సూచించారు. త్వరలోనే చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శిస్తానని చెప్పారు. సోమవారం సాయంత్రం చిలుకూరు ఆలయానికి వచ్చిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య రంగరాజన్‌ను పరామర్శించారు. ఆయన సీఎంకు ఫోన్ చేసి రంగరాజన్‌తో మాట్లాడించారు. సనాతన ధర్మ పరిరక్షణకు అంకిత భావంతో సేవలందిస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తున్న రంగరాజన్‌పై దాడి అమానుషమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని సనాతన ధర్మంపై జరిగిన దాడిగా భావించాలని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్.. రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. హిందూ సంఘాల పేరుతో దాడులు చేయడం హేయమని పేర్కొన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా రంగరాజన్‌ను పరామర్శించారు. రంగరాజన్‌పై దాడిని ఆర్ఎస్ఎస్ ఖండించింది. రంగరాజన్‌ను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. రామరాజ్యం సంస్థ పేరుతో రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ రావణరాజ్యం చేయాలనుకుంటే సహించేది లేదన్నారు. 'రామరాజ్యం' పేరుతో అరాచకాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. రంగరాజన్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రంగరాజన్‌ను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ దైవ సేవలో నిమగ్నమయ్యే రంగరాజన్, సౌందరరాజన్ కుటుంబ పరిస్థితి ఇలా ఉందంటే.. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. రామరాజ్యం సంస్థ సభ్యులమంటూ వెళ్లిన ఒక మూక రంగరాజన్‌పై దాడి చేయడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో పోలీసులు నిగ్గు తేల్చాలని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రాహ్మిణ్ అసోసియేషన్స్, భాగ్యనగర అర్చక పరిషత్ ప్రతినిధులు, బాసర సరస్వతి ఆలయ అర్చక వైదిక బృందం, అర్చక, ఉద్యోగ జేఏసీ, అర్చక, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రంగరాజన్‌పై దాడిని ఖండించారు.

23 మంది నిందితులను గుర్తించాం

- 11 మంది తెలంగాణ, 12 మంది ఏపీకి చెందిన వారు.. ఆరుగుర్ని అరెస్టు చేశాం
- ప్రధాన నిందితుడిది అనపర్తి: పోలీసులు


వీర రాఘవరెడ్డి

రాజేంద్రనగర్/అనపర్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రంగరాజన్‌పై దాడిలో మొత్తం 25మంది పాల్గొనగా 23 మందిని గుర్తించామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 12 మంది ఏపీ వారు కాగా, తెలంగాణ వాళ్లు 11 మంది ఉన్నారన్నారు. ప్రధాన నిందితుడు కొవ్వూరి వీరరాఘవరెడ్డిని ఇప్పటికే అరెస్టు చేయగా, సోమవారం మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రామరాజ్యం పేరుతో ఆర్మీ ఏర్పాటు చేసుకున్న వీరరాఘవరెడ్డి ఈ నెల 6న చిలుకూరు ఆలయానికి వెళ్లి డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడని తెలిపారు. రంగరాజన్ ఒప్పుకోకపోవడంతో దాడి చేశాడన్నారు. వీర రాఘవరెడ్డిపై 2015లో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. అరెస్టైన నిందితుల్లో నిజామాబాద్‌కు చెందిన సాయన్న, ఖమ్మంకు చెందిన గోపాల్, శ్రీను, శిరీష, బేబిరాణి ఉన్నట్లు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. వీరరాఘవరెడ్డి.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన వాడు.

60 రోజులు రాకపోతే అనర్హత వేటు!

- బడ్జెట్ సమావేశాలకు జగన్ రావాలి
- ఎమ్మెల్యేకు ఇచ్చే సమయమే ఇస్తాం
- ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడి వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా 60 రోజులు అసెంబ్లీకి రాకుండా ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. వైసీపీ ఎమ్మెల్యే వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై, తమ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడాలని సూచించారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం...ఒక ఎమ్మెల్యేకు ఇచ్చినంత సమయం సభలో మాట్లాడేందుకు ఆయనకు కూడా ఇస్తామని తెలిపారు. శాసనసభ సమావేశాలను కౌరవసభ మాదిరిగా కాకుండా గౌరవసభలా హుందాగా నడుపుతామని స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాలకైనా ఆయన రావాలని సూచించారు. ప్రతిపక్ష హోదా లేని జగన్‌కు సీఎంకు ఇచ్చినంత సమయం ఎలా ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. సోమవారం ఏపీ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడారు. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలకు ఈ నెల 22,23 తేదీల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన అయ్యన్నపాత్రుడు.. జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు రావాలని హితవు పలికారు. సభలో వారికైనా మాట్లాడే స్వేచ్ఛనివ్వాలని జగన్‌కు సూచించారు. ఎమ్మెల్యే సభకు దూరంగా ఉండటంపై స్పందిస్తూ.. సభ్యులు నిర్దిష్ట కారణం వల్ల అసెంబ్లీకి రాలేకపోతున్నానంటూ స్పీకర్ కు ఇవ్వాలనీ, ఆ లేఖలో సహేతుక కారణం ఉంటే స్పీకర్ అనుమతి ఇస్తారని వివరించారు. సభకు రాని సభ్యులు వ్యక్తిగతంగా లేఖలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేమ.. బ్రేకప్ నేపథ్యంలో



పా పాండి, రాయన్ వంటి బ్లాక్ బస్టర్‌ల తర్వాత ధనుష్ దర్శకత్వంలో వస్తున్న మరో చిత్రం 'జాబిలమ్మ నీకు అంత కోపమా'. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 21న విడుదలవుతోంది. తెలుగులో ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ ప్రారంభంలో..ధనుష్ కనిపించి ఇదొక సాధారణ ప్రేమ కథ అని అసలు కథలోకి తీసుకెళ్తాడు. ఓ ప్రేమ, బ్రేకప్ నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం వినోదభరితంగా ఉండబోతోంది.

ఆ సన్నివేశం సినిమాలో లేదు

విశ్వక్ సేన్



"మా కంట్రోల్‌లో లేకుండా ఒక వ్యక్తి చేసిన తప్పుకి మా సినిమాని బలి చేయకండి. ఇది మా విన్నపం. ఆ వ్యక్తికి నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆయన మా సినిమాలో నటించాడంతే. ఆయన తరపున నేను క్షమాపణలు చెప్తున్నాను. దయ చేసి సినిమాని విడుదల కాకముందే చంపకండి. ప్లీజ్ సపోర్ట్ 'లైలా'. అయినా, ఆయన అన్న డైలాగ్ గానీ, సన్నివేశం గానీ సినిమాలో లేదు. ఈ సినిమా నాకెంతో స్పెషల్. లేడీ క్యారెక్టర్ కోసం చాలా కష్టపడ్డాను. 'బాయ్‌కాట్ లైలా' అంటూ 25 వేల ట్వీట్లు చేశారు. రిలీజ్ రోజునే సినిమా హెచ్‌డీ ప్రింట్ లీక్ చేస్తాం అని బెదిరిస్తున్నారు. ఎవరో చేసిన తప్పుకి మేమెందుకు బలి కావాలి సార్" అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా రామ్‌నారాయణ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో నటుడు పృథ్వీరాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. దీంతో విశ్వక్‌సేన్, సాహు గారపాటి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ "ప్రీ రిలీజ్ ఈవెంట్ తర్వాత 'బాయ్‌కాట్ లైలా' అనే పోస్టులు చూసి షాక్ అయ్యాను. ఆయన అలా మాట్లాడేటప్పుడు మేము చిరంజీవిని ఆహ్వానించడానికి వెళ్లాం. సినిమా అనేది వేల మంది కష్టం. ఈ విషయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలని కోరుతున్నాం" అని చెప్పారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోంది.

సినిమాకు కంటెంటే ముఖ్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి



ఆదిత్య, ప్రియ జంటగా రాజ్ లోహిత్ దర్శకత్వంలో చందన్ కుమార్ కొప్పుల నిర్మించిన చిత్రం 'తకిట తదిమి తందాన'. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'తక్కువ బడ్జెట్ చిత్రమా? కొత్త నటీనటులా అనే విషయాన్ని పట్టించుకోకుండా మంచి కంటెంట్‌తో ఫీల్‌గుడ్‌గా నిలిచే సినిమాలు విజయవంతమవుతున్నాయి. కంటెంట్ ప్రధానంగా వచ్చే చిత్రాలే ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచుతున్నాయి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత రామసత్యనారాయణ, సినీటేరియా మీడియా వర్క్స్ అధినేత వెంకట్, దర్శకుడు రాజ్‌లోహిత్ పాల్గొన్నారు. ఈనెల 27న చిత్రాన్ని విడుదల చేస్తున్నామని నిర్మాత చందన్‌కుమార్ తెలిపారు.

పైరసీ చేస్తున్న వారిని వదిలిపెట్టం

అల్లు అరవింద్



"పైరసీ పెద్ద క్రైమ్. పైరసీ చేస్తున్న వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్ అడ్మిన్‌లకు ఇదే నా హెచ్చరిక. మీపై కేసులు పెట్టాం. జైలుకు వెళ్లే అవకాశముంది. యువత ఇందులో ఇరుక్కోవద్దు. నిర్మాతలు, ఫిల్మ్‌ఛాంబర్, ఓటీటీ చర్యల వల్ల కొన్నాళ్లుగా పైరసీ ఆగింది. కానీ రెండు నెలలుగా మళ్లీ మొదలైంది. 'తండేల్' సినిమాను పైరసీ చేయడమే కాకుండా ఓ ఆర్టీసీ బస్సులో ప్రదర్శించారు" అని అల్లు అరవింద్ అన్నారు. ఇటీవలె విడుదలైన 'తండేల్' సినిమాను పైరసీ చేసి ఆన్‌లైన్‌లో పెట్టడంతో చిత్ర సమర్పకుడు అల్లు అరవింద్, నిర్మాత బన్నీవాసు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బన్నీవాసు మాట్లాడుతూ "సినిమా విజయం సాధించి మేము ఎంజాయ్ చేయాల్సిన సమయంలో ఇలా జరిగింది" అని చెప్పారు.

మెగా అభిమానులకు క్షమాపణలు

"ఈ మధ్య జరిగిన 'తండేల్' ఈవెంట్‌లో నేను రామ్‌చరణ్‌ను తగ్గించి మాట్లాడానని అంటున్నారు. ఈ విషయంలో నన్ను అపార్థం చేసుకున్నారు. నేను దిల్ రాజు పరిస్థితిని వివరించే క్రమంలో.. అలా అన్నాను. దానికి మెగాభిమానులు ఫీలయ్యారు. ఆయన నా ఏకైక మేనల్లుడు. చరణ్‌కి నేను ఏకైక మేనమామని. ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావు. ఎవరైనా నొచ్చుకుని ఉంటే క్షమించండి" అని అల్లు అరవింద్ అన్నారు.

రీరిలీజ్ అయితే సంతోషమే

- రాజ్‌కుమార్ హిరానీ





షారుఖ్ ఖాన్ హీరోగా రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డంకీ'. 2023లో విడుదలైన ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకుని షారుఖ్‌కు హ్యాట్రిక్ హిట్ నిచ్చింది. అయితే, ఇప్పుడు ఈ సినిమా రీరిలీజ్ చేయాలనే ఆసక్తికర చర్చ సోషల్‌మీడియాలో నడుస్తోంది. పంజాబ్ నుంచి అమెరికాకు అక్రమంగా వలస వెళ్లిన కొందరు భారతీయుల కథాంశంగా ఈ సినిమా రూపొందింది. ప్రస్తుతం అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయులను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వెనక్కి పంపిస్తుండడం తెలిసిందే. దీంతో ఈ సినిమాను రీరిలీజ్ చేస్తే ఇందులోని సందేశం, వలస దారుల కష్టాలు అందరికీ మరింత చేరువవుతాయని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ విషయంపై దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ స్పందించారు. "ఈ సినిమాను రీరిలీజ్ చేస్తున్న సంగతి నాకు తెలియదు. ఒకవేళ రీరిలీజ్ అయితే, అది సంతోషకరమైన విషయం. పంజాబ్ నుంచి ఏళ్లుగా అక్రమంగా ఎంతో మంది వలసబాట పడుతూనే ఉన్నారు. కానీ ఆ విషయం ఇప్పుడు అందరికీ తెలుస్తోంది" అని చెప్పారు. మరోవైపు, ఈ సినిమాను ఈ నెలలోనే నిర్మాణ సంస్థ రీరిలీజ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీనిపై నిర్మాతల స్పందన తెలియాల్సి ఉంది. కాగా, ఈ సినిమాలో షారుఖ్ ఖాన్ 'హార్డీ' పాత్రలో నటించారు. విక్కీ కౌశల్, బొమన్ ఇరానీ, అనిల్ గ్రోవర్, తాప్సీ కీలక పాత్రల్లో నటించారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర శ్రీధర్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా నుంచి వెన్నెల కిశోర్ నటించిన డాక్టర్ భ్రమరం క్యారెక్టర్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాత్రలో వెన్నెల కిశోర్ నవ్వులు పూయించనున్నారు. గర్భగుడి వెల్‌నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం తన వద్దకు సంతాన లేమి సమస్యలతో వచ్చే వారిని ఆయుర్వేద వైద్యానికి ఆధునిక ఔషధాలను కలిపి ఎలా ట్రీట్ చేశారు అనేది హిలేరియస్‌గా ఉండబోతుందని చిత్ర బృందం పేర్కొంది.

సీట్ ఎడ్జ్ థ్రిల్లర్



విరాజ్ రెడ్డి హీరోగా జగ పెద్ది తెరకెక్కించిన చిత్రం 'గార్డ్'. 'రివెంజ్ ఫర్ లవ్' ఉపశీర్షిక. అనసూయ రెడ్డి నిర్మించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో విరాజ్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే చిత్రమిది. ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ తప్పకుండా విజయం సాధిస్తుంది. పాటలు అద్భుతంగా ఉంటాయి" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్:రాజ్ మేడ, సినిమాటోగ్రఫీ:మార్క్ కెన్సీల్డ్, సంగీతం:ప్రణయ్ కాలేరు.

స్పోర్ట్స్

వరంగల్ ● మంగళవారం 11 ఫిబ్రవరి 2025

క్వార్టర్స్‌లోనే గుకేష్ అవుట్

హాంబర్గ్ (జర్మనీ): ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ కథ ముగిసింది. సోమవారం జరిగిన క్వార్టర్స్ రెండో గేమ్‌లోనూ కరువానా (అమెరికా) చేతిలో గుకేష్ పరాజయం పాలయ్యాడు. నల్లపావులతో ఆడిన గుకేష్ 18 ఎత్తుల్లోనే ఓటమిని అంగీకరించాడు. తొలి గేమ్‌లోనూ ఓడిన గుకేష్ 0-2తో సెమీస్‌కు అర్హత సాధించలేకపోయాడు. టైటిల్ రేస్ నుంచి నిష్క్రమించిన గుకేష్ చివరి నాలుగు స్థానాల కోసం పోటీపడనున్నాడు.

చెన్నైలో స్క్వాష్ ప్రపంచ కప్

చెన్నై: స్క్వాష్ ప్రపంచ కప్‌నకు చెన్నై నగరం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. పురుషులు, మహిళల విభాగాల ఈ మెగా టోర్నమెంట్ ఈ ఏడాది డిసెంబరు 9 నుంచి 14 వరకు జరగనుంది.

అప్పటి మా జట్టయితే.. మూడు రోజుల్లోనే..!

అర్జున రణతుంగ

న్యూఢిల్లీ: సొంతగడ్డపై టెస్టుల్లో తిరుగులేని భారత్‌కు గతేడాది న్యూజిలాండ్ షాకిచ్చింది. పెద్దగా స్టార్ ఆటగాళ్లు కూడా లేని కివీస్.. టీమిండియాను 3-0తో ఓడించడం పెద్ద చర్చనీయాంశమే అయింది. అయితే, రోహిత్ శర్మ సారథ్యంలో ఇప్పటి భారత జట్టును.. 1996 వరల్డ్‌కప్ సాధించిన శ్రీలంక టీమ్ అలవోకగా ఓడిస్తుందని ఆ దేశ మాజీ కెప్టెన్ అర్జున్ రణతుంగ అన్నాడు. 'చమిందా వాస్, మురళీధరన్ లాంటి బౌలర్లున్న మా జట్టు ప్రస్తుత భారత్‌ను వారి సొంతగడ్డపై మూడు రోజుల్లోనే చిత్తు చేస్తుంద'ని రణతుంగ చెప్పాడు.

ఐర్లాండ్ హ్యాట్రిక్

ఏకైక టెస్ట్‌లో జింబాబ్వేపై గెలుపు

బులవాయో: జింబాబ్వేతో ఏకైక టెస్ట్‌లో ఐర్లాండ్ 63 పరుగులతో గెలిచింది. తద్వారా వరుసగా మూడో టెస్ట్ విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. 2017లో ఐసీసీ పూర్తి స్థాయి సభ్యదేశంగా మారాక ఐర్లాండ్ ఆడిన మొదటి ఏడు టెస్టుల్లో ఓటమిపాలైంది. కానీ గత మార్చిలో అఫ్ఘానిస్థాన్‌పై నెగ్గిన ఆ జట్టు తదుపరి రెండు టెస్ట్‌ల్లో జింబాబ్వేని ఓడించింది. తాజా మ్యాచ్‌లో.. 292 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 183/7తో చివరిరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 228 రన్స్‌కు ఆలౌటైంది. హంఫ్రీస్ (6/57) ఆరు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 260, జింబాబ్వే 267 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 298 రన్స్ చేసింది.

లెఫ్ట్-రైట్ ఓకేనా?

రాహుల్, అక్షర్ స్థానాల మార్పుపై చర్చ



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా అదరగొడుతోంది. వరుసగా రెండు మ్యాచ్‌లను గెలుచుకుని ఇప్పటికే సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకుంది. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ ఫలితం అదుర్స్ అనిపించినా.. ఈ రెండింట్లో కోచ్ గంభీర్ చేసిన ఓ ప్రయోగంపై మాత్రం ఆందోళన వ్యక్తమవుతోంది. వన్డేల్లో ఐదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగే కేఎల్ రాహుల్‌ను ఆర్డర్‌లో కిందికి దించి, ఆ స్థానంలో లెఫ్ట్ హ్యాండర్ అక్షర్ పటేల్‌ను ఆడిస్తుండడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఎందుకంటే.. ఈ ప్రయోగంతో స్పెషలిస్ట్ టాపార్డర్ బ్యాటర్ అయిన రాహుల్ రెండు మ్యాచ్‌ల్లో (2, 10)నూ విఫలమయ్యాడు. అటు స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ మాత్రం ఐదో నెంబర్‌లో 52, 41 (నాటౌట్) రన్స్‌తో అదరగొట్టాడు. కానీ ఈ చర్యతో సమర్థుడైన బ్యాటర్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారన్న భావన అంతటా వ్యక్తమవుతోంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి ముందు అతడికి మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండాపోవడాన్ని ఎలా చూస్తారని, రాహుల్ బ్యాటర్ అనే విషయాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ మర్చిపోతున్నట్టుందని విశ్లేషకులు ఎద్దేవా చేస్తున్నారు. రాహుల్ ఐదో స్థానంలో బరిలోకి దిగిన 30 మ్యాచ్‌ల్లో రెండు శతకాలు, 9 హాఫ్ సెంచరీలతో 1259 పరుగులు సాధించాడు. సగటు కూడా 60కి దగ్గరలో ఉండడం విశేషం. అంతెందుకు.. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో 11 మ్యాచ్‌లో తను 75.33 సగటుతో 452 పరుగులు సాధించాడు. అదే ఆరో స్థానంలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో చేసింది 42 పరుగులే కావడం గమనార్హం. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకున్నా రాహుల్ ఎక్కడ ఆడితే బెటర్ అనే విషయం ఎవరికైనా అర్థమవుతుంది. అందుకే ప్రయోగాలు జట్టుకు లాభపడేలా ఉండాలి కానీ.. బ్యాటర్ ఫామ్‌ను దెబ్బతీసేలా ఉండకూడదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అసలు ఇలాంటి వ్యూహం ఎందుకని ప్రశ్నిస్తే... మిడిలార్డర్‌లో ఓ ఎడమ చేతి బ్యాటర్ ఉండాలని జట్టు కోరుకుంటోందన్నది సమాధానం. అలా అయితే కుడి-ఎడమ కాంబినేషన్ ప్రత్యర్థి బౌలర్లను ఇబ్బంది పెడుతుందని, ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడం తేలికవుతుందని కోచ్, కెప్టెన్ భావిస్తున్నారు. అందుకే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అక్షర్‌ను ఐదో నెంబర్‌లో ఆడించారు. అయితే అతను సక్సెస్ అవుతున్నప్పటికీ.. రాహుల్ ఫామ్ కోల్పోతుండడం జట్టుకు ఏవిధంగా మేలు చేస్తుందనే విషయం కూడా ఆలోచించాల్సి ఉంటుంది. 'ఒకవేళ బ్యాటింగ్‌కు కష్టసాధ్యమైన పిచ్‌పై జట్టు 5 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు అక్షర్‌ను ఆడించే ధైర్యం చేయగలరా? అలాకాని పక్షంలో ఈ మతిలేని ప్రయోగం ఎందుకు?' అని మాజీ పేసర్ దొడ్డ గణేష్ సూటిగా ప్రశ్నించాడు.



పంత్ పరిస్థితేమిటి?

రాబోయే చాంపియన్స్ ట్రోఫీలోనూ జట్టు లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌తోనే వెళ్లనున్నట్టు స్పష్టమవుతోంది. దీన్ని బట్టి కేఎల్ రాహుల్ ఆరో స్థానానికే ఫిక్స్ అవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తుది జట్టులో చోటు లేక బెంచీకే పరిమితమైన రిషబ్ పంత్ పరిస్థితేమిటన్న సందేహం వ్యక్తమవుతోంది. ఇప్పుడున్న బ్యాటింగ్ కాంబినేషన్‌లో అతడికి జట్టులో చోటు కష్టమని మాజీ బ్యాటర్ ఒకరు తేల్చాడు. వ్యాఖ్యాత రవిశాస్త్రి కూడా 'జట్టు కూర్పు గురించి ఓసారి ఆలోచించాలి. పంత్‌లాంటి ఆటగాడిని బెంచీపై కూర్చోపెడితే ఎలా' అని ప్రశ్నించాడు. 2022 రోడ్డు ప్రమాదం తర్వాత పంత్ ఒక్క వన్డే మాత్రమే ఆడి ఆరు పరుగులు చేశాడు. అందుకే జట్టు కీపర్‌గా తొలి ప్రాధాన్యత అనుభవజ్ఞుడైన రాహుల్‌కే ఇస్తున్నారు. అటు రాహుల్ తనకు సరిపోని స్థానంలో ఇబ్బంది పడుతున్నాడు. ఇదిలాగే కొనసాగితే కేఎల్‌ను పక్కకు తప్పించి ఫినిషింగ్ టచ్ ఇచ్చే పంత్‌ను ఆడించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ ఒత్తిడిలో రాహుల్ ప్రదర్శన ఎలా ఉంటుందో ముందుముందు చూడాల్సిందే.



భారత్‌కు సవాల్

ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ నేటి నుంచి

సాత్విక్ జోడీ, లక్ష్య సేన్‌పై ఆశలు

క్వింగ్‌డావో (చైనా): ప్రతిష్ఠాత్మక ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో గతం కంటే మెరుగైన ప్రదర్శనపై భారత్ దృష్టిసారించింది. మంగళవారం నుంచి జరిగే టోర్నీలో ఈసారి భారత్ స్వర్ణంపై గురిపెట్టింది. అయితే, ఏస్ షట్లర్ పీవీ సింధు తొడ కండర గాయంతో చివరి నిమిషంలో టోర్నీకి దూరం కావడంతో.. ఈసారి మనకు కఠిన సవాలే ఎదురుకానుంది. రెండేళ్ల క్రితం దుబాయ్‌లో జరిగిన టోర్నీలో భారత జట్టు కాంస్యం సాధించడంలో సింధు కీలకపాత్ర పోషించింది. అయితే, ఇప్పుడామె తప్పుకోవడంతో.. మహిళల సింగిల్స్‌లో ఆ బాధ్యత వరల్డ్ నెం:29 మాళవిక బన్సోడ్‌పై పడింది. గ్రూప్-డిలో బుధవారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో మకావుతో భారత్ తలపడనుంది. నాకౌట్‌కు చేరాలంటే భారత్ అద్భుత ప్రదర్శన కనబర్చాల్సిన అవసరం ఉంది. ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటి వరకు పసిడి నెగ్గలేదు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీపై భారీ అంచనాలున్నాయి. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకొంటుండగా..అశ్విని-తనీషా క్యాస్ట్రో జంట కూడా అప్పుడప్పుడు మెరుపులు మెరిపిస్తోంది. సతీష్ కరుణాకరన్-ఆద్య వరియత్ జోడీ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది.

ఫ్లడ్‌లైట్స్ ఎందుకు ఆగాయి?

ఒడిశా ప్రభుత్వం సీరియస్

కటక్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో ఫ్లడ్‌లైట్లు ఆగిపోవడంపై ఒడిశా ప్రభుత్వం చర్యలకు దిగింది. భారత్ ఇన్నింగ్స్ 6.1 ఓవర్లప్పుడు 35 నిమిషాలసేపు ఓ ఫ్లడ్‌లైట్ టవర్ మొరాయించడంతో ఆటగాళ్లంతా మైదానం వీడాల్సి వచ్చింది. ఈ ఇబ్బందికర పరిస్థితిపై వివరణ ఇవ్వాల్సిందిగా ఒడిశా క్రికెట్ సంఘానికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆరేళ్ల తర్వాత ఇక్కడ అంతర్జాతీయ వన్డే మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే తాజా వైఫల్యంతో ఇక్కడ మ్యాచ్ నిర్వహణకు బీసీసీఐ ముందుకు వస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు జనరేటర్‌లో సమస్య కారణంగా ఓ టవర్ లైట్లలో సమస్య వచ్చిందని, మరో జనరేటర్ తెచ్చి దాన్ని పరిష్కరించినట్టు ఓ అధికారి తెలిపాడు.



స్నేహిత్ బృందానికి కాంస్యం

200 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో జ్యోతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో స్నేహిత్ సారథ్యంలోని తెలంగాణ టేబుల్ టెన్నిస్ జట్టు కాంస్యం సాధించింది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం ముగిసిన టీమ్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లో తెలంగాణ 0-3తో మహారాష్ట్ర చేతిలో ఓడింది. స్నేహిత్, అలీ, సంతోష్, మహ్మద్, స్వర్ణిందు బృందం కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. మహిళల 200 మీటర్ల హర్డిల్స్‌లో విశాఖపట్నం అమ్మాయి యర్రాజి జ్యోతి, 200 మీ. రేసులో హైదరాబాద్ అమ్మాయి నిత్య ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో తెలంగాణ జిమ్నాస్టులు నిషిక అగర్వాల్, సురభి ప్రసన్న, ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్ విభాగంలో ఆంధ్ర అమ్మాయిలు షేక్ యాసిన్, మోహన రూప ఫైనల్స్ చేరారు.

రాణించిన సూర్య, రహానె

రంజీ క్వార్టర్స్

కోల్‌కతా: సూర్యకుమార్ యాదవ్ (70), కెప్టెన్ అజింక్యా రహానె (88 బ్యాటింగ్) రాణించడంతో హరియాణాతో మ్యాచ్‌లో ఆటకు మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 278/4 స్కోరు చేసింది. మొత్తంగా ముంబై 292 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు శార్దూల్ ఠాకూర్ (6/58) దెబ్బకు ఓవర్‌నైట్ స్కోరు 263/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హరియాణా 301 పరుగులకు ఆలౌటైంది. ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోరు 315కు 14 రన్స్ వెనుకబడింది.

ఉర్విల్, జైమీత్ శతకాలు.. గుజరాత్ 511 ఆలౌట్

ఉర్విల్ పటేల్ (140), జైమీత్ పటేల్ (103) శతకాల మోత మోగించడంతో.. సౌరాష్ట్రతో మ్యాచ్‌లో గుజరాత్ పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 260/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ 511 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన సౌరాష్ట్ర మూడో రోజు ఆట ఆఖరుకు వికెట్ నష్టపోకుండా 33 పరుగులు చేసింది. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 216 రన్స్ సాధించింది.

పట్టుబిగించిన విదర్భ: విదర్భతో మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులకు కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన విదర్భ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 169/5 స్కోరు చేసింది. మొత్తంగా 297 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 353 పరుగులు చేసింది.

కేన్ సెంచరీ

- దక్షిణాఫ్రికాపై కివీస్ గెలుపు

లాహోర్: కేన్ విలియమ్సన్ (133 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో ముక్కోణపు వన్డే టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆరు వికెట్లతో దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. తద్వారా టోర్నమెంట్ ఫైనల్‌కు కివీస్ అర్హత సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 304/6 స్కోరు చేసింది. అరంగేట్ర ఓపెనర్ మాథ్యూ బ్రీజ్కే (150) రికార్డు సెంచరీతో అదరగొట్టాడు. భారీ ఛేదనలో 48.4 ఓవర్లలో 308/4 స్కోరు చేసి న్యూజిలాండ్ విజయం సాధించింది. కాన్వే (97) తృటిలో శతకం మిస్సయ్యాడు.

బిజినెస్



భారత స్టీల్, అల్యూమినియంపైనా టారిఫ్‌లు

ప్రకటించిన ట్రంప్ సర్కారు... దేశీయ కంపెనీలపై రూ.8,750 కోట్ల వరకు భారం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని తీవ్రం చేస్తున్నారు. అమెరికాకు దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రభావం మన దేశ స్టీల్, అల్యూమినియం ఎగుమతులపైనా 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,750 కోట్లు) వరకు ఉంటుందని అంచనా. అయితే అమెరికా మొత్తం స్టీల్ దిగుమతుల్లో మన వాటా కేవలం 5 శాతం మాత్రమే. దీంతో ఈ ప్రభావం భారత స్టీల్ కంపెనీలపై పెద్దగా ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. అల్యూమినియం పరిశ్రమపై మాత్రం ఈ ప్రభావం భారీగానే ఉంటుంది. ప్రస్తుతం అమెరికా మొత్తం అల్యూమినియం దిగుమతుల్లో మన కంపెనీల వాటా 12 శాతం. దీంతో నాల్కో, హిందాల్కో వంటి కంపెనీల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఈ సుంకాల పభావం కెనడా, బ్రెజిల్, మెక్సికో దేశాల కంపెనీలపై మాత్రం ఎక్కువగానే ఉంటుందని అంచనా.

భారత్‌కు డంపింగ్ ప్రమాదం

అయితే ట్రంప్ అన్నంత పని చేస్తే చైనా, ఇండోనేషియా, దక్షిణ కొరియా కంపెనీలు భారత్‌లోకి తమ స్టీల్‌ను మరింత పెద్దఎత్తున డంప్ చేసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశం స్టీల్ దిగుమతులపై 7.5 శాతం సుంకం విధిస్తోంది. దీన్ని రెట్టింపు చేయబోతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రస్తుతం చైనా పెద్దఎత్తున తన మిగులు స్టీల్‌ను మన దేశంలో చౌకగా డంప్ చేస్తోంది. దీంతో టాటా స్టీల్, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి అనేక దేశీయ కంపెనీల లాభాలకు భారీగా గండి పడింది. సొంత గనులు లేని వైజాగ్ స్టీల్ వంటి కంపెనీలైతే ఉత్పత్తి ఖర్చులు దండగ అని ఉత్పత్తిని కుదించుకున్నాయి. ట్రంప్ అన్నంత పని చేస్తే చైనాతో సహా అనేక దేశాలు మరింత ఉధృతంగా తమ మిగులు స్టీల్‌ను మరింతగా డంప్ చేసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఈ పరిస్థితిని తట్టుకునేందుకు స్టీల్ దిగుమతులపై మన ప్రభుత్వమూ 25 శాతం దిగుమతి సుంకం విధించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

మార్కెట్ 'మండే'న్!

మెటల్ షేర్లలో పోటెత్తిన అమ్మకాలు

- సెన్సెక్స్ 548 పాయింట్లకు పైగా పతనం
- 4 రోజుల్లో రూ.7.68 లక్షల కోట్లు ఆవిరి

లోహ రంగ షేర్ల నష్టాలు

కంపెనీ	నష్ట శాతం
నాల్కో	4.83
సెయిల్	4.67
వేదాంత	4.31
ఎన్ఎండీసీ	3.95
టాటా స్టీల్	3.11
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	2.20
హిందాల్కో	1.87
జిందాల్ స్టెయిన్‌లెస్	1.61
జిందాల్ స్టీల్	0.72

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టపోయాయి. లోహం, బ్యాంకింగ్, ఇంధన రంగ షేర్లలో అమ్మకాల కారణంగా సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 753 పాయింట్లు క్షీణించింది. చివరికి సూచీ 548.39 పాయింట్ల నష్టంతో 77,311.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద ముగిసింది. అమెరికాలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై అదనంగా 25 శాతం సుంకం విధిస్తానంటూ ట్రంప్ ప్రకటించడం ఇందుకు ప్రధాన కారణమైంది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల తరలింపు కొనసాగడం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీసింది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,272 పాయింట్లు పతనమవగా.. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.68 లక్షల కోట్లు తగ్గి రూ.417.82 లక్షల కోట్లు (4.77 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. బీఎస్ఈలో 4,225 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,125 నష్టపోయాయి. 993 లాభపడగా.. 107 యథాతథంగా ముగిశాయి. 192 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకోగా.. 2 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.372 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ డిసెంబరు త్రైమాసికంలో రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.245 కోట్లతో పోల్చితే ఇది 52 శాతం అధికం. ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు పెరిగింది. వచ్చే మూడు, నాలుగు సంవత్సరాల కాలంలో 11 ప్రాంతాల్లో 3,512 అదనపు పడకలు ఏర్పాటు చేసే దిశగా సంస్థ కృషి చేస్తోంది. దేశంలోని నలుమూలలా నాణ్యమైన ఆరోగ్య సేవలు సమాజంలో సంపన్నులకు మాత్రమే పరిమితం కాదు... ప్రజలందరి ప్రాథమిక హక్కు అన్న సిద్ధాంతానికి తాము కట్టుబడ్డామని సంస్థ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి అన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.9 (180%) మధ్యంతర డివిడెండును డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డివిడెండు అర్హతకు రికార్డు తేదీని ఫిబ్రవరి 15గా నిర్ణయించారు.

బంగారం భగ్గు



న్యూఢిల్లీ: పసిడి పరుగు ఆపట్లేదు. రోజుకో రికార్డు స్థాయికి ఎగబాకుతోంది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర ఒక్కరోజే రూ.2,430 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.88,500కు చేరింది. కిలో వెండి సైతం రూ.1,000 పెరుగుదలతో రూ.97,500 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహాలకు భారీ డిమాండ్ నెలకొనడంతో పాటు రూపాయి విలువ క్షీణిస్తుండటంతో దేశీయంగా వీటి రేట్లు భగ్గుమంటున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది.

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,900 డాలర్ల మైలురాయిని సైతం దాటేసింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రేటు ఒక దశలో 45.09 డాలర్లు (1.56 శాతం) పెరిగి ఆల్‌టైం రికార్డు స్థాయి 2,932.69 డాలర్లకు ఎగబాకింది. సిల్వర్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రేటు సైతం దాదాపు ఒక శాతం పెరుగుదలతో 32.76 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు ఇందుకు కారణమయ్యాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు (గడిచిన 41 రోజుల్లో) బంగారం ధరలు 10 శాతానికి పైగా పెరిగాయి. ట్రంప్ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలకు దారితీయవచ్చన్న భయాందోళనలు ఉధృతమవుతున్నాయి. తత్ఫలితంగా ఆర్థిక వృద్ధి మందగించడంతో పాటు కమోడిటీల ధరలు మళ్లీ ఎగబాకే ప్రమాదం ఉంది. ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లో పెట్టుబడులకు భద్రమైన సాధనంగా పేరుండటంతో బంగారానికి డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. దాంతో అంతర్జాతీయంగా, దేశీయంగా వీటి ధరలు కొండెక్కుతున్నాయని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు. మార్కెట్లో వాణిజ్య అనిశ్చితి మరింత పెరిగితే, త్వరలోనే ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్లకు చేరుకోవచ్చని వారు భావిస్తున్నారు.

గుడ్‌ఇయర్ కోసం హైదరాబాద్‌లో టెక్ మహీంద్రా జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాలోని ఓహియోకు చెందిన టైర్ల కంపెనీ గుడ్‌ఇయర్ టైర్ అండ్ రబ్బర్ కోసం హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేసేందుకు టెక్ మహీంద్రా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. 3,000 సీట్ల సామర్థ్యంతో కూడిన ఈ జీసీసీలో గుడ్‌ఇయర్ తన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ఐటీ కార్యకలాపాలను నిర్వహించనుంది. ఈ జీసీసీలో పనిచేసేందుకు టెక్ మహీంద్రా తన లక్షన్నరకు పైగా ఉద్యోగుల్లో దాదాపు 2 శాతం మందిని కేటాయించనున్నట్లు తెలిసింది.

టీబీఏఎల్ 300వ ఫ్యూజ్‌లేజ్ సరఫరా

టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్) హైదరాబాద్‌లోని తమ తయారీ కేంద్రం ద్వారా ఏహెచ్-64 అపాచీ ఎటాక్ హెలీకాప్టర్ 300వ ఫ్యూజ్‌లేజ్ (ప్రధాన క్యాబిన్) డెలివరీ చేసింది. కంపెనీ సాధించిన కీలక మైలురాయి ఇది. భారత సైన్యం, అమెరికా సైన్యం సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్లందరి కోసం వీటిని ఈ ప్లాంట్‌లో తయారుచేస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,060 ▲	79,800 ▲	1,07,000 ▲
విజయవాడ	88,500 ▲	82,500 ▲	98,000 ▼
విశాఖపట్నం	85,940 ▲	78,780 ▼	96,230 ▲
రాజమండ్రి	87,050 ▲	79,800 ▲	98,400 ▼
ప్రొద్దుటూరు	86,700 ▲	80,280 ▲	96,000 ▼
ముంబై	85,665 ▲	78,469 ▲	95,533 ▲

రూ. 8.75 లక్షల కోట్ల పెట్టుబడులు

10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు

కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్

నాలుగు ఈయూ దేశాలతో టీఈపీఏ

న్యూఢిల్లీ: యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఈఎఫ్‌టీఏ) కూటమిలోని స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, నార్వే, లీచెన్‌స్టీన్ దేశాలతో మన దేశం వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) పేరుతో ప్రత్యేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో వచ్చే 15 సంవత్సరాల్లో మన దేశంలో 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.75 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెట్టేందుకు ఈ నాలుగు దేశాలు హామీ ఇచ్చాయి. ఇది చివరికి దాదాపు 40,000 కోట్ల డాలర్ల నుంచి 50,000 కోట్ల డాలర్ల పెట్టుబడులకు దారితీసే అవకాశం ఉందని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. ఈ పెట్టుబడులతో ప్రత్యక్షంగా 10 లక్షల ఉద్యోగాలు, పరోక్షంగా 50-60 లక్షల మందికి ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందన్నారు. ఈ సంవత్సరం చివరికల్లా ఈ ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ దేశాలతో వాణిజ్య, పెట్టుబడుల సమన్వయం కోసం తమ మంత్రిత్వ శాఖలో ప్రత్యేక డెస్క్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు గోయెల్ తెలిపారు. ఈ ఒప్పందంతో మన దేశం ఈ దేశాల నుంచి దిగుమతయ్యే చాక్లెట్లు, స్విస్ వాచీలు, కట్ చేసి సానపెట్టిన వజ్రాజలపై సుంకాలను సున్నా లేదా కనీస స్థాయికి తగ్గిస్తుంది.

రిక్తమ్ గ్రూప్ నుంచి జింటర్‌వ్యూఏఐ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంజనీరింగ్ సొల్యూషన్స్ సంస్థ రిక్తమ్ గ్రూప్.. జింటర్‌వ్యూఏఐ పేరుతో ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారితంగా నియామక ప్రక్రియను తమ ప్లాట్‌ఫామ్ చేపడుతుందని రిక్తమ్ టెక్నాలజీ డైరెక్టర్, జింటర్‌వ్యూఏఐ సీఈఓ సిద్ధరామ్ సింగిశెట్టి తెలిపారు. ఇన్నోవేటివ్ ఏఐ ఆధారిత అవతారంతో కూడిన వ్యక్తి తమ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆటోమేటెడ్ ఇంటర్వ్యూలను చేపడతారని ఆయన చెప్పారు. జింటర్‌వ్యూఏఐ ద్వారా ప్రస్తుత టెక్నాలజీలకు తగ్గట్టుగా నైపుణ్యాలు కలిగిన వ్యక్తులను కంపెనీలు ఎంపిక చేసుకోవటంతో పాటు సమయాన్ని ఆదా చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. భారత్, యూఏఈలోని దాదాపు 20కి పైగా కంపెనీలకు తమ ప్లాట్‌ఫామ్ ద్వారా నియామక సేవలను అందిస్తున్నట్లు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	106
వరంగల్	97	గుంటూరు	106
కరీంనగర్	97	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	82
కర్నూలు	97	నెల్లూరు	87
విశాఖపట్నం	100	అనంతపురం	87
గోదావరి	106		

కేసీఆర్ పాలన ఐఫోన్‌లా.. రేవంత్ పాలన చైనా ఫోన్‌లా ఉంది

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలన ఐఫోన్‌లా ఉంటే ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్‌ను తలపిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. జగిత్యాలలో ఆమె మీడియాతో మాట్లాడారు. పాలు తాగి తల్లి రొమ్ము గుద్దిన చందాన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ మారినా.. గులాబీ సైనికులు బీఆర్ఎస్‌ను అంటిపెట్టుకునే ఉండడం అభినందనీయమన్నారు. కేసీఆర్ అండగా ఉన్నంత కాలం ఎత్తిన పిడికిలి దించేది లేదని స్పష్టం చేశారు. సారంగాపూర్ మండలం మంగేళ వద్ద ఓ రైతు తన పొలం ఎండిపోయిందని సోషల్‌మీడియాలో పెట్టిన విషయం తనను కలిచివేసిందన్నారు. కేసీఆర్ పాలనలో వరదకాలువ ఓ జీవధారగా ఉండేదని కవిత పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెడుతూ, కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. రాజకీయాలు పక్కనపెట్టి కాళేశ్వరం లింక్-1 ద్వారా నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 31 సార్లు ఢిల్లీ వెళ్లే తీరికున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీ ప్రతినిధుల సమావేశానికి హాజరుకాకుండా ఏం చేసారని ఆమె ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ బీసీ ఉద్యమ నేతలను అవమానించడమేనని అన్నారు.

రాష్ట్ర విభజన హామీలపై బడ్జెట్‌లో ప్రస్తావన ఏది?

» కేంద్ర బడ్జెట్‌ను సవరించి హామీలను అమలు చేయాలి

» ధర్నా చౌక్ వద్ద ప్రజా సంఘాల పోరాట వేదిక మహా ధర్నా

కవాడిగూడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర బడ్జెట్‌లో ఒక్క అంశం కూడా లేదని, బడ్జెట్‌ను సవరించి రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. విభజన హామీలు అమలు చేసేంతవరకు సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ధర్నాలో పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రజలకు దూరం చేసి ఉపాధి అవకాశాలను దెబ్బతీసే విధంగా బడ్జెట్ ఉందని జాన్ వెస్లీ అన్నారు. తెలంగాణలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, హైస్పీడ్ రైల్వేలేన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదని తమ్మినేని వీరభద్రం విమర్శించారు.

మున్నూరు కాపులకు సర్కారు అన్యాయం..

» 17, 23వ తేదీల్లో నిరసనలు: మున్నూరు కాపు సంఘం

పంజాగుట్ట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణనలో మున్నూరు కాపులకు సర్కారు తీవ్ర అన్యాయం చేసిందని, ఉద్దేశపూర్వకంగానే తమ జనాభాను తక్కువ చేసి చూపిందని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 17, 23వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ సంఘాల నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014లో తమ జనాభా 27 లక్షలు ఉంటే తాజా కులగణనలో 13 లక్షలే ఉన్నట్లు లెక్కలు చూపారని మండిపడ్డారు. ప్రస్తుతం తమ జనాభా సుమారు 40 లక్షలకు పైగా ఉంటుందన్నారు. బీసీ సమగ్ర కులగణన కోసం రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి రిజర్వేషన్ల లైసెన్స్ రద్దు అయ్యింది

» అభివృద్ధి చెందిన మాల సామాజికవర్గాన్ని డి గ్రూపులో పెట్టాలి: మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్, పంజాగుట్ట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దళితుల్లో ఇప్పటి వరకు వివిధ కులాల రిజర్వేషన్లు దోచుకున్న వారి లైసెన్స్ రద్దు అయ్యిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. తెలంగాణ రాష్ట్ర హోలియదాసరి జేఏసీ ఆధ్వర్యంలో తమ సామాజిక వర్గాన్ని గ్రూపు-1లో పెట్టాలనే అంశంపై ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన మాల సామాజికవర్గాన్ని డి గ్రూపులో పెట్టాలని డిమాండ్ చేయాలని చెప్పారు. అత్యంత వెనుకబడిన హోలియదాసరి కులంతో పాటు మరికొన్ని కులాలను ఒకే గ్రూపులో పెట్టి వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కేటాయించాలని సూచించారు.

సమయం ఇవ్వండి.. వచ్చి కలుస్తా.. ముఖ్యమంత్రికి లేఖ

ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదికలో ఉన్న లోపాల వల్ల మాదిగలతో పాటు మరికొన్ని దళిత కులాల హక్కులు, వాటా, అస్తిత్వం, భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని.. వాటిపై చర్చించి తగిన సలహాలు, సూచనలు చేయడానికి తనకు సీఎం రేవంత్ సమయం ఇవ్వాలని మందకృష్ణ మాదిగ సోమవారం ఆయనకు లేఖ రాశారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు.

రిజర్వేషన్లు

పాత విధానంలోనే!

(మొదటిపేజీ తరువాయి)

పట్టణ ప్రాంతాలకు సంబంధించి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అమలు చేయాల్సిన రిజర్వేషన్ల నివేదికను సమర్పించనుంది. ప్రస్తుతం కమిషన్ అందజేసిన స్థానిక సంస్థల రిజర్వే షన్ల నివేదికపై ప్రభుత్వం అధ్యయనం చేయనుంది. ఇదే అంశంపై త్వరలో మంత్రివర్గం సమావేశం కానుంది. కమిషన్ నివేదిక, అమలు చేయాల్సిన రిజర్వేషన్ల అంశం సహా పలు విషయాలపై క్యాబినెట్‌లో చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నారు.

నెలరోజుల్లోనే అధ్యయనం..

బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సుప్రీంకోర్టు తీర్పులోని సూచనల మేరకు తెలంగాణ ప్రభుత్వం 2023 నవంబరు 4న రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించింది. మేధావులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించింది. దాదాపు నెల రోజుల్లోనే వివిధ వర్గాలతో సమావేశమై.. ఆ వివరాల ఆధారంగా అధ్యయనం చేసింది. మరోవైపు 2011 జనాభా లెక్కలు, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగా కమిషన్ తన నివేదికను రూపొందించింది. ఇందులో స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్ల సిఫారసులను 6 కేటగిరీలుగా విభజించింది. దీని ప్రకారం.. గ్రామాల్లోని వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్.. ఇలా 6రకాల రిపోర్టును తయారు చేసింది. ఆయా పదవుల్లో బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్ల వివరాలను పేర్కొంది. రాష్ట్రంలోని గ్రామాల్లో ఉన్న ఎస్సీ లు, గిరిజన గ్రామ పంచాయతీలను పరిగణనలోకి తీసుకుని.. రాజ్యాంగం ప్రకారం వారి కోటా రిజర్వేషన్లు వారికి పోను బీసీలకు ఎంత కేటాయించాలనే దానిపై కసరత్తు చేసింది. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌లకు ఎంత మేర రిజర్వేషన్ కేటాయించాలి, సంబంధిత వార్డులో ఎంత మంది బీసీలు ఉన్నారు, ఒకవేళ బీసీలకు సర్పంచ్ పదవి కేటాయించాలంటే గ్రామం మొత్తంలో ఎంత మంది బీసీలు ఉన్నారనే అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఇదేవిధంగా మండల స్థాయి పోస్టులైన ఎంపీటీసీ, ఎంపీపీలకు వర్తింపజేసింది. ఇక జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ చైర్మన్‌ల అంశంలోనూ మండల, జిల్లాల పరిధిలో ఉన్న ఇతర కులాలను పరిగణనలోకి తీసుకుంది. దీంతోపాటు బీసీలకు గతంలో అమలైన రిజర్వేషన్, ఇప్పటికే ఏ విధమైన పదవులు పొందారనే అంశాలనూ కమిషన్ పరిశీలించింది. ఈ అంశాలన్నింటిని క్రోడీకరించిన తరువాత బీసీల వాటా ప్రకారం వారికి ఆయా పదవుల్లో పోటీ చే సేందుకు అవకాశం కల్పించేలా రిపోర్టును సిద్ధం చేసింది.

సుప్రీం తీర్పునకు లోబడే..

సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 50 శాతం రిజర్వేషన్ మించరాదనే నిబంధనను అనుసరించే నివేదిక ఇవ్వాల్సిందిగా కమిషన్‌ను ఏర్పాటు చేసినప్పుడే ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. దీని ప్రకారం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ జనాభాను 2011 లెక్కల ప్రకారమే పరిగణనలోకి తీసుకున్నారు. బీసీ జనాభా విషయంలో 2011 లెక్కల తోపాటు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన కులగణనలోని బీసీల లెక్కలనూ పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లను కమిషన్ ఖరారు చేసింది. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీల జనాభా మేరకు వారికి రిజర్వేషన్లు పోగా.. మిగిలిన దానిలో బీసీలకు కేటాయించాల్సి ఉంది. అంటే దీని ప్రకారం 2019 నాటి రిజర్వేషన్‌లే ఇప్పుడు కూడా అమలు కానున్నట్లు స్పష్టమవుతోంది. అయితే గిరిజన గ్రామ పంచాయతీల్లో వందశాతం వారికే రిజర్వేషన్లు అమలు కానుండగా.. సాధారణ గ్రామపంచాయతీల్లోనూ గిరిజనులు, ఎస్సీలు ఉంటే వారి జనాభా ప్రకారం వారికి సీట్లను కేటాయించాల్సి ఉంటుంది. తాజాగా ప్రభుత్వం వెల్లడించిన కులగణన వివరాల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం ఉన్నారు. జనాభా వారీగా వారికి రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఇక రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతం (బీసీ హిందువులు, బీసీ ముస్లింలు కలిపి) ఉన్నారు. దీని ప్రకారం చూస్తే.. ఎస్సీ, ఎస్టీలకు పోగా బీసీలకు 23 శాతం మేరకే రిజర్వేషన్లు అమలు కానున్నట్లు స్పష్టమవుతోంది.

తొలుత సర్పంచ్ ఎన్నికలే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాల్సిన రిజర్వేషన్లను ప్రత్యేక కమిషన్ సూచించిన నేపథ్యంలో ప్రభుత్వం మొదటగా సర్పంచ్ ఎన్నికలను నిర్వహించాలనే భావనలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి ఏడాది దాటింది. పైగా సర్పంచ్‌లు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వివిధ గ్రాంట్లు, నిధులు కూడా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మొదటగా సర్పంచ్ ఎన్నికలపైనే ప్రభుత్వం కూడా దృష్టి సారించిందని తెలిసింది. ఇదే అంశానికి సంబంధించి పంచాయతీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఎన్ని దశల్లో నిర్వహించాలి, గతంలో ఎన్ని దశల్లో నిర్వహించారనే వివరాలను సంబంధిత అధికారులకు సీఎంకు నివేదించనున్నట్లు సమాచారం. త్వరలో క్యాబినెట్ భేటీలోనూ ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీ రిజర్వేషన్లు చేసేందుకుగాను.. పట్టణ ప్రాంతాలకు సంబంధించిన కులసర్వే వివరాలు ఇంకా ప్రత్యేక కమిషన్‌కు అందాల్సి ఉంది. అంతేకాకుండా రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కొత్త కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు ఏర్పాటయ్యాయి. గతంలో ఆ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులు, బీసీలు ఎంతమంది ఉన్నారు, కొత్తగా ఏర్పడటం వల్ల వాటి పరిధిలోకి వచ్చిన జనాభా, అందులో బీసీలు ఎంతమంది ఉన్నారనే అన్ని విషయాలను కమిషన్ తీసుకోనుంది. ఈ అంశాలకు సంబంధించిన పూర్తి స్థాయి జాబితాలు అందిన తరువాత పట్టణ ప్రాంతాల్లోని బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేయనుంది.

పంచాయతీ పోరు..

పరీక్షల తర్వాతే?

» ముందుగా పెట్టాలంటే పరుగులు తీయాల్సిందే

» 3 విడతల్లో నిర్వహించాలని ఈసీ యోచన

» బ్యాలెట్ బాక్సుల సేకరణ, బూత్‌ల గుర్తింపు పూర్తి

» కొనసాగుతున్న ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణలు



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ బోర్డు పరీక్షలు మరో 25 రోజుల్లో మొదలు కానున్న నేపథ్యంలో రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న అంశంపై రాజకీయ వర్గాల్లో సర్వత్రా చర్చ కొనసాగుతోంది. మార్చి 5న మొదలయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ముందు పెడతారా? మార్చి 21న మొదలై ఏప్రిల్ 4 వరకు సాగే పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాక చేపడతారా? అనేది తేలాల్సి ఉంది. రిజర్వేషన్ల ఖరారు కోసం ఉద్దేశించిన ప్రత్యేక కమిషన్ సోమవారమే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా పంచాయతీరాజ్ సంస్థలైన గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి స్థానిక పరిస్థితులు, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ కసరత్తు పూర్తి చేయడానికే పంచాయతీరాజ్ శాఖకు కనీసం పది రోజుల సమయం పడుతుందని అంచనా. అన్నీ సిద్ధం చేసుకొనే సరికి ఇంటర్ పరీక్షలు వస్తాయి. వెనువెంటనే పదో తరగతి పరీక్షలు. ఇప్పటికే ఎన్నికల విధులకు జూనియర్ లెక్చరర్లను, ఉపాధ్యాయులను వినియోగించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు ఇంటర్ పరీక్షల ప్రారంభానికి ముందు గానీ, పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాక గానీ చేపట్టాల్సి ఉంటుంది. 25 రోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తి చేయడం సాధ్యమవుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుగానే ఏర్పాట్లు చేసేసింది. 2019లో పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించారు. నోటిఫికేషన్‌కు ఎన్నికల నిర్వహణకు మధ్య రెండు వారాల వ్యవధి ఇచ్చారు. ఒక్కో దశ ఎన్నికకు మధ్య 5 రోజుల విరామం ఇచ్చారు. జిల్లాల వారీగా ఎక్కడి బ్యాలెట్ బాక్సులను అక్కడే ఉపయోగించారు. మూడు దశల్లో పోలింగ్ అయ్యాక ఒకేరోజు ఓట్ల లెక్కింపు చేపట్టారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు కలిపి 2 విడతల్లో నిర్వహించారు. అయితే, ఈ సారి ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలను బట్టి, నిర్వహణకు అందుబాటులో ఉన్న కాలాన్ని బట్టి కొన్ని మార్పులు చోటు చేసుకొనే అవకాశం ఉంది. అంటే, పరీక్షలకు ముందు స్వల్ప వ్యవధిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే దాన్ని రెండు విడతలకు కుదించే అవకాశం ఉంది. లేదా రెండు విడతల్లో నిర్వహించే ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలను ఇంటర్ పరీక్షలకు ముందే నిర్వహించి పంచాయతీ ఎన్నికలను పరీక్షల సీజన్ ముగిసేదాకా వాయిదా వేసే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికలను ఏప్రిల్లో, ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలను మరి కొన్ని నెలల తర్వాత నిర్వహించే అవకాశం ఎక్కువగా ఉందని అంటున్నారు.

ఎన్నికల సంఘం రెడీ

పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, సిబ్బంది వివరాల సేకరణ, ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ స్టేషన్ల పరిధిలో పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి నియామకం పూర్తయింది. రెండు రోజుల్లో శిక్షణ పూర్తవుతుంది. బ్యాలెట్ బాక్స్‌లతో మూడు దశల్లో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రణాళికలు రూపొందించుకుంది. పక్క రాష్ట్రాల నుంచి కూడా బ్యాలెట్ బ్యాక్సులు తెప్పించారు. పంచాయతీ ఎన్నికలతో సంబంధం లేకుండా ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడుతల్లో, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకే విడతలో విడివిడిగా చేపట్టే అవకాశం ఉందని సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్లు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ఒక అధికారి పర్యవేక్షణలో జరిగితే, పోలింగ్ మరో అధికారి పర్యవేక్షణలో జరుగుతుంది. వీరిద్దరే కాకుండా పోలింగ్ సిబ్బంది కూడా ఉంటారు. ప్రతీ 200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ సిబ్బంది ఉంటారు. ఓటర్ల సంఖ్య 650 దాటితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. ఈ కసరత్తు ఇప్పటికే పూర్తయింది.

కేజ్రీవాల్.. రాహుల్‌ను డామినేట్ చేయలేరు

జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి ఆప్‌కు లేదు



» ఎన్నికల వేళ కేజ్రీవాల్‌కు అహంకారం పెరిగింది

» కాంగ్రెస్‌తో పొత్తుండదని ఏకపక్షంగా ప్రకటించారు

» ఎన్నికల్లో అందుకు తగ్గ మూల్యం చెల్లించుకున్నారు

» ఒంటరి పోరుకు సిద్ధం కావాలని ఢిల్లీ ఎన్నికల ద్వారా క్యాడర్‌కు రాహుల్‌గాంధీ సంకేతం

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ది.. రాహుల్‌గాంధీని డామినేట్ చేసే పర్సనాలిటీ కానే కాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి ఆమ్ ఆద్మీ పార్టీకి లేనే లేదన్నారు. గాంధీభవన్‌లో సోమవారం నాడు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఢిల్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషించారు. ఢిల్లీ ఎన్నికల ముందు కేజ్రీవాల్‌లో అహంకారం పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉండబోదంటూ ఏకపక్షంగా ప్రకటనలు చేశారని గుర్తు చేశారు. ఆయన అహంకారానికి ఎన్నికల తర్వాత తగిన మూల్యం చెల్లించుకున్నారన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లడం ద్వారా అక్కడ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని రాహుల్‌గాంధీ భావించి ఉండొచ్చని తెలిపారు. ఒంటరిగా కొట్లాడటానికి సిద్ధం కావాలటూ ఈ ఎన్నికల ద్వారా పార్టీ శ్రేణులకు ఆయన సంకేతం ఇచ్చారని తాను భావిస్తున్నానన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ రోజున ఢిల్లీలో బీజేపీ గెలిచిందని, వచ్చే ఎన్నికల్లో అక్కడ పోటీలో ఉండేది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు

మా సమస్యలపై బీఆర్ఎస్‌ది మొసలి కన్నీరు

» అధికారంలో ఉన్నప్పుడు విస్మరించి ఇప్పుడు హరీశ్ డ్రామాలు

» ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక

నల్లకుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఆరోగ్యమంత్రి హరీశ్ రావు వల్లే ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు దక్కలేదని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ఆరోపించింది. కార్పొరేట్ ఆసుపత్రులను వదిలి పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఆర్ఎంపీ, పీఎంపీలపై అక్రమంగా దాడులు చేయించడం శోచనీయమని పేర్కొంది. సోమవారం తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు పులగం మోహన్, బాలకృష్ణారెడ్డి, రమేశ్ ముదిరాజ్ మాట్లాడారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ తమ సమస్యలను విస్మరించి నేడు ప్రతిపక్షంలోకి రాగానే మొసలి కన్నీరు కార్చడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. హరీశ్‌రావు తన అనుచర వర్గంతో ధర్నాల పేరిట కొత్త నాటకాలకు తెరలేపారని, ఆర్ఎంపీలు, పీఎంపీలు ఆయన మాయలో పడొద్దని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం పట్ల కట్టుబడి ఉందని, ఆ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ సంబంధిత అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసిందని తెలిపారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ తమ పట్ల సానుకూలంగా ఉన్నా.. మెడికల్ కౌన్సిల్ మాత్రం తమ ఆసుపత్రులపై అక్రమంగా దాడులకు పాల్పడుతూ తమను రోడ్డు పాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 18న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న సభలో 36 వేల మంది ఆర్ఎంపీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు కోరారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీల ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, ఎమ్మెల్యే మురాగోపాల్ తదితరులు

ప్రజలను రోడ్డున పడేసిన కాంగ్రెస్

» స్థానిక ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలి

» ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు తీసేయాలి: హరీశ్‌రావు

కవాడిగూడ/నార్సింగ్/హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను రోడ్డున పడేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్ఎంపీ, పీఎంపీలపై ఎలాంటి కేసులు పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు ఇవ్వాలన్న డిమాండ్‌తో తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్.. ఆ హామీని తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. తనిఖీల పేరుతో ఆర్యోగశాఖ అధికారుల వేధింపులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అసెంబ్లీలో ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలపై గళం విప్పుతామని, ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీల తరఫున ప్రతినిధి వస్తే మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు మించిన ఆయుధం లేదని ఆర్ఎంపీ, పీఎంపీలతో పాటు ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదని.. ఈ అంశంపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య అధ్యక్షుడు పంగ మల్లేశ్ తదితరులు మాట్లాడుతూ జీవో 429 ప్రకారం ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, హెల్త్ గైడ్స్‌గా తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

కూల్చివేతలపై హరీశ్ మండిపాటు

గండిపేట మండలం కాశీమందిర్ ప్రాంతంలో మునిసిపల్ అధికారులు కూల్చివేసిన ఇళ్లు, దుకాణాలను హరీశ్‌రావు పరిశీలించి.. బాధితులకు ధైర్యం చెప్పారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ పేదల ఇళ్లు, దుకాణాలను అకస్మాత్తుగా కూలగొడితే వారు ఎలా బతుకుతారని మునిసిపల్ అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికైనా హైడ్రా పేరిట పేదల బతుకులు కూల్చవద్దని, అన్నారు. అనంతరం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి కూల్చివేతలను నిలిపివేయించారు.

తగినంత అంటే ఇంకెంత?


» స్పీకర్ దృష్టిలో సహేతుక సమయం అంటే ఏంటి?

» విషయం ఆయన దగ్గరకు వెళ్లి పది నెలలవుతోంది

» ఇది ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన అంశం

» తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీం

» తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్ కార్యాలయం మీద మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిర్యాదు సభాపతి దగ్గరకు వచ్చి పది నెలలు అవుతోందని, సహేతుకమైన సమయం(రీజనబుల్ టైం) అంటే ఎంతో చెప్పాలని ప్రశ్నించింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేసేలా సభాపతిని ఆదేశించాలని కోరుతూ జనవరి 15న సుప్రీంకోర్టులో దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లపై సోమవారం విచారణ జరిగింది. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీలపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రిట్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. మరోపక్క ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పైనా చర్యలకు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ వేర్వేరుగా రెండు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ మూడు పిటిషన్లపై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రి నాయుడు, న్యాయవాది మోహిత్‌రావు, తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి హాజరయ్యారు.

ఇన్ని నెలల్లో చెప్పాలని సుప్రీం అనలేదు

తొలుత ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ... "పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి పది నెలలు గడుస్తోంది. నేటికీ అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరి తన కూతురికి కాంగ్రెస్ తరఫున ఎంపీ టికెట్ తెచ్చుకున్నారు. కాంగ్రెస్ కండువా కప్పుని కూతురి తరఫున ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో ఫిరాయింపులు అంతా బహిరంగంగానే జరుగుతున్నాయి" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఫిరాయింపులపై స్పందించడానికి స్పీకర్‌కు ఇంకెంత సమయం కావాలని ధర్మాసనం ఈ సందర్భంగా ముకుల్ రోహిత్గీని ప్రశ్నించింది. ఆయన మరికొంత సమయం కావాలని కోరగా, ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. మీ దృష్టిలో (స్పీకర్ దృష్టిలో) సమయం అంటే ఎంతని ధర్మాసనం ప్రశ్నించింది. అసెంబ్లీ కాలపరిమితి ముగిసే వరకా?అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామని, ఇది ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన అంశమని చెప్పింది. ముకుల్ రోహిత్గి కలుగజేసుకుని, గతంలో సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ రీజనబుల్ టైంలో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అందులో ప్రత్యేకించి రీజనబుల్ సమయం అంటే ఎంతో సూచించలేదని చెప్పారు. ప్రత్యేకించి.. రెండు నెలలు లేదా మూడు నెలలు అని సుప్రీంకోర్టు చెప్పలేదని రోహిత్గి అనడంతో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మీ డిక్షనరీ ప్రకారం రీజనబుల్ టైం అంటే ఎంత? స్పీకర్ దృష్టికి వెళ్లి పది నెలలు అవుతోంది. ఇంకెంత సమయం కావాలి? అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఫిర్యాదులను మాత్రమే కాకుండా స్పీకర్ ఇతర పనులను కూడా చూడాల్సి ఉంటుందని రోహిత్గి బదులిచ్చారు. రీజనబుల్ టైం అంటే ఎంతో కనుక్కుని మంగళవారం చెప్పాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కనీసం నాలుగు రోజుల సమయం ఇవ్వాలని రోహిత్గి విజ్ఞప్తి చేశారు. రోహిత్గి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

వేటు తప్పదు

బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మార్చిన 10 మంది ఎమ్మెల్యేలపై తప్పనిసరిగా అనర్హత వేటు పడుతుందని పిటిషనర్ల తరఫున న్యాయవాది మోహిత్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో వాదనలు ముగిసిన తర్వాత ఆయన కోర్టు బయట మీడియాతో మాట్లాడారు.

గతంలో మణిపూర్‌లో ఫిరాయింపులకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు స్పీకర్‌కు సమయంపై నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. స్పీకర్ దృష్టిలో సరైన సమయం అంటే ఎంతో 18 లోపు చెప్పాలని ధర్మాసనం ఆదేశించిందని స్పష్టం చేశారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

- ఈ నెల 7న 15,920 మెగావాట్లు
- 10 రోజులుగా 15 వేల మెగావాట్లు
- నేడు డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పరుగులు పెడుతోంది. ఈ నెల 7న 15,920 మెగావాట్లుగా డిమాండ్ రికార్డయింది. దాంతో రూఫ్‌టాప్ సోలార్‌తో కలుపుకొని ఇది 16 వేల మెగావాట్లు దాటిందని అధికారులు చెబుతున్నారు. ఇక సోమవారం సాయంత్రం 4.32 గంటల సమయంలో రాష్ట్ర డిమాండ్ 15,804 మెగావాట్లుగా నమోదయింది. గతేడాది ఇదే సమయానికి 14,398 మెగావాట్లు మాత్రమే కావడం గమనార్హం. రోజురోజుకు డిమాండ్ అమాంతం పెరుగుతుండటంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. విద్యుత్ సరఫరా పరిస్థితిపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్‌ను అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

ప్రపంచ వాణిజ్యానికి చిరునామా తెలంగాణ: తుమ్మల



హైదరాబాద్/కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వాణిజ్యానికి తెలంగాణ చిరునామాగా నిలుస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని లులుమాల్‌లోని లులు హైపర్‌మార్కెట్‌ను బీసీసీ (బహ్రెయిన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) ప్రతినిధుల బృందంతో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ధాన్యాలు, మాంసం, చేపలు వంటి వాటిని ఎగుమతులు, దిగుమతుల అంశాలపై చర్చించామన్నారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో తెలంగాణను మరింత ముందుకుతీసుకెళ్లే విషయంలో లులు హైపర్‌మార్కెట్ కీలకపాత్ర పోషించేందుకు ముందుకురావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇరుదేశాల మధ్య ఉన్న సత్సంబంధాలను కొనసాగించడం, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ క్షేత్రస్థాయి సందర్శన ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బహ్రెయిన్ బృందంలోని మహ్మద్ అల్కోహేజీ, అబ్దుల్ రహ్మాన్, మహ్మద్ అల్ గౌద్.. లులుమాల్‌లో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లులు గ్రూప్ తెలంగాణ రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్, రీజనల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఇజల్ అర్షన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలు అసత్యప్రచారం మానాలి..

బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు మాట్లాడడం ఆపాలని.. లేదంటే తెలంగాణ సమాజం మరోసారి కర్రుకాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉందని తుమ్మల అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు అధికారం పోయిన తర్వాత రైతుల సమస్యలు గుర్తుకొస్తున్నాయని విమర్శించారు. ఏడాది కాలంలోనే సంక్షేమ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.55,256 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతులు పండించే ప్రతీ పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఇక కందుల కొనుగోలు కోసం 41 కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించామని, రూ.7.21 కోట్లతో 954.95 మెట్రిక్ టన్నుల కందులను మద్దతు ధరకు కొనుగోలు చేశామని వెల్లడించారు. కాగా, అంతకుముందు మిర్చి, కందుల కొనుగోళ్లపై సచివాలయంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో సమీక్షించారు. మార్కెట్ యార్డుల్లో రైతులకు ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుంభమేళాలో మంత్రి కోమటిరెడ్డి పుణ్యస్నానం



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో పాల్గొన్నారు. సోమవారం తెల్లవారుజామున 5.10 గంటలకు సంగం ఘాట్ దగ్గర పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే ఉన్న బడే హనుమాన్‌జీ దేవాలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించారు. అనంతరం పండితులు మంత్రికి వేద ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

'సీతారామ'కు సాంకేతిక అనుమతిపై నేడు భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మ బ్యారేజీ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతిపై చర్చించడానికి వీలుగా కేంద్ర జలవనరులు/నదీ అభివృద్ధి/గంగా పునరుజ్జీవన పథక విభాగానికి చెందిన సలహా మండలి 157వ సమావేశం మంగళవారం న్యూఢిల్లీలో జరుగనుంది. దేశవ్యాప్తంగా మూడు ప్రాజెక్టులు ఈ ఏజెండాలో ఉండగా... అందులో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఉంది. ఆ తర్వాత ఒడిశా, బిహార్‌లకు చెందిన ప్రాజెక్టులు చర్చించే అంశాల్లో ఉన్నాయి. అన్ని దశల్లో డీపీఆర్‌కు క్లియరెన్స్ దక్కినందున... సలహా మండలి కూడా సాంకేతిక అనుమతినిచ్చే అవకాశాలున్నాయి. టీఏసీ సమావేశం నేపథ్యంలో సోమవారం ఉదయమే నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులంతా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.


గోదావరి బోర్డు సభ్యకార్యదర్శి అజగేషన్‌పై చర్యలు తీసుకోండి

- కేంద్ర జలశక్తి శాఖను కోరిన హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం


హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గోదావరి బోర్డు సభ్య కార్యదర్శి ఆర్.అజగేషన్‌పై తగిన విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాపోలు రవీందర్, చక్రధర్, ఆర్థిక కార్యదర్శి ఎస్.అంజనేయులు ఈ మెయిల్ ద్వారా ఆమెకు ఫిర్యాదు చేశారు. మహిళా ఉద్యోగుల పట్ల అజగేషన్ వ్యవహారశైలి అనుచితంగా ఉందని, బహిరంగంగా దూషిస్తూ కించపరుస్తున్నారని ఫిర్యాదులో నివేదించారు. దీనిపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ వేయగా.. ఆ కమిటీ కూడా విచారణ చేసి, అజగేషన్‌పై ఆరోపణలను నిర్ధారించిందని గుర్తు చేశారు.

సింగరేణిలో ఇద్దరు డైరెక్టర్ల నియామకం

- డైరెక్టర్ ఆపరేషన్‌గా సూర్యనారాయణ
- ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు



కొప్పుల వెంకటేశ్వర్లు



ఎల్‌వి. సూర్యనారాయణ

రుద్రంపూర్(సింగరేణి), గోదావరిఖని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో కీలకమైన రెండు డైరెకర్ పోస్టుల నియామకం చేపట్టింది. డైరెక్టర్ ఆపరేషన్‌గా ఎల్‌వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్‌గా కొప్పుల వెంకటేశ్వర్లును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత పది రోజులుగా సింగరేణిలో డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం రెండు డైరెక్టర్ల పోస్టులకు ఐదుగురు జనరల్ మేనేజర్లను ఇంటర్వ్యూలకు పిలిచి ఇద్దరిని ఎంపిక చేసింది. డైరెక్టర్ ఆపరేషన్‌గా నియమితులైన ఎల్‌వి. సూర్యనారాయణ శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా పనిచేస్తుండగా.. డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్‌గా నియమితులైన కొప్పుల వెంకటేశ్వర్లు అడ్రియాల ప్రాజెక్టు జనరల్ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. నూతన డైరెక్టర్ల నియామకం పట్ల సింగరేణి అధికారుల సంక్షేమ సంఘం, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు షురూ



- మీసేవ కేంద్రాల వద్ద జనం బారులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/బోయినపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ షురూ అయ్యింది. పౌరసరఫరాలశాఖ సూచనల ప్రకారం సోమవారం నుంచి మీసేవ పోర్టల్‌లో కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డుల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రెండు రోజుల క్రితం రేషన్ కార్డులలో పేర్ల నమోదు, కొత్త కార్డుల దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది. అయితే శనివారం ప్రజలు మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లగా వెబ్‌సైట్ పనిచేయలేదు. ఈ సేవలకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని మీసేవ నిర్వహకులు చెప్పడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో నూతన రేషన్ కార్డులు, పేర్ల నమోదు ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటన విడుదల చేసింది. దీంతో తొలి రోజు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇప్పటికే ప్రజాపాలన, గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక కొత్త రేషన్ కార్డు కోసం మీసేవ కేంద్రాల్లో ఇచ్చే దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా పూరించి స్కాన్ చేయాల్సి ఉంటుంది. అలాగే కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులతో పాటు ప్రస్తుతం నివాసముంటున్న విద్యుత్తు బిల్లు కూడా స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే రేషన్ కార్డు ఉండి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలనుకుంటే వారి ఆధార్ కార్డులను స్కాన్ చేయిస్తే సరిపోతుందని అధికార వర్గాలు తెలిపాయి. రేషన్ కార్డు దరఖాస్తు కోసం రూ.50 మాత్రమే స్వీకరించాలని మీసేవలను పర్యవేక్షించే ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. మీసేవ కేంద్రాలు అదనంగా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరింది.

హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లోనే..

అన్ని మీసేవ కేంద్రాల్లో రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం లేదు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి, వనస్థలిపురం, హయత్‌నగర్, కూకట్‌పల్లి, సంజీవరెడ్డినగర్, అమీర్‌పేట ప్రాంతాల్లో దరఖాస్తులు తీసుకుంటుండగా.. సరూర్‌నగర్, చిక్కడపల్లి, రాంనగర్ ప్రాంతాల్లోని మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించడం లేదు. అలాగే కొన్ని మీసేవ కేంద్రాల్లో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. ఆన్‌లైన్‌లో డబ్బులు కట్ అవుతున్నాయి కానీ దరఖాస్తులు స్వీకరణ పూర్తికావడం లేదు. దీంతో ప్రజలు గంటల తరబడి మీసేవ కేంద్రాల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితులున్నాయి. మంగళవారం నుంచి మీసేవ కేంద్రాలకు దరఖాస్తుదారుల తాకిడి మరింత పెరిగే అవకాశముంది.

ఇసుకపై నిఘా హైడ్రాకు!



సీఎం రేవంత్‌ను తన నివాసంలో కలిసిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. అక్రమ రవాణాను అరికట్టి, పేదలు, సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇసుక రవాణా పర్యవేక్షణ కోసం ప్రత్యేకాధికారులను నియమించాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లాల వారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని ఖనిజాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి ఇసుక రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన కంచె వేయాలని, రాకపోకలు నిర్దిష్ట గేట్ల ద్వారా జరిగేట్లు చూడాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా చేసే లారీలన్నీ ముందే ప్రభుత్వం దగ్గర నమోదయ్యేలా చూడాలని చెప్పారు. ఇసుక రీచ్‌లను అధికారులు తనిఖీ చేయాలని, ఇసుక మాఫియా మీద ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఇసుకను బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రాంతాల వారీగా సమీప రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా ఓ వ్యవస్థ ఉండాలన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా వ్యవస్థలు సిద్ధం చేయాలని చెప్పారు. నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. ఇసుకను రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సీఎం చెప్పారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో సీఎం పలు మార్పులను సూచించారు. మధ్యాహ్నం నుంచి కాకుండా కార్యాలయ వేళల్లో మాత్రమే బుకింగ్ చేసుకునేలా వేళలను మార్చాలన్నారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని చెప్పారు. ఇసుక అమ్మకాలు పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా జరగాలని, ఇందుకోసం శాశ్వత ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇసుక రవాణాకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుకను అందజేస్తారంటూ 'ఆంధ్రజ్యోతి' డిసెంబరు 31న ఓ కథనాన్ని ప్రచురించింది.

సీఎంతో సచిన్ పైలట్ భేటీ

- దేవనారాయణ్ ఆలయ ప్రాణప్రతిష్ఠకు హాజరయ్యేందుకు వచ్చిన కాంగ్రెస్ నేత
- తెలంగాణ ఇన్‌చార్జిగా పరిశీలనలో పైలట్ పేరు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్.. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఇక్కడి అబ్దుల్లాపూర్‌మెట్‌లో భగవాన్ శ్రీ దేవనారాయణ్ ఆలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన పైలట్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. పైలట్, రేవంత్‌రెడ్డి కొద్దిసేపు ఏకాంతంగా భేటీ అయ్యారు. అనంతరం ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు పైలట్ వెళ్లారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి నియామకానికి ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్‌తోపాటు సచిన్ పైలట్ పేరునూ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీఎంతో పైలట్ భేటీ.. కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

2 ఎకరాల రైతుకు చేరిన భరోసా!

- 34.69 లక్షల మంది ఖాతాల్లో రూ.2218.49 కోట్ల జమ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 2 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధుల విడుదల పూర్తయింది. దీంతో రైతు భరోసా అమలు ప్రారంభమైనప్పటి నుంచి సోమవారం వరకు 34.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,218.49 కోట్ల మేర నిధులు జమ అయ్యాయి. రైతుబంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చిన ప్రభుత్వం.. సీజన్‌కు రూ.6 వేల చొప్పున రెండు సీజన్లు కలిపి ఎకరాకు రూ.12 వేలు రైతులకు సాయం చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు యాసంగి సీజన్‌కు సంబంధించి ఎకరాకు రూ.6 వేల చొప్పున జనవరి 27 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. ఆ రోజు ఎంపిక చేసిన 577 గ్రామాల్లోని 4.41 లక్షల మంది రైతులకు రూ.569 కోట్ల మేరకు జమ చేసింది. ఈ నెల 5 కల్లా ఎకరం వరకు భూమి ఉన్న రైతులందరి ఖాతాల్లో నిధులు జమ చేయడం పూర్తయింది. ఈ నెల 6 నుంచి 2 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల దాకా రైతు భరోసా నిధులు విడుదల చేయడం ప్రారంభించిన ప్రభుత్వం.. సోమవారం నాటికి దీనిని పూర్తి చేసింది. కాగా, ఇప్పటివరకు విడుదలైన నిధుల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాకు రూ.173.80 కోట్లు, సిద్దిపేట జిల్లాకు రూ.116.26 కోట్లు, సంగారెడ్డికి రూ.106.77 కోట్లు, సూర్యాపేటకు రూ.106.19 కోట్లు, ఖమ్మం జిల్లాకు రూ.105.28 కోట్ల చొప్పున విడుదలయ్యాయి. ఇదిలా ఉండగా.. రెండెకరాల వరకు నిధుల విడుదల పూర్తయిన రూ.2218.49 కోట్ల నిధులతోనే రాష్ట్రంలోని దాదాపు 45 శాతం మంది రైతులకు రైతు భరోసా సాయం అందించిం. రెవెన్యూ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 77 లక్షల మంది రైతులు రైతు భరోసా లబ్ధిదారులుగా ఉన్నారు.

బకాయిలు ఇవ్వకపోతే పనులు నిలిపివేస్తాం

- జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల సంఘం హెచ్చరిక
- హైదరాబాద్ జిల్లా పరిధిలోని 14 నియోజకవర్గాల్లో ఎన్నికల పనులకు సంబంధించిన బిల్లులు రూ.27.5 కోట్లు
- వెంటనే ఇవ్వాలని డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలప్పుడు హైదరాబాద్ జిల్లా పరిధిలోని 14 నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల సంఘం ఆరోపించింది. బిల్లులు ఇవ్వకపోవడంతో తాము రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు వెంటనే బకాయిలు చెల్లించాలని, లేకపోతే జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికే చేపట్టిన, త్వరలో చేపట్టనున్న అభివృద్ధి పనులను నిలిపివేస్తామని సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల పనుల కోసం టెండర్లు పిలిచారాని, హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి పనులు పూర్తయి.. ఈవీఎంలు గోడౌన్‌లో భద్రపరిచే వరకు 272 మంది కాంట్రాక్టర్లు పలు పనులు నిర్వహించారని పేర్కొన్నారు. ఒక్క మలక్‌పేట పరిధిలో బిల్లులు మాత్రమే చెల్లించారని, మిగతా 14 నియోజకవర్గాల పరిధికి సంబంధించిన సుమారు రూ. 27.50 కోట్లు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉందని చెప్పారు. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ఎన్నికల అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామని, ఫలితం లేకపోవడంతో పూర్తి వివరాలతో రాష్ట్రపతికి లేఖ రాశమని తెలిపారు. ఏడు పని దినాల్లోపు న్యాయం చేస్తామని రాష్ట్రపతి భవన్ నుంచి తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. వారి సూచనల మేరకు ఎన్నికల అధికారులను కలిశామని అయినా కూడా బిల్లు రాలేదని వివరించారు.

3000 కోట్లు రాబట్టొచ్చు

(మొదటిపేజీ తరువాయి)



తయారు చేసినట్లు, బైక్‌లను అమ్మకపోయినా అమ్మినట్లు తప్పుడు రిటర్నులు దాఖలు చేసి, ముడి సరుకుపై ఎక్కువ మొత్తంలో ఐటీసీని క్లెయిమ్ చేసి, ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడిచారు. ఇలా జీఎస్టీలో జరిగిన రకరకాల మోసాలకు సంబంధించి రూ.1,400 కోట్లకు పైగా కుంభకోణం చోటు చేసుకున్నట్లు అప్పట్లో ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పైగా, ఈ కేసుతో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌కు, మరో ఇద్దరు వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు సంబంధం ఉన్నట్లు గుర్తించారు. కేసు గాఢతను పరిశీలించిన ప్రభుత్వం... దీనిని మొదట సిటీ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)కు అప్పగించింది. అనంతర కాలంలో సీఐడీకి బదిలీ చేసింది. పన్నుల ఎగవేత, తక్కువ పన్ను చెల్లింపు, దొంగ ఇన్వాయిస్‌లతో ఐటీసీని కొల్లగొట్టడం వంటి అక్రమాలను తేల్చడానికి అప్పటి వాణిజ్య పన్నుల రాష్ట్ర కమిషనర్, ప్రస్తుత పురపాలక శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం వేసింది. కమిటీలో వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్లు దీపారెడ్డి, ఏడుకొండలు, తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తిలను సభ్యులుగా నియమించింది.

ఇలా అక్రమాలు

సాధారణంగా ఒక రాష్ట్రంలోని డీలర్లు, మరో రాష్ట్రంలోని డీలర్లకు విక్రయించే వస్తువులపై 'ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(ఐజీఎస్టీ)'ను కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి, వస్తువులను కొనుగోలు చేసిన రాష్ట్రానికి చెరో 50 శాతం మేర సొమ్ము వెళుతుంది. తెలంగాణలో కొంత మంది డీలర్లు... ఇతర రాష్ట్రాల వారికి వస్తువులను విక్రయించినట్లు దొంగ ట్యాక్స్ ఇన్వాయిస్‌లను సృష్టించారు. ప్రధానంగా 18 శాతం ట్యాక్స్ ఉన్న ఇనుము, ఇత్తడి, రాగి స్క్రాప్ వంటి వాటిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు లెక్కలు సమర్పించారు. భౌతికంగా ఈ వస్తు రవాణా జరగకపోయినా జరిగినట్లు చూపి, ఇన్వాయిస్‌లను ఇతర రాష్ట్రాల డీలర్లకు పంపించారు. ఈ ఇన్వాయిస్‌లను ఆధారంగా చేసుకుని ఇతర రాష్ట్రాల డీలర్లు 18 శాతం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ కౌన్సిల్ నుంచి క్లెయిమ్ చేశారు. ఈ సొమ్మును ఇతర రాష్ట్రాల డీలర్లతో పాటు వస్తువులను సరఫరా చేసిన తెలంగాణ డీలర్లు పంచుకున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు అప్పట్లో గుర్తించారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి, బైక్‌లను తయారు చేసినట్లు ముడిపదార్థాలపై కొంత మంది ఆటోమొబైల్ డీలర్లు ఎక్కువ మొత్తంలో ఐటీసీని క్లెయిమ్ చేసుకున్నారని తేలింది. బైక్‌ల అమ్మకాలపై ఉన్న 5 శాతం జీఎస్టీని ప్రభుత్వానికి జమ చేస్తూ... ముడి పదార్థాలపై ఉన్న 12, 18 శాతాల జీఎస్టీని ఐటీసీ రూపంలో క్లెయిమ్ చేసుకున్నారని గుర్తించారు. ఇలా పన్ను వ్యత్యాసాలను ఆధారంగా చేసుకుని, ఐటీసీ మోసాలకు పాల్పడ్డారు. ఇలాంటి రకరకాల పన్ను మోసాలకు సంబంధించి దాదాపు రూ.1,400 కోట్లకు పైగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు అప్పట్లో అంచనా వేశారు. అయితే సోమేశ్ కుమార్ హయాంలోనే ఐజీఎస్టీ, స్టేట్ జీఎస్టీ(ఎస్‌జీఎస్టీ), సెంట్రల్ జీఎస్టీ(సీజీఎస్టీ)లకు సంబంధించి పన్ను ఎగవేతలు, బకాయిలు వంటి వాటిని గుర్తించడానికి వాణిజ్య పన్నుల శాఖ ఐఐటీ-హైదరాబాద్‌తో ఒక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయించింది. అయినప్పటికీ రూ.1,400 కోట్ల కుంభకోణం జరిగింది. ఎందుకు కనిపెట్టలేక పోయారని అంతర్గత ఆడిటింగ్ బృందం తవ్వగా ఐజీఎస్టీ ఎగవేతలు, ఐటీసీ క్లెయిమ్‌లను గుర్తించే స్క్రూటినీ మాడ్యూల్‌ను సాఫ్ట్‌వేర్ డేటాబేస్‌లో కనిపించకుండా మాస్క్ చేసి పెట్టినట్లుగా తేలింది. సోమేశ్ కుమార్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న 'స్పెషల్ ఇనీషియేటివ్స్' వాట్సాప్ గ్రూపు ద్వారా ఇచ్చిన సందేశాలను అప్పటి వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరాంప్రసాద్, ఐఐటీ-హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు అనుసరించి, ఐజీఎస్టీ మాడ్యూల్ పని చేయకుండా చేశారన్న ఆరోపణలు వెలువడ్డాయి. దాంతో ఈ నలుగురితో పాటు సాఫ్ట్‌వేర్‌కు సాంకేతిక సహకారం అందించిన ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కాశీ విశ్వేశ్వరరావు, శివరాంప్రసాద్‌లను ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు పంపించింది.

రూ.3000 కోట్ల వరకు అంచనా

సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేయడం, తర్వాత సీఐడీకి బదిలీ కావడం వంటి సంఘటనల నేపథ్యంలో టీకే శ్రీదేవి చైర్‌పర్సన్‌గా ఉన్న ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీ పన్ను ఎగవేతలు, ఐటీసీ క్లెయిమ్‌లకు సంబంధించి విచారణ చేపట్టింది. ఎవరెవరు ఎంత మొత్తంలో పన్నును ఎగవేశారు, దానికి పెనాల్టీతో కలిపి ఎంత మొత్తమవుతుందన్న వివరాలు సేకరించింది. దొంగ ఇన్వాయిస్‌లతో ఐటీసీని క్లెయిమ్ చేసిన కంపెనీలు, డీలర్లను కూడా గుర్తించింది. వీరందరి నుంచి ఐటీసీ, ఎగవేసిన పన్ను, పెనాల్టీలన్నింటినీ వసూలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3000 కోట్లు సమకూరుతాయని అంచనా వేసింది. ఇప్పటికే ఈ అక్రమాలకు సంబంధించిన 76 కంపెనీలు, డీలర్లకు కమిటీ నోటీసులు పంపించిందని సమాచారం. వెంటనే సొమ్మును చెల్లించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సమాచారాన్ని సీఐడీకి కూడా అందించినట్లు సమాచారం.

నిమ్స్‌లో ఓపీ స్లిప్‌లకు చెల్లు చీటీ!



నిమ్స్ మిలీనియం బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రం

- కొత్తగా కియోస్క్ యంత్రాల ఏర్పాటు
- ప్రయోగాత్మకంగా మిలీనియం బ్లాక్ వద్ద 4 విభాగాల రోగులకు అందుబాటులోకి..
- తొలి దఫాలో ఫాలో అప్ కేసులకే
- దశల వారీగా అన్ని విభాగాల్లో ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో ఓపీ స్లిప్‌ల కోసం గంటల తరబడి నిరీక్షించే పరిస్థితికి త్వరలోనే చెక్ పడనుంది. ఇందుకోసం నిమ్స్ మిలీనియం బ్లాక్ వద్ద ప్రయోగాత్మకంగా ఒక కియోస్క్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. తొలుత రెండో సారి వైద్యుల వద్దకు రివ్యూ, ఫాలో అప్ కోసం వచ్చే రోగులకు దీన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఒక యంత్రాన్ని ఏర్పాటు చేసిన అధికారులు.. త్వరలోనే రెండో యంత్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. ఈ రెండు యంత్రాల పని తీరు, ఫలితాలను బట్టి మిగతా విభాగాలకు వీటిని విస్తరించనున్నారు. రెండో సారి వైద్యుల వద్దకు వచ్చే రోగులు.. నేరుగా ఈ యంత్రం వద్దకు వెళ్లి రోగి పేరు, వైద్యుడి పేరు, వివరాలు పొందుపరిస్తే స్లిప్ వస్తుందని, ఇదంతా పూర్తి కావడానికి 30 సెకన్లు మాత్రమే పడుతుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి తెలిపారు. తొలుత న్యూరాలజీ, న్యూరో సర్జరీ, రుమటాలజీ, సైకియాట్రిక్ విభాగాల రోగులు దీనిని వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మొదటి సారి నిమ్స్‌కు వచ్చే రోగులు మాత్రం యథావిధిగా ఓపీ కౌంటర్ వద్ద స్లిప్‌లు పొందాల్సి ఉంటుందని, రెండో సారి ఫాలో అప్, రివ్యూ కోసం లేదా వ్యాధి నిర్ధారణ నివేదికలను వైద్యులకు చూపించడానికి వచ్చే వారు మాత్రం కియోస్క్ యంత్రాల ద్వారా సేవలు పొందవచ్చుని అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్ రాజ్ వివరించారు. రెండో సారి కూడా ఓపీ కౌంటర్ వద్ద రోగులు పడిగాపులు పడకుండా ఉండడానికి ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. "రెండో సారి ఆస్పత్రికి వచ్చే ఓపీ రోగులు తిరిగి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సాధారణ రోగులకు 14 రోజులు, ఆరోగ్య శ్రీ, ఈహెచ్‌ఎస్, జీహెచ్‌ఎస్ కేటగిరీ రోగులకు 28 రోజుల వరకు ఈ అవకాశం ఉంటుంది. ఫాలోఅప్ కోసం దాదాపు 65 శాతం మంది రోగులు వస్తుంటారు. ఈ యంత్రాలు అందుబాటులోకి వచ్చాక వారు మళ్లీ ఓపీ కౌంటర్ల వద్ద క్యూలో నిల్చోవాల్సిన అవసరం ఉండదు" అని వివరించారు.

విద్యతోనే యువత శక్తిమంతం

» టెక్నాలజీని బాధ్యతాయుతంగా వినియోగించాలి

» విద్యార్థులకు, పరిశోధకులకు గవర్నర్ జిష్ణుదేవ్ పిలుపు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): యువతను శక్తిమంతం చేయడం విద్యతోనే సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. నూతన విద్యావిధానం-2020, విద్యా సాంకేతికతలో ట్రెండ్స్ అండ్ ఇన్‌సైట్స్ అంశంపై హెచ్‌సీయూలోని విద్యా విభాగం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ భవిష్యత్తుకు ఎన్‌ఈపీ-2020 కీలకమైన అడుగన్నారు. టెక్నాలజీని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, మానవాళి ప్రయోజనం కోసం టెక్నాలజీని వాడాలన్నారు. హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, స్వీయ అవగాహనను పెంపొందించడంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. బెంగళూరు చాణక్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉషా సుబ్రమణియన్ మాట్లాడుతూ మానవ మేధస్సును సాంకేతికత భర్తీ చేయలేదన్నారు. సాంకేతికత-మానవ విలువల మధ్య సమతుల్యతను సాధించడంపైనే విద్య భవిష్యత్తు ఆధారపడి ఉందని సదస్సు సమన్వయకర్త డాక్టర్ రావుల కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్, మదన్ మోహన్ మాలవ్య శిక్షణా కేంద్రం డైరెక్టర్ ప్రకాశ్‌బాబు, లెర్న్ టు లీడ్ సంస్థ డైరెక్టర్ కౌసర్ సయ్యద్, బెనారస్ హిందూ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రేమ్ నారాయణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి పదవికి వేలం పాటపై ఎంపీడీవో విచారణ

మానవపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం గోకులపాడు గ్రామంలో సర్పంచి పదవికి వేలంపాట జరిగిందన్న వార్తలపై ఎంపీడీవో భాస్కర్ స్పందించారు. సోమవారం గ్రామానికి వెళ్లి పలువురు గ్రామస్థులను విచారించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. వేలం పాటల ద్వారా పదవులను కొనుగోలు చేయటం చట్టరీత్యా నేరమని వివరించారు. ఇటువంటి వ్యవహారాల వెనుక ఎవరు ఉన్నా తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. వాస్తవంగా ఆదివారం గ్రామంలో గొర్రెల ఎరువుకు సంబంధించి, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ విషయాలపై చర్చ జరిగిందని చెప్పారు. కొంతమంది గిట్టనివారు ఈ విషయాలను సామాజిక మాధ్యమాల్లో తప్పుగా ప్రచారం చేశారని అన్నారు.

వైద్యుడి సమయస్ఫూర్తితో 'క్యాట్ వాక్'

» కోదాడలో నడుము విరిగిన పిల్లి కూనకు కృత్రిమ నడక



చక్రాల బొమ్మ అమర్చాక ముందు కాళ్లతో నడుస్తున్న పిల్లి కూన

కోదాడ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఓ వైద్యుడి ఉపాయంతో పిల్లి కూన దీనావస్థ నుంచి బయటపడింది. సూర్యాపేట జిల్లా కోదాడలో మెస్ నిర్వహించే రాజు కొన్ని రోజులుగా ఓ పిల్లి కూనను పెంచుకుంటున్నారు. ఇటీవల ఆ పిల్లి కూన వీపుపై ఏదో వస్తువు పడటంతో నడుము విరిగి వెనుక కాళ్లు చచ్చుబడిపోయాయి. దాని దీనావస్థను చూసి చలించిన రాజు వైద్యం కోసం కోదాడ పశువైద్యశాలకు తీసుకెళ్లారు. పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య ఆ పిల్లి పిల్లను పరీక్షించి.. చిన్న వయసే అయినందున వైద్యం చేస్తే భవిష్యత్తులో కాళ్లకు పటుత్వం వచ్చి నడిచే అవకాశం ఉందని చెప్పారు. బొమ్మల దుకాణం నుంచి రెండు చక్రాల ట్రాలీ బొమ్మను తెప్పించి, పిల్లి కూనకు ఒరుసుకోకుండా స్పాంజ్ బెడ్ ఏర్పాటు చేసి వెనుక కాళ్లకు సరిపోయే ఎత్తులో దాన్ని అమర్చారు. చక్రాల బొమ్మ అమర్చాక ముందు కాళ్లతో పిల్లి కూన అలవోకగా నడవడం చూసి అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. రెండు రోజులు పరీక్షించి ప్లాస్టిక్ పైపులతో చక్రాల బండిని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తానని అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు.



అంజన్న ఆలయంలో ఆభరణాలను అప్పగిస్తున్న మహేశ్‌రెడ్డి-రాధికరెడ్డి దంపతులు

అంజన్నకు 85 లక్షల విలువైన ఆభరణాలు

మల్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఏఎంఆర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ యజమాని, కొండగట్టు ఆంజనేయస్వామి భక్తుడు ఏ.మహేశ్‌రెడ్డి-రాధికరెడ్డి దంపతులు రూ.85లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను అందజేశారు. రెండేళ్ల క్రితం ఆలయంలో చోరీ జరిగిన సందర్భంలో స్వామి వారి మకరతోరణం, శఠగోపం, గర్భాలయ వెండి తొడుగులు అపహరణకు గురి అయ్యాయి. మహేశ్‌రెడ్డి వాటి ఏర్పాటుకు ముందుకు వచ్చారు. స్వామి వారికి 325గ్రాముల బంగారం తాపడంతో రాగి రేకుపై కిరీటం, రామరక్షతో పాటు 48.5కిలోల వెండితో గర్భాలయ ద్వారానికి కుడి, ఎడమ వైపు ద్వార బంధనం, తొడుగులు తయారు చేయించి ఆలయ అధికారులు, అర్చకులకు అప్పగించారు.

విక్రాంత్‌రెడ్డిదే కీలక పాత్ర!

» కాకినాడ పోర్ట్, సెజ్‌లలో కేవీరావు వాటాలు అరబిందోకు బదలాయింపులో ప్రణాళిక ఆయనదే

» విక్రాంత్‌రెడ్డిని కస్టడీలో విచారించాలి

» హైకోర్టులో సీఐడీ కౌంటర్ దాఖలు

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్ లోని వాటాలను.. కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేవీఆర్ గ్రూపునకు చెందిన కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీరావు)ను బెదిరించి, భయపెట్టి బలవంతంగా అరబిందోకు బదలాయించడంలో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని సీఐడీ హైకోర్టుకు నివేదించింది. కేవీరావు ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విక్రాంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో ఈ మేరకు తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. 'ఫిర్యాదుదారు కేవీరావు ఆరోపించినట్లు అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రోద్బలంతోనే విక్రాంత్‌రెడ్డి జోక్యం చేసుకుని వాటాల బదిలీకి ప్రణాళిక రచించినట్లు కనపడుతోంది. షేర్ల బదిలీ విషయంలో తాను చెప్పినట్లు నడుచుకోకుంటే క్రిమినల్ కేసులు పెట్టి, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తామని, హానితలపెడతామని కేవీరావును ఆయన బెదిరించారు. అప్పటి ముఖ్యమంత్రి తరఫున షేర్లను సేకరిస్తున్నట్లు పిటిషనర్ చెప్పారు. వాటాలను అరబిందోకు బదలాయించడం ద్వారా కేవీరావుకు చెందిన కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌కు రూ.3,666 కోట్లు, కాకినాడ సెజ్‌కు రూ.1109 కోట్లు మొత్తం రూ.4,775 కోట్ల నష్టం జరిగింది. కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.965.65 కోట్ల నష్టం వాటిల్లిందని పీకేఎఫ్ శ్రీధర్ ఆడిట్ సంస్థ తప్పుడు నివేదిక ఇచ్చింది. ఎవరు చెప్పడం వల్ల ఆడిట్ సంస్థ తప్పుడు నివేదిక ఇచ్చింది.. ఈ మొత్తం వ్యవహారంలో అంతిమంగా ఎవరు లబ్ధి పొందారో తేల్చేందుకు విక్రాంత్‌రెడ్డిని కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉంది. పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. ఈ దశలో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుంది. ఆయన వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు. సాక్షులను బెదిరించి సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి' అని సీఐడీ అభ్యర్థించింది.

బీర్ల ధరలు 15 శాతం పెంపు

(మొదటి పేజీ తరువాయి)



కాలంగా పెంచకపోవడంతో బీర్ల సరఫరాదారులు ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం ధరల నిర్ణయ కమిటీ వేసింది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జైస్వాల్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ దీనిపై అధ్యయనం చేసింది. గతంతో పోలిస్తే పెరిగిన ముడి సరుకుల ధరలు, ఉత్పత్తిదారుల విజ్ఞప్తులు, పక్క రాష్ట్రాల్లో ధరలను అధ్యయనం చేసిన కమిటీ.. ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందించింది. ప్రస్తుత ధరలపై 15 శాతం పెంచవచ్చని కమిటీ చేసిన సిఫారసులను ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. కొత్త ధరలు మంగళవారం నుంచే అమల్లోకి వస్తాయని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే బీర్ల ధరలను సాధారణంగా 15 శాతం పెంచాక దగ్గరి రూపాయికి సవరిస్తారు. ఉదాహరణకు.. రూ.172.5 ఉన్న బీరు ధరను రూ.173 చేయవచ్చు. లేదా రూ.175గా ఖరారు చేయవచ్చు. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీలో మద్యం ధరల పెంపు

» లైసెన్సీలకు 14 శాతం మార్జిన్ కోసమే వినియోగదారులపై భారం

» ఒక్కో బాటిల్‌పై రూ.10.. ఏఆర్‌ఈటీని సవరిస్తూ ఉత్తర్వులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీలో మద్యం ధరలు పెరిగాయి. క్వార్టర్ రూ.99 బ్రాండ్లు మినహా అన్ని రకాల లిక్కర్ బ్రాండ్లకు సీసాపై రూ.10 పెరిగింది. ఈమేరకు అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్‌ఈటీ)ను సవరిస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బీరు ధరల్లో ఎలాంటి మార్పు లేదు. మార్జిన్ తక్కువ వస్తోందని లైసెన్సీలు గగ్గోలు పెట్టడంతో వారికిచ్చే మార్జిన్ పెంపునకు ఇటీవల కేబినెట్‌లో ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ పన్నుల్లో మార్పులు తీసుకొచ్చింది. లైసెన్సీలకు ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇస్తారు. కానీ ఇప్పటివరకూ ఏఆర్‌ఈటీ ఇష్యూ ప్రైస్‌లో లేదు. దీంతో లైసెన్సీలకు అనుకున్నంత మార్జిన్ రావట్లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ఏఆర్‌ఈటీని రెండు రకాలుగా వర్గీకరిస్తూ తాజా సవరణలు చేశారు. ఏఆర్‌ఈటీ1, ఏఆర్‌ఈటీ2 అని రెండు కాంపోనెంట్‌లు సృష్టించి, ఏఆర్‌ఈటీ1ను ఇష్యూప్రైస్ కిందకు తీసుకొచ్చారు. దీంతో ఏఆర్‌ఈటీ1 పన్నులోనూ లైసెన్సీలకు మార్జిన్ లభిస్తుంది. దీని ఫలితంగా ఆ బ్రాండ్ల బాటిళ్లపై రూ.10 పెరిగింది. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వచ్చింది.

15 రంగాలు.. ఏటా 30 వేల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

కోర్సులు అమలు చేసేందుకు సమాయత్తమవుతోంది. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో నాలుగు కోర్సుల్లో తరగతులు జరుగుతున్నాయి. విద్యార్థుల నుంచి పెద్దఎత్తున డిమాండ్ రావడంతోపాటు విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం అయ్యేందుకు అనేక పారిశ్రామిక దిగ్గజ కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీంతో త్వరలో హెచ్‌ఐసీసీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లోని తాత్కాలిక క్యాంపస్‌లోనూ తరగతులు ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది 10వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని, వర్సిటీకి ముచ్చర్లలో 150ఎకరాల్లో పూర్తిస్థాయి క్యాంపస్ అందుబాటులోకొస్తే ఏడాదికి 30వేల ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

సింగపూర్ ఐటీఈ సహకారం

స్కిల్స్ యూనివర్సిటీతో పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు దేశాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసింది. గత నెలలో సీఎం, రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కూడిన బృందం సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)ను సందర్శించిన విషయం తెలిసిందే. స్కిల్స్ యూనివర్సిటీలో భాగస్వామ్యం కావాలన్న సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిపై అక్కడి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సింగపూర్‌లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఈ పాఠ్యాంశాలు రూపొందించి నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా అక్కడ కోర్సు పూర్తవగానే అభ్యర్థులకు ఉద్యోగాలు వస్తున్నాయి. ఇదే తరహా ప్రణాళికను స్కిల్స్ యూనివర్సిటీలో అమలు చేయనున్నారు. త్వరలో సింగపూర్ ఐటీఈ ప్రతినిధులు ఇక్కడికి వచ్చి విశ్వవిద్యాలయంలో బోధన చేసేవారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం 3 నెలల సర్టిఫికేట్ కోర్సులతోపాటు రెండేళ్ల డిప్లొమా/డిగ్రీ కోర్సుల సిలబస్ రూపకల్పన జరుగుతోంది.

ప్రస్తుతం స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్, స్కూల్ ఆఫ్ ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్, ఈ-కామర్స్ విభాగాల్లో స్వల్పకాలిక కోర్సులు అందిస్తున్నారు. ఆస్పత్రుల రంగంలో అపోలో హాస్పిటల్స్, ఏఐజీ హాస్పిటల్స్, లైఫ్ సైన్సెస్‌లో డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, ఈ-కామర్స్‌లో నవత ట్రాన్స్‌పోర్ట్ లాంటి దిగ్గజ పారిశ్రామిక సంస్థలు ఇప్పటికే వర్సిటీతో భాగస్వామ్యమయ్యాయి. ఇదే తరహాలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న 15 రంగాలను ప్రభుత్వం గుర్తించింది. వీటికి సంబంధించిన పాఠ్యాంశాల రూపకల్పన జరుగుతోంది. ప్రతి విభాగానికి డీన్‌తోపాటు భాగస్వామ్యానికి ఆసక్తిగా ఉన్న పారిశ్రామికసంస్థల ప్రతినిధులు, ఆర్థిక సహకారం అందించే దాతలతో స్కూల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

ప్రతిపాదనలేమీ లేవు

తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీకి నిధులివ్వాలనే ప్రతిపాదనేమీ కేంద్రం వద్ద లేదని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించి, ఉపాధి అవకాశాల కల్పించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వర్సిటీకి కేంద్రం నిధులు సమకూరుస్తుందా? దీనికి సంబంధించి కేంద్రం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉందా? అని చామల ప్రశ్నించగా.. తమ వద్ద ఎలాంటి ప్రతిపాదనలు లేవని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ప్రారంభమయ్యే విభాగాలు

- యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ)
- అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్
- టూరిజం, హాస్పిటాలిటీ
- డిజిటల్ డిజైన్ ● రినివెబుల్ ఎనర్జీ
- బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)
- బ్యూటీ, వెల్‌నెస్
- ఆటోమోటివ్,ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)
- అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్
- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్
- కన్‌స్ట్రక్షన్ ● రిటైల్
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)
- మీడియా, ఫిల్మ్
- షిప్, ఏయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్



ఉద్యోగం వెతుక్కునే అవసరం లేకుండా..

సాంకేతిక, వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసినవారికి ఎన్నోకొన్ని ఉద్యోగ అవకాశాలున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ లాంటి సాధారణ డిగ్రీ కోర్సులు చేసిన విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎంతో శ్రమిస్తున్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంగా స్కిల్స్ యునివర్సిటీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. డిగ్రీ విద్యార్థులే కాదు పదోతరగతి, ఇంటర్ విద్యార్హతతో చదువు మానేసిన వారికీ నైపుణ్య శిక్షణ అందించి వారికి కూడా ఉద్యోగాలు కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలోనే మొట్టమొదటిసారి ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యునివర్సిటీ దేశ విద్యా రంగంలోనే ఓ చరిత్రాత్మక నిర్ణయం. త్వరలో ఇతర రాష్ట్రాలూ తెలంగాణ బాటను అనుసరిస్తాయి. - మంత్రి శ్రీధర్ బాబు

రిజర్వేషన్లపై నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే

» ఏపీ కుల ధ్రువీకరణ పత్రాలు తెలంగాణలో చెల్లవు

» పీజీ మెడికల్ ప్రవేశాలకు తాజా ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిందే: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య పీజీ సీట్లలో రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అని హైకోర్టు స్పష్టం చేసింది. ఒక రాష్ట్రానికి చెందిన వారు మరో రాష్ట్రానికి వెళ్తే అక్కడ ఉన్న నిబంధనలే పాటించాలని గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. ఏపీ ప్రభుత్వం జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా తెలంగాణలో రిజర్వేషన్ పొందడం సాధ్యంకాదని స్పష్టం చేసింది. పీజీ మెడికల్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా తెలంగాణ ప్రభుత్వంలోని కాంపిటెంట్ అథారిటీ జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తేనే తెలంగాణలో రిజర్వేషన్లకు అర్హులని పేర్కొంది. పీజీ మెడికల్ సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కోరేవారు తెలంగాణ అధికారులు జారీచేసిన కుల లేదా సామాజిక ధ్రువీకరణ తాజా సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలంటూ ప్రభుత్వం విధించిన నిబంధనను సమర్థించింది. పీజీ మెడికల్ కోర్సుల కన్వీనర్ కోటాలో సామాజిక రిజర్వేషన్ కోరే వారు తాజా సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలన్న నిబంధనను సవాల్ చేస్తూ ఏపీలోని కావలికి చెందిన నీహారిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజా సర్టిఫికెట్లు కోరడం తగదని, ఏపీ ప్రభుత్వం జారీచేసిన సర్టిఫికెట్‌ను గుర్తించాలని కోరారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. ఏపీకి చెందిన వారికి కూడా ఇక్కడ రిజర్వేషన్ ఇస్తే రాష్ట్ర ఏర్పాటుకు అర్థం లేకుండా పోతుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం ఏజీ వాదనలతో ఏకీభవిస్తూ పిటిషన్‌లను కొట్టేసింది. ఏపీ ధ్రువపత్రాలు ఉన్న వారిని కౌన్సెలింగ్‌కు అనుమతించాలని, ఫలితాలు వెల్లడించరాదంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసింది.

కొడంగల్‌లో మీరొక్క జెడ్పీటీసీ సీటు గెలిచినా రాజీనామా చేస్తా..

» కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సవాల్

» అప్పుల్లో ఉన్నా.. హామీలన్నీ నెరవేరస్తున్నాం: యశస్విని రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'దమ్ముంటే.. కొడంగల్ నియోజకవర్గంలో ఒక జెడ్పీటీసీ లేదా ఒక ఎంపీపీ సీటు గెలువు.. రాజీనామా చేసేందుకు నేను సిద్ధం!' అంటూ కేటీఆర్‌కు పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి కొడంగల్‌లో మళ్లీ గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు. రాజీనామాకు తమ నాయకుడు రేవంత్ అవసరం లేదని, తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, కేకే మహేందర్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి ఉన్నా.. ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం నెరవేరుస్తూ వస్తోందని పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు.. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, యశస్వినీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రేపు ఇంటర్‌సిటీ రైళ్లు రద్దు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12705/12706) రైళ్లను బుధవారం రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. మరోవైపు సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య ఇటీవల రద్దయిన భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్(17233/17234) రైళ్లను మంగళవారం నుంచి(11వ తేదీ) పునరుద్ధరిస్తున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు.


కొడంగల్‌లో రాజీనామా చేసి గెలిస్తే రాజకీయ సన్యాసం చేస్తా

» సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

» స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

» రైతు దీక్షలో మాజీమంత్రి కేటీఆర్

మహబూబ్‌నగర్/కోస్గి/కొడంగల్/దుద్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి) : "మీ ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయిన రేవంత్‌రెడ్డి మీకు మంచి చేయాల్సింది పోయి 70 మందిపై కేసులు పెట్టి 40 మందిని నలభై రోజులు జైల్లో పెట్టి ఆడబిడ్డల గోసపుచ్చుకున్నాడు. ఈ వేదికపై నుంచి రేవంత్‌రెడ్డికి బంపర్ ఆఫర్ ఇస్తున్నా కొడంగల్‌లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో నిలబడితే మా పార్టీ నుంచి పట్నం నరేందర్‌రెడ్డి పోటీ చేస్తారు. మేమెవరమూ ప్రచారం చేయం. నరేందర్‌రెడ్డి నామినేషన్ వేసి ఇంట్లో కూర్చుంటారు. జిల్లా నాయకులు కొందరు మాత్రమే తిరుగుతారని మాటిస్తున్నా. మీరు గెలిస్తే, గెలవడం కాదు పట్నం నరేందర్‌రెడ్డికి 50 వేల మెజారిటీలో ఒక్క ఓటు తగ్గినా నేను రాజకీయ సన్యాసం చేస్తా" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో సోమవారం నిర్వహించిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌లో ఉండే గిరిజన, బంజార బిడ్డలు తలుచుకుంటే రేవంత్‌ను చిత్తుగా ఓడించి మళ్లీ అచ్చంపేటకు పంపిస్తారని అన్నారు. "వాట్సా్‌ప్‌లో వీడియోలు చూస్తే ఏమన్న తిట్లా అవి, తెలుగుభాషలో ఉన్న తిట్లన్నీ తిడుతున్నారు. రేవంత్‌రెడ్డి కాబట్టి, రోషం లేని బతుకు కాబట్టి నడుస్తోంది. మనిషన్నోడు ఇంకోడింకోడు అయితే బకెట్‌లో రెండు మగ్గుల నీళ్లు పోసుకొని దుంకి సచ్చిపోతుండే. మీరు కూడా కొంచెం తిట్టకండి.. కనీసం ఆయన పదవికైనా గౌరవం ఇవ్వండి. ఎన్నికల్లో మాత్రం ఈ మోసగాడికి గట్టిగా బుద్ధి చెప్పండి" అని వ్యాఖ్యానించారు. రుణమాఫీ చారానా వంతు కూడా పూర్తి కాలేదని, రైతుబంధు డబ్బులు టకీటకీమని పడతాయని చెప్పినా ఇప్పటికీ పడలేదని ధ్వజమెత్తారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు 12 సార్లు రైతుబంధు ఇచ్చారని, ఎన్నికల ముందు రైతుబంధు కోసం రూ.7600 కోట్లు జమ చేస్తే ఇదే రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిషన్ దగ్గరికి వెళ్లి పంపిణీని ఆపేయించారని గుర్తు చేశారు. రేవంత్ సీఎం అయ్యాక నాలుగు నెలలు ఆపి ఎంపీ ఎన్నికల ముందు అవే డబ్బులను వేశాడని మండిపడ్డారు. రైతు బంధు కింద ఒక్కో ఎకరాకు రూ.17,500 దాకా ప్రభుత్వం బాకీ పడిందని, ఆ డబ్బులు ఇచ్చే వరకూ రైతులు నిలదీయాలని సూచించారు. ఎన్నికల వేళ ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్.. ఇప్పుడు రూ.12 వేలు ఇస్తాననడం మోసం కాదా, ఆయనపై చీటింగ్ కేసు పెట్టొద్దా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల గండం దాటితే అది కూడా ఇవ్వరని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలంటే స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



కోస్గిలో జరిగిన రైతు దీక్షలో మాట్లాడుతున్న కేటీఆర్

భూమిగా నామకరణం

లగచర్ల భూముల విషయంలో ఉద్యమించిన పులిచర్లకుంట తండాకు చెందిన పాత్లావత్ ప్రవీణ్, జ్యోతి దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించింది. దుద్యాల మండలంలోని హకీంపేట్ గేట్ వద్దకు చేరుకున్న కేటీఆర్‌ను వారు కలిసి.. పాపకు పేరు పెట్టాలని కోరారు. భూమి కోసం పోరాడుతున్న సమయంలో పుట్టిన ఆడ బిడ్డ కావడంతో భూమి, ధాత్రి, అవని అనే పేర్లలో ఒకటి పెట్టుకోవాలని కేటీఆర్ సూచించగా.. భూమి అని పెట్టుకుంటామని వారు బదులిచ్చారు. ఇక నుంచి పాపను పాత్లావత్ భూమి నాయక్‌గా పిలుచుకుంటామని తల్లిదండ్రులు చెప్పినట్లు రైతు దీక్ష సభలో కేటీఆర్ వివరించారు. కాగా, రైతు దీక్షకు ముందు కోస్గిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలతో కేటీఆర్ కరచాలనం చేసే సమయంలో చిన్న పాటి గాయమైంది. దీక్షకు వస్తుంటే దారిపొడవునా పెద్దసంఖ్యలో వచ్చిన జనం కదలనివ్వలేదని, చివరకు తన వేలికి గాయమై రక్తం వచ్చిందని.. కేటీఆర్ నవ్వుతూ చెప్పారు.

జగన్, భారతి ఆరోపణలను ఖండిస్తున్నా

» రాజకీయ ఉద్దేశాలతోనే జగన్ కేసు

» ఎన్‌సీఎల్‌టీలో విజయలక్ష్మి కౌంటర్

» చెల్లెలు షర్మిలారెడ్డి కూడా..

» పిల్లల మధ్య వివాదంతో కోర్టు గదిలో నిలబడాల్సి రావడం కలచివేస్తోంది

» బాధాతప్త హృదయంతో కౌంటర్ వేస్తున్నా: విజయలక్ష్మి

అమరావతి/హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'నా కుమారుడు జగన్, కోడలు భారతి చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నాను. నా పిల్లల మధ్య వివాదం కారణంగా నేను కోర్టు గదిలో నిలబడాల్సి రావడం తీవ్రంగా కలచివేస్తోంది. బాధాతప్త హృదయంతో కౌంటర్ దాఖలు చేస్తున్నాను. జగన్, భారతి పేర్కొంటున్న విషయాలు నిరాధారం, సదరు ఆరోపణలు న్యాయసమీక్షకు నిలువవు' అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కంపెనీ వాటాలను చట్టబద్ధంగా బహుమతిగా ఇస్తూ చేసుకున్న కుటుంబ ఒప్పందంలో.. జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) జోక్యం చేసుకోజాలదని ఆమె, జగన్ చెల్లెలు షర్మిలారెడ్డి తెలిపారు. ఫ్యామిలీ సెటిల్‌మెంట్‌లో జోక్యం చేసుకునే అధికారం దానికి లేదన్నారు. కుటుంబ వివాద పరిష్కారాలు ట్రిబ్యునల్ పరిధిలోకి రావని పేర్కొన్నారు. తనకు తెలియకుండా సరస్వతి పవర్ షేర్లను తన తల్లి, చెల్లి బదిలీ చేసుకున్నారని.. సదరు బదిలీని రద్దు చేసి తాను, తన భార్య భారతి, తమ కంపెనీ క్లాసిక్ రియాల్టీ పేరిట 51.01 శాతం వాటాలు యథావిధిగా కొనసాగేలా ఆదేశాలివ్వాలని పేర్కొంటూ జగన్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేసిన విషయం విదితమే. ఆ షేర్లను తన తల్లికి గిఫ్టుగా ఇచ్చానని.. వాటిని తాను ఎప్పుడైనా వెనక్కి తీసుకోవచ్చని అందులో పేర్కొన్నారు. సరస్వతి పవర్ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో తాను గిఫ్ట్‌గా ఇచ్చిన షేర్లను షర్మిలకు బదలాయించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ షేర్ల బదలాయింపును అడ్డుకోవాలని కోరారు. అయితే రాజకీయ ఉద్దేశాలు, కారణాలతోనే జగన్ ఎన్‌సీఎల్‌టీలో తప్పుడు కేసు వేశారని విజయలక్ష్మి, షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు ట్రిబ్యునల్‌లో వేర్వేరుగా కౌంటర్లు దాఖలు చేశారు. జగన్ పిటిషన్‌కు ఇద్దరూ 38 పాయింట్లతో ఘాటుగా సమాధానాలిచ్చారు. కుటుంబ వివాదాన్ని కంపెనీ వివాదంగా మార్చారని తెలిపారు. సొంత బిడ్డలపైనే ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేయాల్సి రావడం తన గుండెను పిండేసిందని విజయలక్ష్మి పేర్కొన్నారు. 2019 ఆగస్టు 31వ తేదీన కుటుంబం మధ్య జరిగిన 'మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్(ఎంవోయూ)' మేరకే సరస్వతి పవర్ షేర్ల బదలాయింపు జరిగిందన్నారు. ఎన్‌సీఎల్‌టీని తప్పుదారి పట్టించేలా జగన్ రాజకీయ ప్రేరిత వ్యాజ్యం వేశారని తల్లీ కుమార్తెలు పేర్కొన్నారు. వాటాల బదలాయింపుపై ఆయన చేస్తున్న 'క్లెయిమ్' అంతా తప్పేనని తెలిపారు. కాగా.. జగన్ పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీ సోమవారం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న ట్రిబ్యునల్.. తదుపరి విచారణను మార్చి 6కు వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.